
గురువారం 20, మార్చి 2025

https://www.telugudesam.org



# చైతన్యరథం

సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు



**గ్లోబల్ మారిటైమ్ పవర్‌హౌస్‌గా భారత్**

- సాగరమాల అపెక్స్ కమిటీ సమావేశంలో బీసీ జనార్ధన్
- సీఎం చంద్రబాబు సారధ్యంలో ఏపీ మారిటైమ్ అభివృద్ధికి కీలకమైన చర్యలు

10

# 'గేట్స్'తో భేటీ అద్భుతం



- బిల్ గేట్స్‌తో సమావేశం అనంతరం సీఎం చంద్రబాబు
- ఏపీ ప్రభుత్వం -గేట్స్ ఫౌండేషన్ మధ్య అవగాహన ఒప్పందం
- ఆరోగ్య, వ్యవసాయ, విద్యారంగాల్లో టెక్నాలజీ వినియోగం
- బిల్‌గేట్స్‌ను రాష్ట్రానికి ఆహ్వానించిన ముఖ్యమంత్రి చంద్రబాబు

2

ఏపీ ప్రగతి సాధనకు గేట్స్ ఫౌండేషన్ మద్దతుకు హృదయపూర్వక కృతజ్ఞతలు. టెక్నాలజీ ఆధారిత పరిపాలన, మానవ వనరుల అభివృద్ధి, ఆరోగ్యం, వ్యవసాయం, విద్యారంగాల్లో వినూత్న పరిష్కారాలను చూపేందుకు గేట్స్ ఫౌండేషన్‌తో ఏపీ చేసుకున్న ఒప్పందం ఎంతో దోహదపడుతుందని భావిస్తున్నా. *- సీఎం చంద్రబాబు నాయుడు*

ఏపీ ప్రభుత్వం గేట్స్ ఫౌండేషన్‌తో చేసుకున్న ఒప్పందం ద్వారా -తక్కువ ధరకు, సులభంగా లభ్యమయ్యే, స్థానికంగా తయారు చేసే వైద్య పరికరాలు, నాణ్యమైన వైద్య సేవలు అందించవచ్చు. తద్వారా ప్రజల జీవితాలను మార్చవచ్చు. ఆరోగ్యం, వ్యవసాయం, విద్యారంగాల్లో ఏఐ, టెక్నాలజీ వినియోగం ద్వారా అందరికీ ఆదర్శంగా ఏపీ నిలుస్తుందని భావిస్తున్నా. *- బిల్ గేట్స్*

## వైసీపీవల్లే చదువుకు చేటు

- వాళ్ల అనాలోచిత నిర్ణయాలతో పాఠశాలల్లో ప్రమాణాలు దిగజారాయి
- పాఠశాల విద్య, ఇంటర్‌లో 12 లక్షలమంది విద్యార్థులు తగ్గారు
- విద్యా ప్రమాణాల పెంపునకూ సంస్కరణలు చేపడుతున్నాం..
- ఉపాధ్యాయుల బదిలీల్లో రాజకీయ జోక్యం నివారిస్తాం
- మోడల్ ప్రైమరీ స్కూల్స్ ద్వారా తరగతికో టీచర్‌ని కేటాయిస్తాం
- మండలిలో సభ్యుల ప్రశ్నలకు విద్యా మంత్రి లోకేష్ సమాధానం

3



2

## వాళ్లకు.. 'డేటా'పై దృష్టే లేదు!

- ఎంతమంది విద్యార్థులు ఏ స్కూల్లో చదువుతున్నారో లెక్కలు లేవు
- దౌర్భాగ్య పరిస్థితికి.. ఆనాటి విద్యా మంత్రి బొత్స సమాధానం చెప్పాలి
- సర్కారీ బడులకు దూరమైన 12 లక్షలమంది విద్యార్థులపై చర్చకు సిద్ధం
- హౌస్ అజెండా బీఏసీ నిర్ణయిస్తుంది, వైసీపీ కాదు..
- మండలిలో బొత్స వ్యాఖ్యలకు మంత్రి లోకేష్ ఫైర్ కౌంటర్

4

## జీవో 117కు త్వరలో ప్రత్యామ్నాయం

- ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు పెంచేందుకు కృషి
- మండలిలో విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్



## మళ్లీ ఏపీ బ్రాండ్ తిరిగొచ్చింది!

- పారిశ్రామిక పునరుజ్జీవన చర్యలతో సత్ఫలితాలు
- రూ.7లక్షల కోట్ల పెట్టుబడులతో ప్రఖ్యాత సంస్థలు
- ఎస్క్రో ఖాతా ద్వారా సంస్థలకు నేరుగా ప్రోత్సాహకాలు
- మా లక్ష్యసాధనకు అశోక్ లేలాండ్‌వంటివి పెద్ద దన్ను
- విద్య, ఐటీ మంత్రి నారా లోకేష్ స్పష్టీకరణ
- మల్లవల్లి అశోక్ లేలాండ్ యూనిట్‌ను ప్రారంభించిన మంత్రి

5

## ఉపాధ్యాయ బదిలీల చట్టం ఒక చరిత్ర!

- వైసీపీ ప్రభుత్వంలో అడ్డగోలుగా టీచర్ల ట్రాన్స్‌ఫర్లు
- అందరితో చర్చించిన తర్వాతనే యాక్ట్‌ను తీసుకువచ్చాం
- పారదర్శకంగా ఉపాధ్యాయుల సీనియారిటీ లిస్ట్
- శాసనసభలో విద్య, ఐటీ మంత్రి నారా లోకేష్
- ఏపీ రాష్ట్ర ఉపాధ్యాయ బదిలీల క్రమబద్ధీకరణ బిల్లుకు సభ ఆమోదం

3

## సునీత వచ్చేశారు!

- సురక్షితంగా భూమికి చేరిన భారత సంతతి వ్యోమగామి
- బుచ్ విల్మోర్, మరో ఇద్దరు వ్యోమగాములూ భూమికి...
- ఫ్లోరిడా తీరంలో సాఫీగా దిగిన క్రూ డ్రాగన్

18



## అదే జోరు.. హుషారు!

- రెండోరోజూ ఉత్సాహభరితంగా ప్రజాప్రతినిధుల క్రీడలు
- రసవత్తరంగా సాగిన క్రికెట్ ఫైనల్ మ్యాచ్
- మంత్రి సత్యకుమార్ యాదవ్ టీమ్‌పై మంత్రి నాదెండ్ల టీమ్ విజయం
- పరుగు పందెంలో ప్రజాప్రతినిధుల అత్యుత్తమ ప్రదర్శన
- కోలాహలంగా మారిన ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం


8



## శరవేగంగా సన్నాహాలు!

- అమరావతిలో లక్ష కోట్ల పనులు, పెట్టుబడులు
- ప్రధాని మోదీకి రాష్ట్ర ప్రభుత్వ నివేదన
- సచివాలయ సమీపంలోనే ప్రారంభోత్సవ సభ

7



ఏపీ ప్రగతి సాధనకు గేట్స్ ఫౌండేషన్ మద్దతుకు హృదయపూర్వక కృతజ్ఞతలు. టెక్నాలజీ ఆధారిత పరిపాలన, మానవ వనరుల అభివృద్ధి, ఆరోగ్యం, వ్యవసాయం, విద్యరంగాల్లో వినూత్న పరిష్కారాలను చూపేందుకు గేట్స్ ఫౌండేషన్‌తో ఏపీ చేసుకున్న ఒప్పందం ఎంతో దోహదపడుతుందని భావిస్తున్నా.

– సీఎం చంద్రబాబు నాయుడు

ఏపీ ప్రభుత్వం గేట్స్ ఫౌండేషన్‌తో చేసుకున్న ఒప్పందం ద్వారా –తక్కువ ధరకు, సులభంగా లభ్యమయ్యే, స్థానికంగా తయారు చేసే వైద్య పరికరాలు, నాణ్యమైన వైద్య సేవలు అందించవచ్చు. తద్వారా ప్రజల జీవితాలను మార్చవచ్చు. ఆరోగ్యం, వ్యవసాయం, విద్యరంగాల్లో ఏఐ, టెక్నాలజీ వినియోగం ద్వారా అందరికీ ఆదర్శంగా ఏపీ నిలుస్తుందని భావిస్తున్నా.

– బిల్ గేట్స్



# గేట్స్‌తో భేటీ అద్భుతం

- బిల్ గేట్స్‌తో సమావేశం అనంతరం సీఎం చంద్రబాబు
- ఏపీ ప్రభుత్వం -గేట్స్ ఫౌండేషన్ మధ్య అవగాహన ఒప్పందం
- ఆరోగ్య, వ్యవసాయ, విద్యారంగాల్లో టెక్నాలజీ వినియోగం
- బిల్‌గేట్స్‌ను రాష్ట్రానికి ఆహ్వానించిన ముఖ్యమంత్రి చంద్రబాబు



న్యూ ఢిల్లీ (చైతన్య రథం): మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు బిల్‌గేట్స్‌తో ఏపీ సీఎం చంద్రబాబు భేటీ అయ్యారు. ఢిల్లీలో సుమారు 40నిమిషాల పాటు వీరిద్దరూ సమావేశమయ్యారు. భేటీ అనంతరం బిల్‌గేట్స్‌తో జరిగిన చర్చలకు సంబంధించిన వివరాలను సీఎం చంద్రబాబు 'ఎక్స్' వేదికగా వెల్లడించారు.

"బిల్ గేట్స్‌తో అద్భుతమైన సమావేశం జరిగింది. ఆంధ్రప్రదేశ్ ప్రజల అభివృద్ధి, సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వంతో గేట్స్ ఫౌండేషన్ సహకారంపై కీలక చర్చలు జరిపాం. ఆరోగ్య సంరక్షణ, విద్య, వ్యవసాయం, ఉపాధి కల్పనవంటి కీలక రంగాల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ప్రిడిక్టివ్ అనలిటిక్స్ వంటి అధునాతనసాంకేతిక పరిజ్ఞానాల వినియోగంపై చర్చించాం. స్వర్ణ ఆంధ్రప్రదేశ్-2047దార్శనికతను సాకారం చేసుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉంది. గేట్స్ ఫౌండేషన్‌తో ఈ భాగస్వామ్యం మన ప్రజలను శక్తిమంతం చేయడంతోపాటు ఈ లక్ష్యాన్ని సాధించడంలో కీలక పాత్ర పోషిస్తుందని నేను విశ్వసిస్తున్నాను" అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ పురోగతికి బిల్‌గేట్స్ తన సమయం, మద్దతు ఇచ్చినందుకు చంద్రబాబు హృదయపూర్వకంగా కృతజ్ఞతలు తెలిపారు.

ఇదిలావుంటే -ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గేట్స్ ఫౌండేషన్‌తో ఒప్పందం చేసుకుంది. పరిపాలనతోపాటు వివిధ శాఖల్లో టెక్నాలజీ ఆధారిత కార్యక్రమాల అమలుకు అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఆరోగ్య సంరక్షణ, మెడ్‌టెక్, విద్య, వ్యవసాయ రంగాల్లో ఖర్చు తగ్గింపు, ఉపాధి కల్పనవంటి రంగాల్లో విస్తృతస్థాయిలో ప్రయోజనాలు అందించే విధానాలను అభివృద్ధి చేసే అంశాలపై ఈ ఒప్పందం జరిగింది. ఈ ఒప్పందం ద్వారా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, గేట్స్ ఫౌండేషన్ ప్రభుత్వ పాలసీలు, కార్యక్రమాల్లో కొత్త ఆవిష్కరణలను అందించడానికి సంయుక్తంగా పనిచేయనున్నారు. ఆరోగ్య రంగంలో ఏఐ ఆధారిత టెక్నాలజీ ద్వారా ప్రిడిక్టివ్ అనలిటిక్స్, ఆటోమేటెడ్ డయాగ్నోస్టిక్స్ విభాగాల్లో గేట్స్ ఫౌండేషన్ సహకారం అందించనుంది. అదేవిధంగా వ్యవసాయ రంగంలో ఏఐ ఆధారిత కార్యక్రమాలకు, సాగు నిర్వహణలో శాటిలైట్ ఆధారిత వ్యవస్థలను ప్రవేశపెట్టనున్నారు. అదే కొత్త ఆవిష్కరణల ద్వారా ఉపాధి కల్పన అవకాశాలను మెరుగుపరచనున్నారు.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ, "గేట్స్ ఫౌండేషన్ మద్దతుకు నా హృదయపూర్వక కృతజ్ఞతలు. టెక్నాలజీ ఆధారిత పరిపాలన, మానవ వనరుల అభివృద్ధి, ఆరోగ్యం, వ్యవసాయం, విద్య రంగాల్లో వినూత్న పరిష్కారాలను చూపేందుకు ఈ ఒప్పందం ఎంతో దోహదపడుతుంది" అని వ్యాఖ్యానించారు. రాష్ట్రానికి రావాల్సిందిగా బిల్ గేట్స్‌ను సీఎం చంద్రబాబు ఆహ్వానించారు.

ఈ ఒప్పందం ద్వారా డేటా ఆధారిత అంశాల్లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చూపుతున్న చొరవ, సంకల్పాన్ని గేట్స్ ఫౌండేషన్ ఛైర్మన్ బిల్ గేట్స్ ప్రశంసించారు. "ఈ ఒప్పందం ద్వారా తక్కువ ధరకు, సులభంగా లభ్యమయ్యే, స్థానికంగా తయారు చేసే వైద్య పరికరాలు, నాణ్యమైన వైద్య సేవలు అందించవచ్చని, తద్వారా ప్రజల జీవితాలను మార్చవచ్చన్నారు. ఆరోగ్యం, వ్యవసాయం, విద్య రంగాల్లో ఏఐ, టెక్నాలజీ వినియోగం ద్వారా అందరికీ ఆదర్శంగా నిలవచ్చు" అని అన్నారు.

ఢిల్లీలోని హోటల్‌లో జరిగిన ఈ సమావేశంలో గేట్స్ ఫౌండేషన్‌తో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం చేసుకుంది. ఐటీ శాఖ సెక్రటరీ కాటంనేని భాస్కర్ గేట్స్ ఫౌండేషన్‌తో ఎంవోయూలో పాల్గొన్నారు. సమావేశంలో కేంద్ర మంత్రులు పెమ్మసాని, శ్రీనివాస వర్మ, ఎంపి శ్రీకృష్ణ దేవరాయులు, సిఎంవో అధికారులు పాల్గొన్నారు.

# జీవో 117కు త్వరలో ప్రత్యామ్నాయం

- ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు పెంచేందుకు కృషి
- మండలిలో విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్

అమరావతి(చైతన్య రథం):రాష్ట్రంలో గత ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో 117కు ప్రత్యామ్నాయం తీసుకు వస్తామని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. పాఠశాలలు, ఉపాధ్యాయుల హేతు బద్ధీ కరణపై మండలిలో సభ్యులు అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లా డుతూ.. జీవో 117వల్ల మొదటి తరగతి నుంచి పదో తరగతి వరకు 10,49,596మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలకు దూరమయ్యారు. 10మంది పిల్లల కంటే తక్కువున్న పాఠశాలలు 2021-22లో 1215ఉంటే.. అది 5312కు పెరిగాయి. అంటే నాలుగురెట్లు ఎక్కువ గా పెరిగాయి. 20 మంది విద్యా ర్థుల కంటే తక్కువ ఉన్న పాఠశాలలు 5,520 ఉంటే, అది 14,052 పాఠశాలలకు పెరిగాయి. సింగిల్ టీచర్స్ ఉన్న పాఠ శాలలు 12,512 ఉన్నాయి. పాద యాత్రలో హామీ మేరకు జీవో 117కు ప్రత్యామ్నాయం తీసుకు రావడం జరుగుతోంది. ఒక్క పాఠశాలను కూడా మూసివేయబోం.

### సర్కారీ బడుల్లో అడ్మిషన్ల పెంపునకు కృషి

అందరినీ భాగస్వామ్యం చేసి ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు పెంచేందుకు కృషిచేస్తున్నాం. 60 మంది కంటే ఎక్కువ విద్యార్థులు ఉంటే..వన్ క్లాస్, వన్ టీచర్ అందిస్తున్నాం. 7 నుంచి 8వేల మోడల్ ప్రైమరీ పాఠశాలలు ఏర్పాటుచేస్తాం. ప్రతి పంచాయతీకి మోడల్ స్కూల్ ఇవ్వాలని కోరుతున్నారు. రెండో విడతలో ప్రతి పంచాయతీ మోడల్ స్కూల్ ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. అది సాధిస్తాం. అప్పర్ ప్రైమరీ స్కూల్స్‌ను కొనసాగిస్తాం. ప్రీ స్కూల్స్ విషయంలో ఫ్రేమ్ వర్క్ పై చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు.



### విద్యలో కాషాయికరణపై ఆధారాలుంటే బయటపెట్టాలి

అంతకుముందు విద్యలో కాషాయికరణ అంటూ వైసీపీ ఎమ్మెల్సీ పండుల రవీంద్రబాబు చేసిన వ్యాఖ్యలపై మంత్రి నారా లోకేష్ అభ్యంతరం వ్యక్తం చేశారు. కులం, మతం, ప్రాంతాలకు అతీతంగా విద్యార్థులు బాగా చదువుకోవాలని కోరుకునే వ్యక్తులం మనం. కరిక్యులమ్ విషయంలో మతాన్ని తీసుకురావడం సరికాదు. వైసీపీ హయాంలో ఇచ్చిన డిక్షనరీలో దేవుడు అంటే అర్థం ఏమిటి? ఇస్లాం గురించి మాట్లాడారు, క్రిస్టియానిటీ గురించి మాట్లాడారు. హిందూమతం గురించి ఎక్కడా మాట్లాడలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దేవుడు అందరివాడు.. ముస్లీం, క్రిస్టియన్, హిందూ అయినా అందరివాడని మేం పెట్టాం. ఏమతాన్ని కించపరచలేదు. అనవసరమైన వివాదాన్ని లేవనెత్తుతున్నారు. విద్యలో కాషాయికరణపై ఆధారాలు ఉంటే బయటపెట్టాలి. మేం తీసుకువచ్చిన పుస్తకాల్లో కులాలు, మతాలు, ప్రాంతాలకు అతీతంగా తీసుకువచ్చాం. విద్యారంగంపై చర్చలో పాల్గొనకుండా వైసీపీ సభ్యులు ఎందుకు పారిపోయారు. సభను తప్పుదారి పట్టించడం సరికాదు. కాషాయికరణపై సభ్యుని వ్యాఖ్యలు ఉపసంహరించుకోవాలి. లేనిపోని ఆరోపణలు చేస్తున్నారు. దీనిపై నేను నిరసన వ్యక్తం చేస్తున్నాను. దక్షిణ భారతదేశంలో గత ప్రభుత్వం ఎన్ఈపీ అమలుచేస్తే.. వైసీపీ హయాంలో సింగిల్ మేజర్ సిస్టమ్‌ను తీసుకువచ్చారన్నారు. ఈ అంశంపై మండలి పక్ష నేత బొత్స సత్యనారాయణ స్పందిస్తూ.. రికార్డులు చూసి సభ్యుని వ్యాఖ్యలు తొలగించాలన్నారు.

# వైసీపీవల్లే చదువుకు చేటు

- వాళ్ల అనాలోచిత నిర్ణయాలతో పాఠశాలల్లో ప్రమాణాలు దిగజారాయి
- పాఠశాల విద్య,ఇంటర్‌లో 12లక్షల మంది విద్యార్థులు తగ్గారు
- విద్యా ప్రమాణాల పెంపునకూ సంస్కరణలు చేపడుతున్నాం..
- ఉపాధ్యాయుల బదిలీల్లో రాజకీయ జోక్యం నివారిస్తాం
- మోడల్ ప్రైమరీ స్కూల్స్ ద్వారా తరగతికో టీచర్‌ని కేటాయిస్తాం
- మండలిలో సభ్యుల ప్రశ్నలకు విద్యా మంత్రి లోకేష్ సమాధానం

అమరావతి (చైతన్య రథం): వైసీపీ అనాలోచిత నిర్ణయాలతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాప్రమాణాలు దారుణంగా పడిపోయాయని విద్య, ఐటీ మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. అసర్ నివేదిక, 2018లో పాఠశాలల్లో సదుపాయాలు, విద్యా ప్రమాణాలు మెరుగ్గా ఉండి, 2022-24 మధ్యకాలంలో పతనం కావడంపై శాసనమండలిలో సభ్యులు దువ్వారపు రామారావు, పి.అశోక్ బాబు, బి.తిరుమలనాయుడు అడిగిన ప్రశ్నకు మంత్రి లోకేష్ సమాధానం ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. 2014-24 మధ్య పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను బేరీజు వేస్తే .. వైసీపీ పాలనలో ఐదో తరగతి విద్యార్థులు రెండో తరగతి తెలుగు పుస్తకం చదివేందుకు ఇబ్బంది పడ్డారు. 2014లో 57శాతం మంది విద్యార్థులు చదవగలిగితే, జగన్ రెడ్డి పాలనలో 37.5 శాతానికి పడిపోయిందని అసర్ నివేదిక స్పష్టం చేసింది. 8వ తరగతి విద్యార్థులు రెండో తరగతి తెలుగు పుస్తకాన్ని 2014లో సుమారు 80శాతం మంది చదవగలిగితే.. 2024కు వచ్చేనాటికి 53శాతానికి పడిపోయింది. మూడో తరగతి విద్యార్థుల్లో 85శాతం మంది విద్యార్థులు కనీసం రెండో తరగతి టెక్ట్స్ బుక్ చదవలేకపోతున్నారు. ఐదో తరగతి విద్యార్థుల్లో 63 శాతం విద్యార్థులు బేసిక్ గ్రేడింగ్ చేయలేకపోతున్నారు. 8వ తరగతి విద్యార్థులను పరిశీలిస్తే.. కనీసం 50శాతం మంది విద్యార్థులు ఫ్లూయెంట్ గా మాట్లాడలేకపోతున్నారు. 3వ తరగతి పిల్లలను చూస్తే 60శాతం మంది బేసిక్ సబ్ ట్రాక్షన్ చేయలేకపోతున్నారు. 8వ తరగతి పిల్లలను చూస్తే 55శాతం మంది బేసిక్ డివిజన్ కూడా చేయలేకపోతున్నారు. 90శాతం మంది మూడో తరగతి విద్యార్థులకు బేసిక్ ఫౌండేషన్ న్యూమరసీ స్కిల్స్ కూడా లేవని అసర్ నివేదిక తేటతెల్లం చేసింది.

### పాఠశాల విద్య, ఇంటర్‌లో 12 లక్షల మంది విద్యార్థులు తగ్గారు

వైసీపీ హయాంలో ప్రభుత్వ పాఠశాలలు, ఇంటర్మీడియట్ కలిపి సుమారు 12 లక్షల మంది విద్యార్థులు తగ్గిపోయారు. ఇప్పుడు ఆ సంఖ్య 33.4 లక్షలుగా ఉంది. వైసీపీ పాలనలో అనాలోచిత నిర్ణయాలు, చర్చ లేకుండా సంస్కరణలు తీసుకువచ్చి విద్యార్థులు,ఉపాధ్యాయులపై,తల్లిదండ్రులపై రుద్దారు. 117 జీవోలో స్థానిక అంశాలను పరిగణనలోకి తీసుకోకపోవడంతో విద్యార్థులు ప్రైవేటు పాఠశాలల్లో చేరారు. కూటమి ప్రభుత్వ హయాంలో విద్యా ప్రమాణాలు పెంచేందుకు 10,15 సంస్కరణలు తీసుకువస్తున్నాం. ఉపాధ్యాయుల బదిలీల్లో రాజకీయ



జోక్యాన్ని నివారిస్తాం. అవుట్ కమ్ బేస్డ్ గా జరగాలని కేబినెట్ లో కూడా టీచర్ ట్రాన్స్ ఫర్ యాక్ట్ తీసుకురావడం జరిగింది. ఈరోజు అసెంబ్లీలో పెట్టడం జరిగింది. రేపు కౌన్సిల్ కు వస్తుంది.

### బోధనలో సాంకేతికతను జోడిస్తాం

బోధనలో సాంకేతికతను జోడిస్తాం. ఉపాధ్యాయులు కూడా పాఠాలు బోధించిన తర్వాత 60సెకన్ల వీడియో ప్రదర్శించి ఆ పాఠాన్ని సమ్మప్ చేసి, క్లిక్కర్ టెక్నాలజీ ద్వారా పిల్లలను అసెస్ చేస్తాం. అక్కడి నుంచి ప్రిస్క్రిప్టివ్ హోంవర్క్ ఇస్తాం. మెగా టీచర్-పేరెంట్ మీటింగ్ ఇప్పటికే నిర్వహించాం. వచ్చే విద్యా సంవత్సరంలో రెండు సార్లు నిర్వహిస్తాం. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పిల్లల మధ్య ఇంటరాక్షన్ కోసం అద్భుతమైన ప్రోగ్రెస్ రిపోర్ట్ కార్డును కూడా రూపొందించడం జరిగింది.

### మోడల్ ప్రైమరీ స్కూల్స్ ఏర్పాటు ద్వారా తరగతికో ఉపాధ్యాయుడిని కేటాయిస్తాం

మోడల్ ప్రైమరీ స్కూల్ కాన్సెప్ట్ ద్వారా 60 మంది విద్యార్థుల కంటే ఎక్కువగా ఉంటే తరగతికో ఉపాధ్యాయుడిని కేటాయించి మెరుగైన విద్య అందించాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం కృషిచేస్తోంది. దేశంలో ఏ రాష్ట్రం హామీ ఇవ్వని విధంగా గ్యారంటీడ్ ఎఫ్ఎల్ఎన్ అందించాలనే లక్ష్యంతో పనిచేస్తున్నాం. ఉపాధ్యాయ సంఘాలతో చర్చలు జరుపుతున్నాం. ఇప్పుడు జరుగుతున్న పది, ఇంటర్ పరీక్షల్లోనే మార్పు కనిపిస్తుంది. వచ్చే విద్యాసంవత్సరంలో లీప్స్ అండ్ బౌండ్స్ అవుట్ కమ్స్ ఇంప్రూవ్ చేసే బాధ్యత కూటమి ప్రభుత్వం తీసుకుంటుందని చెప్పారు.

అంతకుముందు ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు మాట్లాడుతూ.. 2019-24 మధ్య కాలంలో పాఠశాలల్లో విద్యాప్రమాణాలు పడిపోయాయని అసర్ నివేదిక స్పష్టం చేస్తోందని, పాఠశాలల్లో సదుపాయాలు కల్పించలేదన్నారు. 2018లో ప్రమాణాలు చాలా మెరుగ్గా ఉన్నాయి. వైసీపీ హయాంలో నాడు-నేడు కార్యక్రమం, 117 జీవోతో 3,4 తరగతులను ఉన్నత పాఠశాలల్లో విలీనం చేశారు. దీంతో ఆ ప్రయోగాలు వికటించాయి. దీంతో విద్యార్థుల సంఖ్య తగ్గడంతో పాటు విద్యా ప్రమాణాలు పడిపోయాయి. అక్షరాలు, అంకెలు గుర్తుపట్టలేని స్థితిలో పిల్లలు ఉన్నారన్నారు. ఎమ్మెల్సీ బీటీ నాయుడు మాట్లాడుతూ.. 2018 వరకు అన్ని పాఠశాలల్లో సదుపాయాలు, విద్యా ప్రమాణాలు మెరుగ్గా ఉన్నాయి. 2022-24 మధ్య విద్యాప్రమాణాలు క్షీణించాయి. నాడు-నేడు పేరుతో విద్యావ్యవస్థను నిర్వీర్యం చేశారన్నారు.

# ఉపాధ్యాయ బదిలీల చట్టం ఒక చరిత్ర!

- వైసీపీ ప్రభుత్వంలో అడ్డగోలుగా టీచర్ల ట్రాన్స్‌ఫర్లు
- అందరితో చర్చించిన తర్వాతనే యాక్ట్‌ను తీసుకువచ్చాం
- పారదర్శకంగా ఉపాధ్యాయుల సీనియారిటీ లిస్ట్
- శాసనసభలో విద్య, ఐటీ మంత్రి నారా లోకేష్
- ఏపీ రాష్ట్ర ఉపాధ్యాయ బదిలీల క్రమబద్ధీకరణ బిల్లుకు సభ ఆమోదం



అమరావతి (చైతన్య రథం): రాష్ట్రంలో ఉపాధ్యాయ బదిలీల చట్టం ఒక చరిత్రని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. ఏపీ రాష్ట్ర ఉపాధ్యాయ బదిలీల క్రమబద్ధీకరణ బిల్లు-2025 ను విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ శాసనసభలో ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఈ బిల్లు ద్వారా కూటమి ప్రభుత్వం చరిత్ర సృష్టించబోతోంది. ఉపాధ్యాయుల బదిలీల విషయంలో చంద్రబాబు గారి పాలనలో పారదర్శకంగా వ్యవహరించడం జరిగింది. ఏపీ ఎడ్యుకేషన్ యాక్ట్-1982లో లీగల్ అథారిటీ ఆనాడు కల్పించడం జరిగింది. 1998లో ఆనాడు చంద్రబాబునాయుడు గారు జడ్పీ స్కూల్ అడ్మినిస్ట్రేషన్ మొత్తం జడ్పీ సీఈవో నుంచి డీఈవోకు అప్పగించడం జరిగింది. 2012-15 మధ్య కూడా అనేక సంస్కరణలు తీసుకువచ్చాం. అనేక రెగ్యులేషన్స్ తీసుకురావడం జరిగింది. పాయింట్ బేస్ కోరింగ్ సిస్టమ్ ఆనాడు అమలుచేశాం. 2015లో వెబ్ బేస్డ్ ఆన్ లైన్ ట్రాన్స్ ఫర్ కౌన్సిలింగ్ సిస్టమ్ తీసుకురావడం జరిగింది. 2017లో గైడ్ లైన్స్ తీసుకువచ్చి కంపల్సరీ ట్రాన్స్ ఫర్స్ కూడా అమలుచేయడం జరిగింది. జిల్లా, మండల పరిషత్, మున్సిపల్ స్కూల్స్ విషయానికి వస్తే వారికి సొంత మార్గదర్శకాలు ఉన్నాయి. గతంలో అనేక కోర్టు కేసులు, కంటెమ్ప్ట్ ఆఫ్ కోర్టు కూడా ఉన్నాయి. అందేకే ఏకీకృత చట్టం తీసుకురావాలని భావించాం.

### గత ప్రభుత్వంలో అడ్డగోలుగా ఉపాధ్యాయ బదిలీలు

గత ప్రభుత్వంలో అడ్డగోలుగా ఉపాధ్యాయ బదిలీలు చేశారు. ఒక పద్ధతిని పాటించకుండా ఇష్టారాజ్యంగా చేశారు. ఎన్నికల సమయంలో కూడా 1100 మంది ఉపాధ్యాయులను ఏకపక్షంగా ట్రాన్స్ ఫర్ చేశారు. కోర్టు జోక్యం చేసుకుని రద్దు చేయడం జరిగింది. కావాలని కొంతమందిపై రాజకీయ కక్షతో బదిలీలను నిలిపివేశారు. గడచిన ఐదేళ్లలో అనేక లిటిగేషన్స్ వచ్చాయి. అనేకసార్లు కోర్టులు కూడా జోక్యం చేసుకున్నాయి. ఒక యాక్ట్ తీసుకువచ్చి పారదర్శకంగా ఉపాధ్యాయ బదిలీలను చేపట్టాలనే లక్ష్యంతో పనిచేశాం. రాజకీయ జోక్యాన్ని నివారించాల్సిన అవసరం ఉంది. బోధనపైనే ఉపాధ్యాయులు దృష్టిపెట్టాలనే ఆలోచనతో ప్రభుత్వం ఉంది. ఈ ఆన్ లైన్ ద్వారా ట్రాన్సపరెన్సీ, అకౌంటబులటీ కూడా తీసుకువస్తాం. గ్రీవెన్స్ రిడ్రెసెల్ మెకానిజం కూడా ఈ బిల్లులో పొందుపర్చడం జరిగింది. గైడ్ లైన్స్ ఎఫెక్టివ్ గా రూపొందించాలనే లక్ష్యంతో ఉన్నాం.

### అందరితో చర్చించిన తర్వాతనే యాక్ట్‌ను తీసుకువచ్చాం

గతంలో గైడ్ లైన్స్ లీగల్‌గా బలహీనంగా ఉండేవి. ఈ యాక్ట్ ద్వారా బలంగా ఉంటాయి. స్థిరత్వం ఏర్పడుతుంది. ఎన్ ఫోర్స్ బులిటీ నూటికి నూరుశాతం చేయవచ్చు. పారదర్శక విధానంతో ఉపాధ్యాయుల సీనియారిటీ, తదితర విషయాలు తెలుసుకోవచ్చు.గత ప్రభుత్వం మాదిరిగా ఏకపక్ష చట్టాలు ఈ కూటమి ప్రభుత్వం రూపొందించడం లేదు. ఒక సంస్కరణ తీసుకురావాలంటే అందరితో చర్చించడం జరుగుతోంది. ఇప్పటికే అనేక ఉపాధ్యాయ సంఘాలతో చర్చించాం. వైసీపీ సంఘంతో కూడా చర్చించాం. ట్రాన్స్ ఫర్ గైడ్ లైన్స్ కూడా అందుబాటులో ఉంచడం జరిగింది. జీవో 117కు ప్రత్యామ్నాయం తీసుకువచ్చి ఈ యాక్ట్‌ను అమలు చేయాలని భావించాం. ప్రమోషన్స్ చాలా పారదర్శకంగా చేస్తాం. ఉపాధ్యాయుల నుంచి కూడా అభిప్రాయసేకరణ చేశాం. 7,735సలహాలు వచ్చాయి. అవన్నీ పరిగణనలోకి తీసుకుని ముసాయిదాను రూపొందించడం జరిగింది. పొరుగు రాష్ట్రాల్లో కూడా పరిశీలించడం జరిగింది. కర్ణాటక, ఉత్తరాఖండ్, అస్సాంలో ఈ టీచర్ ట్రాన్స్ ఫర్ యాక్ట్ అమల్లో ఉంది.

### పారదర్శకంగా ఉపాధ్యాయుల సీనియారిటీ జాబితా

తండాల్లో ఉన్న ప్రభుత్వ పాఠశాలల నుంచి మున్సిపాలిటీల వరకు విద్యార్థులకు సమర్థమైన ఉపాధ్యాయులను అందించాలి, మెరుగైన విద్య అందించాలనే లక్ష్యంతో ఈ యాక్ట్ ను రూపొందించడం జరిగింది. ఐటీడీఏ ప్రాంతాల్లో పనిచేసే ఉపాధ్యాయులకు అదనపు పాయింట్స్ ఇచ్చి ప్రోత్సహించాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం ఉందన్నారు. ఈ ఏడాది జూన్ నాటికి సంస్కరణలు పూర్తిచేసి ఎగ్జిక్యూట్ చేస్తామన్నారు. ఉపాధ్యాయుల సీనియారిటీ లిస్ట్ పారదర్శకంగా రూపొందిస్తున్నామన్నారు. డీఎస్సీ నోటిఫికేషన్ కూడా జారీచేస్తామన్నారు.

### ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి మాట్లాడుతూ..

ప్రజాస్వామ్యంలో పారదర్శకత ముఖ్యం. గతంలో ఉపాధ్యాయుల నియామకాల్లో, బదిలీల్లో అవినీతి, అక్రమాలు జరిగాయి. మంత్రి నారా లోకేష్ తీసుకువచ్చిన చట్టం



మంచి చట్టమని అన్నారు. బిల్లును పూర్తిగా సమర్థిస్తున్నామని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలలను మరింత మెరుగ్గా తీర్చి దిద్దాలని కోరారు. బీజేపీ ఫ్లోర్ లీడర్ విష్ణుకుమార్ రాజు మాట్లాడుతూ.. ఉన్నత విలువలు, ఉన్నత విద్య అభ్యసించిన వ్యక్తికి విద్యాశాఖ అప్ప గించడం ఏపీకి మంచిదని అన్నారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. ఏపీ రాష్ట్ర ఉపాధ్యాయ బదిలీల క్రమబద్ధీ కరణ బిల్లుకు సభ ఆమోదం తెలిపింది.

# వాళ్లకు.. ‘డేటా’పై దృష్టే లేదు!

- ఎంతమంది విద్యార్థులు ఏ స్కూల్లో చదువుతున్నారో లెక్కలు లేవు
- దౌర్భాగ్య పరిస్థితికి.. ఆనాటి విద్యా మంత్రి బొత్స సమాధానం చెప్పాలి
- సర్కారీ బడులకు దూరమైన 12 లక్షల మంది విద్యార్థులపై చర్చకు సిద్ధం
- హౌస్ అజెండా బీఏసీ నిర్ణయిస్తుంది, వైసీపీ కాదు..
- మండలిలో బొత్స వ్యాఖ్యలకు మంత్రి లోకేష్ ఫైర్ కౌంటర్

అమరావతి (చైతన్య రథం): వైసీపీ హయాంలో ఎంతమంది విద్యార్థులు ఏ స్కూలులో చదువుతున్నారో డేటా లేదని, ఆ పరిస్థితికి ఆనాడు విద్యా మంత్రిగా పనిచేసిన బొత్స సమాధానం చెప్పాలని విద్య, ఐటీ మంత్రి నారా లోకేష్ ధ్వజమెత్తారు. ప్రభుత్వ పాఠశాలలు, ఇంటర్‌లో 12 లక్షల మంది విద్యార్థులు తగ్గారనే అంశంపై మండలి పక్ష నేత బొత్స సత్యనారాయణ అభ్యంతరం వ్యక్తం చేశారు. దీనిపై మంత్రి స్పందిస్తూ.. విద్యారంగంపై సభలో చర్చ జరిగినప్పుడు వైసీపీ సభ్యులు పారిపోయారు. ఇప్పుడు ప్రశ్నిస్తున్నారు. హౌస్ అజెండా బీఏసీ నిర్ణయిస్తుంది. విద్యలో సంస్కరణలపై చర్చ జరగాలని వైసీపీనే కోరింది. మేం సన్నద్ధమై సభకు వచ్చాం. హౌస్ ఛైర్మన్ ఆదేశాల ప్రకారం నడుస్తుంది. ప్రతిపక్ష పార్టీ చెప్పినట్లు నడవదు. తమకు కావాల్సినప్పుడు చర్చ పెట్టాలని, ఈ రోజు మూడ్ బాగాలేదు, మేం బయటకు వెళ్లాలని, వేరే పనులున్నాయని, పార్టీ మీటింగ్‌లు ఉన్నాయని వాయిదా వేయాలనుకుంటే అందుకు ప్రభుత్వం, ఛైర్మన్ సిద్ధంగా లేరని మండిపడ్డారు. బొత్స సీనియర్ నాయకులని, మంత్రిగా పనిచేశారని, ఆలోచించి మాట్లాడాలని అన్నారు. విద్యారంగంపై సభలో విపులంగా చర్చించడం జరిగింది. నోట్ కూడా ఇచ్చాం. అది చదవాలని వైసీపీ సభ్యులకు సూచించారు.

### సర్కారీ స్కూళ్ల డ్రాపవుట్స్‌పై చర్చకు రెడీ

ప్రభుత్వ పాఠశాలలు, ఇంటర్ విద్యలో 12 లక్షల మంది విద్యార్థులు తగ్గారనే వ్యాఖ్యలకు నేను కట్టుబడి ఉన్నా. బొత్స మంత్రిగా ఉన్నప్పుడు పాఠశాల విద్యలో ఎంతమంది విద్యార్థులు చదివారో లెక్కలు చెప్పాలని సవాల్ చేశారు. దీనిపై చర్చకు సిద్ధం. ఎక్కడ తగ్గారు, ఏ పాఠశాలలో తగ్గారు, ఎక్కడికి వెళ్లారు, ఏ ప్రైవేటు పాఠశాలలో సంఖ్య పెరిగిందో మేం చెబుతాం. వైసీపీ హయాంలో డ్రాప్ బాక్స్ విధానం తీసుకువచ్చారు. గ్రాస్ ఎన్ రోల్ మెంట్ రేషియో పెంచేందుకు విద్యార్థులను డ్రాప్ బాక్స్ లో పెట్టారు. 17 ఏళ్ల కంటే ఎక్కువ వయస్సున్న విద్యార్థులు లక్ష మంది పాఠశాల విద్యలో ఉన్నారు. ఆ వివరాలన్నీ ఇవ్వగలం. టోఫెల్ గురించి మాట్లాడుతున్నారు. నేషనల్ అచీవ్ మెంట్ సర్వే చూస్తే.. 2017లో ఇంగ్లీష్ లో భారతదేశంలో నాలుగో స్థానంలో ఉన్నాం. వైసీపీ హయాంలో 14 స్థానానికి ఎందుకు పడిపోయామో సమాధానం చెప్పాలి. పదో తరగతి సోషల్ సైన్స్ లో 6వ స్థానం నుంచి 24వ స్థానానికి ఎలా పడిపోయామో చెప్పాలి. సైన్స్ విషయానికి వస్తే మొదటిస్థానం నుంచి 15వ స్థానానికి పడిపోయాం. గణితంలో మొదటిస్థానం నుంచి 12వ స్థానానికి ఎలా పడిపోయామో చెప్పాలి.

### ‘ఐబీ’ని అమలు చేసిన పాఠశాలలేవీ?

ఐబీ విషయానికి వస్తే కేవలం ఒక కన్సల్టింగ్ రిపోర్ట్ కోసం రూ.4.86 కోట్లు ఖర్చు పెట్టారు. ఐబీ కరిక్యులమ్ అమలు చేశామని ఎలా చెబుతారు? ఏ పాఠశాలలో అమలు చేశారు ఐబీ? సమాధానం చెప్పాలి. సీబీఎస్ఈ విషయంలో విద్యార్థులను సన్నద్ధం చేయలేదు. మాక్ టెస్ట్ నిర్వహిస్తే కనీసం ఒక సబ్జెక్ట్ లో 90శాతం మంది ఫెయిల్ అయ్యారు. ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వకుండా, పిల్లలను సన్నద్ధం చేయకుండా సీబీఎస్ఈ తీసుకువచ్చారు.



ఇప్పుడు పరీక్షలకు అనుమతిస్తే.. వారు ఫెయిల్ అయితే సోషల్ ఇష్యూస్ వస్తాయి. చిన్న వయసులోనే పెళ్లిచేస్తారు. సీబీఎస్ఈ విధానాన్ని మేం ఉపసంహరించలేదు, వాయిదా వేశాం. టోఫెల్ కు రూ.60 కోట్లు ఖర్చుపెట్టారు. ఎందుకు ఇంగ్లీష్ పడిపోయిందో సమాధానం చెప్పాలి. ఆ రోజు నేను సుదీర్ఘంగా చర్చించాం. అప్పుడు చర్చలో పాల్గొనకుండా ఈ రోజు వచ్చి మాట్లాడటం సరికాదు. హౌస్ రూల్స్ బొత్స గారికి తెలుసు. ఏ అంశంపైనైనా చర్చకు మేం సిద్ధంగా ఉన్నాం.

కనీసం ఎంతమంది పిల్లలు, ఏ స్కూల్ లో చదువుతున్నారో డేటా లేకుండా వైసీపీ చేసింది. రెండేళ్లు మంత్రిగా పనిచేసిన బొత్స.. డేటా ఎందుకు లేదో సమాధానం చెప్పాలి. ఏ టీచర్ ఏ స్కూల్ లో పాఠాలు చెబుతున్నారో డేటా లేదు. సమాధానం చెప్పాలి. ఏ డేటా లేక బేసిక్ డ్యాష్ బోర్డ్ తయారు చేయలేకపోతున్నాం. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రిగా పనిచేసిప్పుడు 6నెలల్లో డ్యాష్ బోర్డు రూపొందించాం. గ్రిప్ వచ్చింది. విద్యారంగంలో ఇప్పుడిప్పుడే డ్యాష్ బోర్డ్ తయారవుతోంది.

### విద్యార్థులను సభలకు వాడుకునే కుసంస్కారం మాకు లేదు

నూటికి నూరు శాతం ఉపాధ్యాయులు పాఠాలే చెప్పాలనే విధానానికి కట్టుబడి ఉన్నాం. యాప్ ల భారం తగ్గిస్తున్నాం. సింగిల్ యాప్ తీసుకువస్తున్నాం. ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దాలనే లక్ష్యంతో పనిచేస్తున్నాం. పిల్లలను రాజకీయ కార్యక్రమాలకు పంపడం లేదు. గత వైసీపీ పాలనలో మాదిరిగా సీఎం కార్యక్రమానికి పిల్లలను తీసుకెళ్లి దారిపొడవునా నిల్చోబెట్టడం లేదు. పిల్లలు స్కూల్ లో ఉండాలి. వారు ప్రయోజకులుగా మారాలనేదే మా లక్ష్యం. మేం పరదాలు కట్టుకుని తిరగడం లేదు. ఉపాధ్యాయ సంఘాలతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నాం. పాజిటివ్ వాతావరణం తీసుకువస్తున్నాం. ఉపాధ్యాయులు సహకరిస్తున్నారు కాబట్టే విద్యారంగంలో సంస్కరణలు తీసుకురాగలుగుతున్నాం.

### ప్రమాణాల పెంపును ఛాలెంజ్‌గా తీసుకున్నాం

సింగిల్ టీచర్స్ స్కూల్స్ విషయానికి వస్తే 12,512 పాఠశాలల్లో సింగిల్ టీచర్ ఉన్నారు. ఇది వాస్తవం. 30శాతం పాఠశాలల్లో సింగిల్ టీచర్ ఉన్నారు. అందుకే మోడల్ ప్రైమరీ స్కూళ్ల కింద కనీసం 7,8 వేల ప్రైమరీ స్కూల్స్ వస్తే ఒక తరగతికి ఒక ఉపాధ్యాయుడిని అందించే అవకాశం ఏర్పడుతుంది. అందరం కలిసికట్టుగా చేస్తున్నాం. దీనివల్ల లెర్నింగ్ అవుట్ కమ్స్ మెరుగుపడతాయని మేం బలంగా నమ్ముతున్నాం. ప్రభుత్వ పాఠశాలల్లో సీటుకు రికమెండ్ చేయాలని ఎప్పుడైతే ప్రజాప్రతినిధులను తల్లిదండ్రులు అడుగుతారో అప్పుడే ప్రభుత్వ పాఠశాలల్లో ప్రమాణాలు పెరిగాయనే నమ్మకం ఏర్పడుతుంది. దీనిని ఛాలెంజ్ గా తీసుకున్నామని, ఇందుకు రెండేళ్ల సమయం ఇవ్వాలని, కచ్చితంగా చేసి చూపిస్తామని మంత్రి చెప్పారు.

అంతముందు బొత్స వ్యాఖ్యలపై ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ స్పందిస్తూ.. సభలో ఎప్పుడు ఏ చర్చ జరగాలనేది ఛైర్మన్ నిర్ణయిస్తారని, విద్యారంగంపై జరిగిన చర్చలో పాల్గొనకుండా ప్రశ్నోత్తరాల సమయంలో విద్యారంగంపై చర్చకు పట్టుబట్టడం, తాము చెప్పిందే జరగాలనే ఆలోచన సరికాదని, ఛైర్మన్ నిర్ణయాన్ని తప్పుబట్టేవిధంగా వ్యవహరించిన బొత్స క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

## ప్రయివేట్ రంగంలో
# వర్శిటీలకు ప్రోత్సాహం

- శాసనసభలో విద్య, ఐటీ మంత్రి లోకేష్
- ప్రయివేట్ వర్శిటీల బిల్లుకు సభామోదం

అమరావతి (చైతన్య రథం): రాష్ట్రంలో ప్రైవేటు విశ్వవిద్యాలయాలను ప్రోత్సహిస్తామని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. ప్రైవేటు విశ్వవిద్యాలయాల స్థాపన, క్రమబద్ధీకరణ రెండో సవరణ బిల్లు-2025ను మంత్రి నారా లోకేష్ శాసనసభలో ప్రవేశపెట్టారు. సభ ఆమోదించడం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలో సెంచూరియన్ యూనివర్సిటీ తీసుకురావడం జరిగింది. సాంకేతిక అంశాల్లో ఇబ్బందులు తలెత్తాయి. ప్రైవేటు రంగంలో విశ్వవిద్యాలయాలను ప్రోత్సహించాలనే లక్ష్యంతో ఉన్నాం. గ్రీన్ ఫీల్డ్ గురించి ఇప్పటికే చర్చించాం. బ్రౌన్ ఫీల్డ్ కింద ప్రైవేటు యూనివర్సిటీగా గుర్తించాలని కోరుకున్నప్పుడు..కేంద్ర, రాష్ట్ర నిబంధనల ప్రకారం వీవీఐటీ ప్రైవేటు యూనివర్సిటీ గా గుర్తించాలని కోరడం జరిగింది. వారికి 50 ఎకరాల భూమి ఉంది. 4,75,278 చ.అడుగుల బిల్టప్ ఏరియా ఉంది. సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్, ఇంక్యుబేటర్ సెంటర్స్ ఉన్నాయి. 11 యూజీ, పీజీ కోర్సులు ఉన్నాయి. సుమారు 700 మంది సిబ్బంది ఉన్నారు. 9,200 మంది విద్యార్థులు ఉన్నారు. ఈ సొసైటీ పెద్దఎత్తున పెట్టుబడులు పెట్టేందుకు సిద్ధంగా ఉంది. వీవీఐటీని వీవీఐటీయూగా మార్చాలని కోరారు. అది కూడా 2016 యాక్ట్ కింద కన్వర్ట్ చేయాలని కోరారు. ఈ యాక్ట్ గ్రీన్ ఫీల్డ్ అంటే కొత్త యూనివర్సిటీ, మరొకటి బ్రౌన్ ఫీల్డ్.. అంటే కన్వర్షన్. వీవీఐటీ కన్వెర్షన్ కింద బ్రౌన్ ఫీల్డ్ యూనివర్సిటీ గా గుర్తించాలని కోరడం జరిగింది. యూనివర్సిటీ ఎప్పుడు వచ్చినా చట్టసభల్లో యాక్ట్ కింద సవరణ చేసి యూనివర్సిటీ పేరును ఇంక్లూడ్ చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఏపీ ప్రైవేటు విశ్వవిద్యాలయాల స్థాపన, క్రమబద్ధీకరణ బిల్లుకు సభ ఆమోదం తెలిపింది.

## అభయాంజనేయ స్వామి ఆలయంలో మంత్రి లోకేష్ పూజలు





గన్నవరం (చైతన్య రథం): హనుమాన్ జంక్షన్ శ్రీ అభయాంజనేయస్వామిని రాష్ట్ర విద్య ఐటీ మంత్రి నారా లోకేష్ దర్శించుకున్నారు. మల్లవల్లి ఇండస్ట్రియల్ పార్కులో అశోక్ లేలాండ్ ప్లాంట్‌ను ప్రారంభించడానికి ముందు లోకేష్ అభయాంజనేయ స్వామి ఆలయంలో పూజలు చేశారు. ఆలయ అర్చకులు మంత్రి లోకేష్‌కు ఆశీర్వచనాలు అందజేశారు. మంత్రి లోకేష్ ఆలయానికి వచ్చిన సమయంలో గన్నవరం నియోజకవర్గానికి చెందిన నాయకులు, కార్యకర్తలు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మంత్రి వెంట గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.



చైతన్యరథం




# మళ్లీ ఏపీ బ్రాండ్ తిరిగొచ్చింది!

- పారిశ్రామిక పునరుజ్జీవన చర్యలతో సత్ఫలితాలు
- రూ.7లక్షల కోట్ల పెట్టుబడులతో ప్రఖ్యాత సంస్థలు
- మా లక్ష్యసాధనకు అశోక్ లేలాండ్‌వంటివి పెద్ద దన్ను
- ఎస్క్రో ఖాతా ద్వారా సంస్థలకు నేరుగా ప్రోత్సాహకాలు
- విద్య, ఐటీ మంత్రి నారా లోకేష్ స్పష్టీకరణ
- మల్లవల్లి అశోక్ లేలాండ్ యూనిట్‌ను ప్రారంభించిన మంత్రి




అమరావతి (చైతన్య రథం): బ్రాండ్ "బాబు" తిరిగొచ్చారు. బ్రాండ్ ఏపీ తిరిగొచ్చింది. ఇటీవల నేను ఢిల్లీలో ఒక ప్రముఖ ఛానల్ ఫైర్‌సైడ్ చాట్‌కు వెళ్ళాను. అక్కడ సీనియర్ జర్నలిస్ట్ నన్ను తమిళనాడుకు చెన్నై, కర్ణాటకకు బెంగళూరు, తెలంగాణకు హైదరాబాద్ ఉన్నాయి, మరికి ఏపీకి ఏంఉందని అడిగారు. ఏపీలో సీబీఎన్ ఉన్నారని గర్వంగా చెప్పాను. ఈరోజు మేం చంద్రబాబునాయుడుపై అదే నమ్మకంతో ముందుకు సాగుతున్నాం' అని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ మంత్రి నారా లోకేష్ ఉద్ఘాటించారు. విజయవాడ సమీపంలోని మల్లవల్లి మోడల్ ఇండస్ట్రియల్ పార్కులో అశోక్ లేలాండ్ ప్లాంటును మంత్రి లోకేష్ ప్రారంభించారు. తొలుత అశోక్ లేలాండ్ తయారు చేసిన డబుల్ డెక్కర్ బస్సులో ప్లాంటుకు వచ్చారు. ప్లాంటు ఆవరణలో మొక్కనాటిన అనంతరం రిబ్బన్ కట్ చేసి ప్లాంటును ప్రారంభించారు. తర్వాత అశోక్ లేలాండ్ సంస్థ తయారు చేసిన ఎంఎస్ ఆర్టీసి బస్సులను మంత్రి జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం జరిగిన సభలో మంత్రి లోకేష్ మాట్లాడుతూ... మల్లవల్లిలో అశోక్ లేలాండ్ అత్యాధునిక బస్సు తయారీ కర్మాగారం ప్రారంభోత్స వానికి ఈరోజు ఇక్కడ ఉండటం ఒక గౌరవం గా భావిస్తున్నాను. 2023 ఆగస్టు 24న నా పాదయాత్ర సందర్భంగా నేను మల్లవల్లికి వచ్చినపుడు అశోక్ లేలాండ్‌ను తిరిగి తీసుకువస్తామని హామీ ఇచ్చాను. అది నేడు నెరవేరుతున్నందుకు సంతోషంగా ఉంది. అశోక్ లేలాండ్, హిందూజా గ్రూపునకు చెందిన పెద్దలు, పరిశ్రమ ప్రముఖులు, ప్రభుత్వ అధికారులకు నా అభినందనలు. దేశచరిత్రలో మరే ఇతర రాజకీయ పార్టీ ప్రకటించని విధంగా అయిదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని ఎన్నికల మ్యానిఫెస్టోలో హామీ ఇచ్చాం. మీరు సృష్టించే ప్రతి ప్రత్యక్ష ఉద్యోగానికి మరో 4 పరోక్ష ఉద్యోగాలు తోడై రాష్ట్రాభివృద్ధికి ఊతమిస్తాయి. ఆంధ్రప్రదేశ్‌ను పారిశ్రామిక పునరుజ్జీవనానికి చిహ్నంగా మార్చేందుకు మీవంటి వారి భాగస్వామ్యం మాకు శక్తినిస్తుంది. స్థిరమైన అభివృద్ధికి మేం కట్టుబడి ఉన్నాం. ప్రకాశవంతమైన, పచ్చని, స్థిరమైన రేపటి భవితవైపు ముందుకు సాగుదాం. ఆంధ్రప్రదేశ్ ను అభివృద్ధి చెందుతున్న పెట్టుబడులకు గమ్యస్థానంగా, తయారీరంగంలో అగ్రగామిగా నిలుపుదాం.

## గత ప్రభుత్వ చర్యలకు పారిపోయిన పరిశ్రమలు

2019 నుండి 2024 వరకు గత ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌లో పారిశ్రామిక రంగానికి తీవ్రమైన నష్టాన్ని కలిగించింది, దీనివల్ల వ్యాపారాలు సజావుగా నడవడమే కష్టమైంది. విద్యుత్ కొనుగోలు ఒప్పందాల (%ప్రాూా%) రద్దు వంటి తిరోగమన విధానాలు రాష్ట్రంలో అనిశ్చితిని సృష్టించాయి, అనేక కంపెనీల ను వేధించడంతో వారు రాష్ట్రం వదిలి వెళ్లిపోయారు. ఎపిలో అత్యధిక పన్ను చెల్లింపుదారుల్లో ఒకరైన అమర రాజా వంటి ప్రఖ్యాత పెట్టుబడిదారులు, లులు వంటి పెద్ద సంస్థలు తీవ్ర సవాళ్లను ఎదుర్కొన్నాయి. జాకీ వంటి కంపెనీలు కూడా రాష్ట్రం నుండి పొరుగురాష్ట్రాలకు తరలివెళ్లాయి. దురదృష్టవశాత్తు గతపాలనలో నష్టపోయిన పారిశ్రామిక సంస్థల్లో అశోక్ లేలాండ్ కూడా ఒకటి. 1360 ఎకరాల్లో 2014-19 నడుమ టిడిపి ప్రభుత్వ హయాంలో ఏర్పాటుచేసిన మల్లవల్లి పారిశ్రామిక పార్కును వైసీపీ ప్రభుత్వం తీవ్రంగా దెబ్బతీసింది. మేము ఒప్పందాలు చేసుకున్న 450 కంపెనీల్లో చాలావరకు గత వైసీపీ పాలకుల వేధింపుల కారణంగా పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు రాలేదు.

## పరిశ్రమదారుల్లో విశ్వాసానికి చర్యలు

రాష్ట్రానికి కొత్త పెట్టుబడుదారులను ఆహ్వానించే ముందు మేము వారిలో విశ్వాసాన్ని కలిగించేందుకు చర్యలు చేపడుతున్నాం. ఈ ప్లాంట్ అశోక్ లేలాండ్‌కు మాత్రమే కాకుండా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి కూడా ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలుస్తుంది. అశోక్ లేలాండ్ కు కేటాయించిన 75 ఎకరాల్లో 40 ఎకరాల్లో ప్లాంటును అభివృద్ధి చేశారు. ఈ ప్లాంట్ ఏటా 4,800 బస్సులను ఉత్పత్తి చేసే సామర్థ్యం కలిగి ఉంది. ఇది అశోక్ లేలాండ్ నిబద్ధతను సూచిస్తుంది.

ఈ ప్లాంట్ ద్వారా లభించే ఉపాధి అవకాశాలపై నేను ఆనందిస్తున్నాను. మొదటిదశలో 600 ఉద్యోగాలు, రెండో దశలో 1,200 మందికి ఉద్యోగాలు లభిస్తాయి. ఇది పరిసర ప్రాంతాలను శక్తివంతం చేయడమేగాక సామాజిక-ఆర్థిక వృద్ధి పెంపుదలకు దోహదపడుతుంది. ఆంధ్రప్రదేశ్‌లో నైపుణ్యం కలిగిన శ్రామిక శక్తిని తయారుచేయడం అనేది మా ప్రభుత్వ ముఖ్య లక్ష్యాల్లో ఒకటిగా ఉంది. ఇక్కడ లభించే ఉద్యోగాలు కేవలం సంఖ్య కాదు, అవి జీవనోపాధిని, కుటుంబాల ఆర్థిక పరిస్థితిని మెరుగుపర్చి బలమైన ఆర్థిక వ్యవస్థకు పునాదిగా నిలుస్తాయి.

అశోక్ లేలాండ్ బీఎస్6 బస్ మోడళ్ల ఉత్పత్తి, ఎలక్ట్రిక్ వెహికల్ బాడీ బిల్డింగ్ సామర్థ్యం స్థిరమైన అభివృద్ధి, నిబద్ధతకు నిదర్శనం. ఇది ప్రధాని మోదీ సంకల్పమైన 'ఆత్మ నిర్భర్ భారత్' లక్ష్యాలను చేరుకునేందుకు సహాయపడుతుంది. దార్శనికత, అధునాతన పర్యావరణ వ్యవస్థ నిర్మాణానికి ఆంధ్రప్రదేశ్ ఏర్పాటుచేసుకున్న లక్ష్యాలను చేరుకునేందుకు ఉపకరిస్తుంది.

## సామాజిక బాధ్యతలోనూ అశోక్ లేలాండ్ మేటి!

క్లీనర్ టెక్నాలజీలు, స్థిరమైన పద్ధతులను స్వీకరించడం ద్వారా అశోక్ లేలాండ్ ఒక బెంచ్‌మార్క్‌ను నిర్దేశిస్తోంది. ఆర్థిక వృద్ధి, పర్యావరణ బాధ్యత ఒకదానితో ఒకటి ముడిపడి ఉన్నాయనడాన్ని ఇది సూచిస్తుంది. 50కంటే ఎక్కువ దేశాల్లో విస్తరించి

- (మిగతా వివరాలు 6లో)





# మళ్లీ ఏపీ బ్రాండ్ తిరిగొచ్చింది!




(5వ పేజీ తరువాయి)

ప్రపంచవ్యాప్తంగా వాణిజ్య వాహన పరిశ్రమలకు అశోక్ లేలాండ్ మార్గదర్శకంగా నిలుస్తోంది. విద్యుత్ నుండి సీఎన్‌జీ, ఎల్‌ఎన్‌జీ, హైడ్రోజన్-శక్తితో నడిచే వాహనాల వరకు ప్రత్యామ్నాయ ఇంధనాల్లో వారి ఆవిష్కరణలు పరిశ్రమకు బెంచ్‌మార్క్‌ను నిర్దేశించాయి. పరిశుభ్రత, పచ్చదనాన్ని కాపాడటంలో వారి నిబద్ధత ప్రశంసనీయం. అభివృద్ధి చెందుతున్న వాహన డిమాండ్లను ఈ ప్లాంట్ తీర్చగలదనే నమ్ముతున్నాను. అశోక్ లేలాండ్ బృందం దూరదృష్టి, ఆవిష్కరణలకు ఈ ప్లాంటు నిదర్శనం. అశోక్ లేలాండ్ వారి కార్పొరేట్ సామాజిక బాధ్యత కార్యక్రమాలు ప్రశంసనీయం. 'రోడ్ టు స్కూల్,' 'రోడ్ టు లైవ్‌లిహుడ్,' 'జల్ జీవన్' వంటి కార్యక్రమాలు సామాజికాభివృద్ధిలో తమవంతు పాత్ర పోషించాయి. యువతకు సాధికారత కల్పించడమేగాక ఎంతోమంది జీవితాలపై సానుకూల ప్రభావాన్ని చూపాయి. ఈ చొరవ సమాజం పట్ల వారికి గల చిత్తశుద్ధి, బాధ్యతను ప్రతిబింబిస్తుంది. వ్యాపారంతోపాటు సమాజాభివృద్ధి కార్యక్రమాలను ఎలా ముందుకు నడిపించవచ్చో అశోక్ లేలాండ్ ఉదాహరణగా నిలుస్తుంది.

## ఏపీలో పెట్టుబడులకు అనుకూలమైన విధానాలు

ప్రభుత్వపరంగా వ్యాపార అనుకూల వాతావరణాన్ని సృష్టించడానికి, పెట్టుబడులను ప్రోత్సహించడానికి స్థిరమైన విధానాలతో మేం ముందుకు సాగుతున్నాం. మేము అధికారంలోకి వచ్చినప్పటి నుండి పరిశ్రమదారుల్లో విశ్వాసాన్ని పునరుద్ధరించడంపై దృష్టి సారించాం. ఫలితంగా ఆర్సెలర్ మిట్టల్, బీపీసీఎల్, టీసీఎస్, ఎన్టీపీసీ, ఎల్జీ, టాటా పవర్ వంటి ప్రధాన సంస్థలు గత తొమ్మిది నెలల్లో రూ.7లక్షల కోట్ల విలువైన పెట్టుబడులు రాష్ట్రంలో పెట్టడానికి ముందుకువచ్చాయి. వీటి ద్వారా 4 లక్షలకు పైగా ఉద్యోగాలు రాబోతున్నాయని చెప్పడానికి సంతోషిస్తున్నాను. ఈ పెట్టుబడులు కేవలం పారిశ్రామికవృద్ధి, వ్యాపార వేగాన్ని సూచించడమేగాక ఆంధ్రప్రదేశ్‌లో నవ శకం ప్రారంభాన్ని సూచిస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్‌పైన మా నాయకత్వంపైన నమ్మకం ఉంచినందుకు అశోక్ లేలాండ్, హిందూజా గ్రూప్ అధినేతలు అశోక్ హిందూజా, ధీరజ్ హిందూజా, షోమ్ హిందూజా, షేను అగర్వాల్, గణేష్ మణి, స్విచ్ మొబిలిటీకి చెందిన మహేష్ బాబులకు నేను ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలుపుతున్నాను. పారిశ్రామిక ప్రోత్సాహకాల కోసం ఎవరి చుట్టూ తిరగాల్సిన పనిలేదు. ఎస్క్రో ఎకౌంట్ ద్వారా నేరుగా జమ చేస్తాం. ఏపీలో యువ ఐఏఎస్ అధికారులు, ప్రజా ప్రతినిధులు ఉన్నారు. వారు మీకు పూర్తి సహకారం అందిస్తారు. మా దార్శనికతపై అచంచలమైన విశ్వాసానికి ప్రతీకగా నిలుస్తున్న ఈ ప్రాజెక్టును... కేవలం తొమ్మిది నెలల్లోనే అశోక్ లేలాండ్ నిజం చేసింది. ఆంధ్రప్రదేశ్‌ను పెట్టుబడిదారులకు గమ్యస్థానంగా, ఇతర ప్రపంచ స్థాయి సంస్థలకు ప్రేరణగా నిలుస్తుందని మంత్రి లోకేష్ పేర్కొన్నారు. కార్యక్రమంలో మంత్రులు టీజీ భరత్, కొల్లు రవీంద్ర, కలెక్టర్ డికె బాలాజీ, ఏపీఐఐసి చైర్మన్ రామరాజు, ఎండి అభిషిక్త్, ఆర్ టిసి ఎండి ద్వారకా తిరుమలరావు, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, హిందూజా అధినేత అశోక్ హిందూజా, అశోక్ లేలాండ్ చైర్మన్ ధీరజ్ హిందూజా, ఎండి షేనూ అగర్వాల్ తదితరులు పాల్గొన్నారు.





















# శరవేగంగా సన్నాహాలు!

- అమరావతిలో లక్ష కోట్ల పనులు, పెట్టుబడులు
- ప్రధాని మోదీకి రాష్ట్ర ప్రభుత్వ నివేదన
- సచివాలయ సమీపంలోనే ప్రారంభోత్సవ సభ



అమరావతి (చైతన్య రథం): రాజధాని నిర్మాణ పనుల ప్రారంభోత్సవానికి వేగంగా సన్నాహాలు జరుగుతున్నాయి. ప్రధాని మోదీ చేతులమీదుగా పనులను ప్రారంభించనున్నారు. రాజధానిలో రూ.52 వేల కోట్లతో చేపడుతున్న పనులు, రూ.48 వేల కోట్ల పెట్టుబడుల ప్రతిపాదనల గురించి ఈ సందర్భంగా ప్రధానికి వివరించనున్నారు. రాజధాని పనులకు తొమ్మిదేళ్ల కిందటే ప్రధాని చేతుల మీదుగా శంకుస్థాపన జరిగినందున.. ఇప్పుడు ఈ కార్యక్రమాన్నీ నవ నగరాల పనుల ప్రారంభోత్సవ సభగా నిర్వహించాలని ప్రభుత్వం యోచిస్తోంది. కార్యక్రమ నిర్వహణకు సచివాలయం వెనుక ఎన్-9 రహదారి పక్కనే 250 ఎకరాల స్థలాన్ని ఎంపిక చేశారు. ప్రధానితోపాటు ఇతర ప్రముఖులు హాజరయ్యే అవకాశం ఉండటంతో రవాణాకు అనుకూలంగా ఉండేలా ఈ స్థలాన్ని ఎంపికచేశారు. వాస్తుపరంగానూ అనుకూలమని నిర్ణయించారు. రాజధాని పనుల ప్రారంభోత్సవ సభ ఏర్పాట్లపై ముఖ్యమంత్రి చంద్రబాబు మంగళవారం శాసనసభ భవనంలోని తన ఛాంబర్లో పురపాలక మంత్రి పి నారాయణ, సీఆర్డీఏ అధికారులతో సమీక్షించారు. సభ నిర్వహణకు ఏ ప్రాంతం అనుకూలం? ఎన్ని పనులకు ప్రధానితో శంకుస్థాపన చేయించగలమన్న అంశంపై చర్చించారు.

రాజధానిలో ఏ ప్రాంతాలు సభ నిర్వహణకు అనుకూలమో ముఖ్యమంత్రికి సీఆర్డీఏ అధికారులు వివరించారు. మొత్తం ఆరు ప్రాంతాలను పరిశీలించినట్టు తెలిపారు. సచివాలయం పక్కనున్న ప్రదేశం అన్ని విధాలా అనుకూలమని ప్రాథమికంగా నిర్ణయానికి వచ్చారు. రాజధాని పనుల పునఃప్రారంభోత్సవాన్ని ఏ రోజు నిర్వహించాలి? ముహూర్తం తదితర అంశాలపై ముఖ్యమంత్రి చర్చించారు. సీఎంతో సమావేశం అనంతరం సచివాలయం వెనుక పక్క స్థలాన్ని సీఆర్డీఏ కమిషనర్ కన్నబాబు పరిశీలించారు. గతంలో ఉద్దండరాయునిపాలెం వద్ద నిర్మించిన హెలిప్యాడ్లు, సచివాలయం ఎదుట ఉన్న హెలిప్యాడ్లను సభకు వచ్చే ప్రముఖుల కోసం వినియోగించాలని నిర్ణయించారు.

## 'చేనేత' గౌరవ సలహాదారుగా సుచిత్ర

**కేబినెట్ హోదాలో రెండేళ్ల కాలానికి నియామకం**



అమరావతి (చైతన్య రథం): భారత్ బయోటెక్ ఎండీ సుచిత్ర ఎల్లను చేనేత, హస్తకళల అభివృద్ధికి గౌరవ సలహాదారుగా నియమిస్తూ ఏపీ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈమేరకు ఏపీ సీఎస్ విజయానంద్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. సుచిత్ర ఎల్ల.. కేబినెట్ ర్యాంకుతో రెండేళ్ల కాలానికి పదవిలో కొనసాగుతారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. చేనేత, హస్తకళల అభివృద్ధి రూపకల్పనకు ఆమెనుంచి సలహాలు తీసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది.

*ఏరో స్పేస్, డిఫెన్స్ గౌరవ సలహాదారుగా సతీష్‌రెడ్డి*

ఏరో స్పేస్, డిఫెన్స్ మ్యానుఫ్యాక్చరింగ్ హబ్ గౌరవ సలహాదారుగా డీఆర్డీవో మాజీ చీఫ్ జి.సతీష్‌రెడ్డి నియమితులయ్యారు. ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కేబినెట్ ర్యాంక్ హోదాలో ఆయన రెండేళ్లపాటు ఈ పదవిలో కొనసాగుతారు.ప్రస్తుతం సతీష్‌రెడ్డి కేంద్రరక్షణ శాఖ సలహాదారుగా ఉన్నారు. రక్షణ రంగ పరిశ్రమల ఏర్పాటుకు సలహాలు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం ఆయనను కోరింది. పారిశ్రామిక కారిడార్లు క్లస్టర్లు టెస్టింగ్ ఫెసిలిటీలో పరిశ్రమల ఏర్పాటు, ఏఐ, రోబోటిక్స్, సైబర్ సెక్యూరిటీ సలహాలు, సూచనలు ఇవ్వాలని సతీష్‌రెడ్డిని ప్రభుత్వం కోరింది. యువతకు..నైపుణ్య శిక్షణ ఇచ్చేలా ఆయన సలహాలు ఇవ్వనున్నారు.

*ఫోరెన్సిక్ గౌరవ సలహాదారుగా కేపీసీ గాంధీ*

ఏపీ ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్ గౌరవ సలహాదారుగా కేపీసీ గాంధీ నియమితులయ్యారు. గాంధీని రెండేళ్లపాటు కేబినెట్ ర్యాంకు హోదాలో నియమిస్తూ సీఎస్ విజయానంద్ ఉత్తర్వులు జారీ చేశారు. ఏపీ స్పేస్ టెక్నాలజీ గౌరవ సలహాదారుగా శ్రీధర పనిక్కర్ సోమనాథ్ నియమితులయ్యారు.ప్రస్తుతం సోమనాథ్..విక్రమ్‌సారాభాయ్ స్పేస్ సెంటర్లో పనిచేస్తున్నారు. పాలనా వ్యవహారాలు,పరిశ్రమలు,పరిశోధనలో సలహాలుఇవ్వాలని ప్రభుత్వం కోరింది.

## విచారణ వేగవంతం చేయండి

**డీజీపీని కలిసిన ముంబయి నటి జత్వానీ**

అమరావతి (చైతన్య రథం): సినీ నటి కాదంబరి జత్వానీ కేసులో విచారణను వేగవంతం చేయాలని ఐద్వా ప్రధాన కార్యదర్శి రమాదేవి ఏపీ డీజీపీ హరీష్ గుప్తాకు వినతిపత్రం అందించారు. రాష్ట్రంలో వివిధ ఘటనలలో మహిళలను వేధించిన కేసుల విచారణ వేగవంతం చేయాలని కోరారు. సినీ నటి జత్వానీ కేసులో బాధ్యులపై విచారణను ప్రారంభించాలన్నారు. గతేడాది ఆగస్టులోనే అన్ని వివరాలు సమర్పించినా విచారణలో ఎందుకు జాప్యం జరుగుతోందని ఆరా తీశారు. గత ప్రభుత్వంలో పోలీసు అధికారులు తీవ్రంగా వేధించారని, అందుకు అన్ని ఆధారాలున్నా.... ఇంకా ఎంత సమయం పడుతుందని అడిగారు. విశాఖలో మహిళను వేధించిన కేసు, ఎన్టీఆర్ జిల్లాలో మైనర్ బాలికపై అత్యాచారం కేసు విచారణ వేగవంతం చేయాలని కోరారు. సినీ నటి జత్వానీ మాట్లాడుతూ ఐద్వా, ఇతర మహిళా సంఘాల నేతలతో కలిసి డీజీపీని కలిశామని.. ఈ కేసు విచారణను వీలైనంత త్వరగా చేపట్టాలని డీజీపీ, ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నానని చెప్పారు.

## వాస్తవాలు పట్టని వైసీపీ

- దిశ కన్నా శక్తివంతమైన కూటమి యాప్
- ప్రజలే గుర్తించారు
- కోటిన్నర మంది డౌన్‌లోడ్ చేసుకున్నారు
- గత ప్రభుత్వం కన్నా 7.2 శాతం నేరాలు తగ్గాయి
- హోంమంత్రి వంగలపూడి అనిత



అమరావతి, (చైతన్యరథం): గత ప్రభుత్వం కన్నా 7.2 శాతం నేరాలు తగ్గితే క్రైమ్ తగ్గినట్లు కాదా? అని హోంమంత్రి వంగలపూడి అనిత వైసీపీ ప్రజాప్రతినిధులపై ఎదురుదాడికి దిగారు. బుధవారం శాసన మండలిలో సభ్యుల ప్రశ్నలకు ఆమె ఘాటుగానే సమాధానం చెప్పారు. లెక్కలు తీసి మరీ సభను మార్మోగించారు. గణాంకాలతో సహా చెబుతున్నా సందేహాలెందుకని నిలదీశారు. 2023 జూన్ నుంచి 2024 జనవరి వరకూ మహిళలపై జరిగిన నేరాల సంఖ్య 18,114 కాగా

2024 జూన్ నుంచి 2025 జనవరి వరకూ మహిళలపై జరిగిన నేరాలు 16,809 కేసులని లెక్కలు చెప్పారు. మహిళల భద్రత మీద కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. ఐజీ స్థాయి మహిళా పోలీస్ ఆధ్వర్యంలో రూ.17 కోట్లతో ప్రత్యేక రక్షణ విభాగం ఏర్పాటు చేశామన్నారు. డీఎస్పీ స్థాయి మహిళా పోలీసులు అందులో భాగమన్నారు. దిశ యాప్ కన్నా మెరుగైన సేవలతో శక్తి యాప్ పని చేస్తోందన్నారు. దిశ యాప్‌ను పురుషులతో కూడా టార్గెట్ పెట్టి డౌన్ లోడ్ చేయించారన్నారు. శక్తి యాప్‌ను స్వతంత్రంగా 5,279 మంది డౌన్‌లోడ్ చేసుకున్నారన్నారు. 1,49,93,069 మంది శక్తి యాప్‌ను డౌన్ లోడ్ చేసుకున్నారన్నారు.

కేవలం సీఎం ఆవిష్కరించిన 10 రోజుల్లోనే కోటిన్నర మంది శక్తి యాప్‌ను డౌన్ లోడ్ చేసుకున్నారని వెల్లడించారు. స్కూళ్లు, కాలేజీల వద్ద శక్తి టీంలను ఏర్పాటు చేసి ఈవ్‌టీజింగ్ లేకుండా చర్యలు చేపట్టామన్నారు. మహిళల కోసం ప్రత్యేకంగా గ్రామీణస్థాయిలో కూడా నైట్ షెల్టర్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. యాప్ ఉపయోగించి నైట్ షెల్టర్ కోరితే పోలీసుల సంరక్షణలో ఆడబిడ్డలకు రాత్రివేళల్లో రక్షణ కల్పిస్తామన్నారు. 26 జిల్లాలలో 26 నైట్ షెల్టర్లు ఉన్నాయని, మరిన్ని పెంచుతామని వెల్లడించారు దిశ యాప్ ద్వారా 21 రోజుల్లో శిక్ష అనేది ట్రాష్ అన్నారు. సీసీ టీవీలు పెట్టలేదు, ఫోరెన్సిక్ ల్యాబ్‌ని పూర్తి చేయలేదు, ఫింగర్ ప్రింట్ ఐడెంటిఫికేషన్ సిస్టం పక్కనపెట్టి ఎలా వేగంగా శిక్షించగలరో వివరిస్తే వింటామని ఎద్దేవా చేశారు. లక్ష సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడమే లక్ష్యంగా ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. అనకాపల్లిలో మంగళవారం జరిగిన ట్రాన్స్‌జెండర్ హత్యను సీసీ ద్వారా 18 గంటల్లోనే ఛేదించామన్నారు. సీసీ టీవీ ఫుటేజ్ వల్లనే నిందితుడిని పట్టుకోగలిగామన్నారు. గన్నవరంలో బాలికపై సామూహిక అత్యాచారం ఘటన ముందు అదృశ్య కేసుగా నమోదయిందన్నారు. ఆ కేసును కృష్ణా జిల్లా ఎస్పీ ఆధ్వర్యంలో డ్రోన్లు, సీసీ టీవీల ద్వారా 3 రోజుల్లో ఛేదించామన్నారు. 24 గంటల్లోపే నిందితులను గుర్తించిన దాఖలాలు గత ప్రభుత్వంలో ఉన్నాయా? అని ప్రశ్నించారు. గత ప్రభుత్వంలో ఎన్ని శిక్షలు పడ్డాయని ప్రశ్నించారు. గత మూడు నెలల కాలంలోనే విజయనగరంలోనే మూడు ఫోక్సో కేసుల్లో 20-25 సంవత్సరాలు శిక్ష పడిందన్నారు. ఆడబిడ్డలపై ప్రతి గంటకు 3 అఘాయిత్యాలు అని రాసిన సాక్షి పత్రిక గత వైఎస్ఆర్‌సీపీ పాలనలో గంటకు ఐదు అఘాయిత్యాలు జరిగితే ఎందుకు రాయలేదన్నారు. గత ప్రభుత్వంతో పోలిస్తే అఘాయిత్యాలు తగ్గినట్లే కదా? తెలియడం లేదా? అని నిలదీశారు. గంజాయి సాగుని 90శాతం తగ్గించాం, ఈగల్ అనే ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేశామన్నారు. మహిళల భద్రతపై చిత్తశుద్ధితో పనిచేసేది కూటమి ప్రభుత్వమేనన్నారు.

# అదే జోరు.. హుషారు!

## రెండోరోజూ ఉత్సాహభరితంగా ప్రజాప్రతినిధుల క్రీడలు

- రసవత్తరంగా సాగిన క్రికెట్ ఫైనల్ మ్యాచ్
- మంత్రి సత్యకుమార్ యాదవ్ టీమ్‌పై మంత్రి నాదెండ్ల టీమ్ విజయం
- పరుగు పందెంలో ప్రజాప్రతినిధుల అత్యుత్తమ ప్రదర్శన
- కోలాహలంగా మారిన ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం





విజయవాడ (చైతన్య రథం): ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో బుధవారం ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల క్రీడా పోటీలు ఆద్యంతం ఉల్లాసంగా, ఉత్సాహ భరిత వాతావరణంలో జరిగాయి. రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న శాసనసభ్యుల, శాసనమండలి సభ్యుల క్రీడా పోటీలు రెండవ రోజూ అదే జోరుతో హుషారుగా జరిగాయి. శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు పర్యవేక్షణలో నిర్వహించిన అథ్లెటిక్స్, క్రికెట్ ఫైనల్ మ్యాచ్, రన్నింగ్, కబడ్డీ, షాట్ పుట్, త్రోబాల్, టెన్నిస్, మ్యూజికల్ చైర్, షటిల్, టేబుల్ టెన్నిస్ క్రీడల్లో స్పీకర్ అయ్యన్నపాత్రుడు, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణ రాజు, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఛీఫ్ విప్‌లు ఉల్లాసంగా ఉత్సాహంగా పాల్గొని తమదైన శైలిలో ప్రతిభను కనబరిచారు. స్పీకర్ అయ్యన్నపాత్రుడు, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు, మంత్రులు క్రీడాపోటీల్లో పాల్గొని సందడి చేస్తూ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మంత్రి వై. సత్యకుమార్ యాదవ్ లెవన్ టీమ్ వెర్సెస్ మంత్రి నాదెండ్ల మనోహర్ లెవన్ క్రికెట్ టీములుగా ఏర్పడి ఫైనల్లో తలపడ్డాయి. నాదెండ్ల టీమ్‌లో మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు బొమ్మాజి నిరంజన్ విజయ్ కుమార్, బల్లి కల్యాణ్ చక్రవర్తి, ఎ. ఉదయ్ భాస్కర్, బీటీ నాయుడు, కె.ఈ. శ్యామ్, వంశీకృష్ణ యాదవ్, ఎమ్.వెంకటరాజు, బొజ్జల సుధీర్ రెడ్డి, అనిమిల్లి రాధాకృష్ణ, ఏలూరి సాంబశివరావు, ఎన్. ఈశ్వరరావు, చిర్రి బాలరాజు, దాట్ల సుబ్బరాజు, బి.జయ నాగేశ్వర రెడ్డి జట్టు సభ్యులు ఆడారు. అలాగే ప్రత్యర్థి మంత్రి వై. సత్యకుమార్ యాదవ్ టీమ్‌లో పల్లా శ్రీనివాస్, వంకా రవీంద్రనాథ్, కంచర్ల శ్రీకాంత్, భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, యార్లగడ్డ వెంకట్రావు, పి.జి.వి.ఆర్ నాయుడు(గణబాబు), ఆదిరెడ్డి శ్రీనివాస్, సుందరపు విజయ్ కుమార్, బి. దస్తగిరి, పి.వి. పార్థసారథి, గోవిందరావు, గురజాల జగన్‌మోహన్‌రావు, ఎమ్ఎస్.రాజు, కాకర్ల సురేష్‌లు జట్టు సభ్యులుగా పాల్గొన్నారు. ముందుగా మంత్రి నాదెండ్ల మనోహర్ టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్నారు. ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి, కె.ఈ.శ్యామ్‌లు అద్భుతంగా బ్యాటింగ్ చేశారు. అలాగే వారికి ధీటుగా ప్రత్యర్థి జట్టు బౌలర్లు పల్లా శ్రీనివాస్, మంత్రి సత్యకుమార్ యాదవ్‌లు తమదైన శైలిలో బౌలింగ్ చేస్తూ సవాల్ విసిరారు. అద్భుతమైన బ్యాటింగ్, అత్యుత్తమ కట్టడితో బౌలింగ్ చేస్తూ హెూరాహెూరీగా క్రికెట్ లో తలపడ్డారు. చివరికి విజయం మంత్రి నాదెండ్ల మనోహర్ టీమ్‌నే వరించింది.

### 100 మీటర్స్ పరుగు పందెంలో..

రెండవ రోజు నిర్వహించిన క్రీడా పోటీల్లో భాగంగా 100 మీటర్ల పరుగు పందెం పోటీలు రసవత్తరంగా సాగాయి. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పోటాపోటీగా పాల్గొని పరుగులు పెట్టారు. మొదటి రౌండులో ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్, ఎమ్మెల్యేలు రామాంజనేయులు, బుచ్చయ్యచౌదరి, రఘురామకృష్ణంరాజు, కె.శ్రీనివాస్, గద్దె రామ్మోహనరావులు పాల్గొన్నారు. అలాగే రెండవ రౌండులో సుందరపు విజయ్ కుమార్, బొజ్జల సుధీర్ రెడ్డి, రఘురామకృష్ణ రాజులు 100 మీటర్ల పరుగు పందెంలో పాల్గొన్నారు. మూడవ రౌండులో డి.ప్రసాద్, సీహెచ్.బాలరాజు, జె.నాగేశ్వరరెడ్డి, విజయచంద్ర, ఎమ్.గోవిందరావు, శ్రీధర్, కాకర్ల సురేష్‌లో పాల్గొని హెూరాహెూరీగా పరుగులు తీశారు. నాల్గవ రౌండులో కే.ఈ.శ్యామ్, బి.నాయకర్, నాదెండ్ల మనోహర్, సత్యకుమార్ యాదవ్, పార్థసారథి, రాంగోపాల్‌రెడ్డి తదితరులు రన్నింగ్ పోటీల్లో పాల్గొన్నారు.

### షాట్‌పుట్‌లో..

షాట్ పుట్ క్రీడలో పెద్దఎత్తున ప్రజాప్రతినిధులు క్రీడోత్సాహంతో పాల్గొన్నారు. 60 సంవత్సరాల విభాగంలో ప్రజాప్రతినిధులు కామినేని శ్రీనివాస్, గద్దె రామ్మోహన్‌రావు, బుచ్చయ్య చౌదరి, వంకా రవీంద్ర నాథ్, రఘురామకృష్ణ రాజు, వరదరాజుల రెడ్డి, ఎమ్ఎమ్.కొండయ్య లు పాల్గొన్నారు. అలాగే రెండవ రౌండులో ఎమ్.రాంప్రసాద్‌రెడ్డి, ఎస్.విజయ్‌కుమార్, శ్రీరామ్ తాతయ్య, వంశీకృష్ణ యాదవ్, రాధాకృష్ణ, వర్ల కుమార్ రాజా, బోడే ప్రసాద్, ఆదిరెడ్డి శ్రీనివాస్, సత్యకుమార్ యాదవ్, విజయ్‌కుమార్, వెనిగండ్ల రాము, కంచర్ల శ్రీకాంత్, గొండు శంకర్, ఏ. పార్థసారథి, శ్రీధర్, శ్రీరామ్ రెడ్డి తదితరులు షాట్ పుట్‌లో పాల్గొన్నారు.

### మహిళా విభాగం షాట్ పుట్‌లో...


మహిళా ప్రజాప్రతినిధులు వంగలపూడి అనిత, గుమ్మిడి సంధ్యారాణి, ఎస్.సవిత, తంగిరాల సౌమ్య, టి. జగదీశ్వరి, పల్లె సింధూర రెడ్డి, రెడ్డిప్పగారి మాధవీ రెడ్డి, విజయేశ్వరి, పద్మశ్రీలు పాల్గొని అత్యుత్తమ ప్రతిభను కనబరిచారు.

### మ్యూజికల్ చైర్ క్రీడలో..

మ్యూజికల్ చైర్ క్రీడలో మహిళా ప్రజాప్రతినిధులు సైతం ఉల్లాసంగా పాల్గొన్నారు. ఆద్యంతం ఉత్సాహ భరితంగా పాల్గొని అత్యుత్తమ ప్రదర్శనను కనబరిచారు. వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి,

- (మిగతా వివరాలు 9లో)





# అదే జోరు.. హుషారు!





(8వ పేజీ తరువాయి)

ఎస్.సవిత, పి.సింధూర రెడ్డి, తంగిరాల సౌమ్య, జి. చరితారెడ్డి, మిరియాల శిరీషా, పరిటాల సునీత పాల్గొని మ్యూజికల్ ఛైర్‌లో తమ ప్రతిభను చాటారు.

## పోటీల్లో గెలుపొందిన విజేతలు..

### 100 మీటర్స్ రన్నింగ్‌లో..

100 మీటర్ల రన్నింగ్ క్రీడలో మొదటి రౌండులో రైల్వే కోడూరు ఎమ్మెల్యే శ్రీధర్, రెండవ విభాగంలో పత్తికొండ ఎమ్మెల్యే కె.ఈ.శ్యామ్ కుమార్, మూడవ రౌండులో ఎమ్మెల్యే రామాంజనేయులు విజయఢంకా మోగించి విజేతలుగా నిలిచారు.

### షాట్‌పుట్ క్రీడలో..

షాట్‌పుట్ మహిళా విభాగంలో పుట్టపర్తి ఎమ్మెల్యే పి.సింధూరరెడ్డి గెలుపొందారు. పురుషుల విభాగంలో మొదటి రౌండులో పార్వతీపురం ఎమ్మెల్యే విజయ్‌కుమార్, రెండవ రౌండులో ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ విజేతలుగా నిలిచారు.

### మ్యూజికల్ ఛైర్ క్రీడలో..

మ్యూజికల్ ఛైర్ క్రీడలో ప్రథమ స్థానంలో మిరియాల శిరీషా, ద్వితీయస్థానంలో ఎస్.సవిత, తృతీయస్థానంలో పల్లె సింధూరరెడ్డి విజేతలుగా నిలిచారు.

### క్రికెట్‌లో నాదెండ్ల టీమ్ విజయం..

క్రికెట్ పోటీల్లో మంత్రి సత్యకుమార్ యాదవ్ టీమ్‌పై మంత్రి నాదెండ్ల టీమ్ విజయం సాధించింది. మంత్రి నాదెండ్ల మనోహర్ టీమ్‌లో మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు బొమ్మాజి నిరంజన్ విజయ్‌కుమార్, బల్లి కల్యాణ్ చక్రవర్తి, ఎ.ఉదయ్‌భాస్కర్, బీటీ నాయుడు, కె.ఈ.శ్యామ్, వంశీకృష్ణ యాదవ్, ఎమ్.వెంకటరాజు గారు, బొజ్జల సుధీర్‌రెడ్డి, అనిమిల్లి రాధాకృష్ణ, ఏలూరి సాంబశివరావు, ఎన్.ఈశ్వరరావు, చిర్రి బాలరాజు, దాట్ల సుబ్బరాజు, బి.జయనాగేశ్వరరెడ్డి జట్టు సభ్యులు విజయం సాధించారు. 12 ఓవర్లలో 97పరుగులు చేసి విజయం సాధించి సంబరాలు చేసుకున్నారు. సందర్భంగా మంత్రి నాదెండ్లను జట్టు సభ్యులందరూ తమ భుజాలపైకి ఎత్తి హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు.



### టేబుల్ టెన్నిస్‌లో..

టేబుల్ టెన్నిస్ పోటీల్లో ప్రజాప్రతినిధులు పోటాపోటీగా తలపడ్డారు. ఈ పోటీల్లో ప్రథమస్థానంలో ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా, ద్వితీయస్థానంలో ఎమ్మెల్యే కేఈ శ్యామ్‌కుమార్, తృతీయస్థానంలో బి విజయచంద్ర విజేతలుగా నిలిచారు.

### టెన్నికాయిట్‌లో..

టెన్నికాయిట్ మహిళల డబుల్స్ విభాగంలో ప్రథమస్థానంలో భూమా అఖిలప్రియ, ద్వితీయస్థానం లో కె లలితాకుమారి, పి.సింధూరరెడ్డి విజేతలుగా నిలిచారు.

### టెన్నికాయిట్ పురుషుల విభాగంలో..

టెన్నికాయిట్ పురుషుల సింగిల్స్‌లో మంత్రి వై సత్యకుమార్ యాదవ్, ద్వితీయస్థానంలో గద్దె రామ్మోహన్‌రావు, తృతీయస్థానంలో వంకా రవీంద్రనాథ్ విజేతలుగా నిలిచారు.

### క్యారమ్స్‌లో..

క్యారమ్స్ మహిళల సింగిల్స్ విభాగంలో ప్రథమ స్థానంలో ఎమ్మెల్యే కర్రి పద్మశ్రీ, ద్వితీయస్థానంలో గౌరు చరితారెడ్డి, తృతీయస్థానంలో రెడ్డప్పగారి మాధవీరెడ్డి విజేతలుగా నిలిచారు. డబుల్స్ విభాగం లో ప్రథమస్థానంలో ఎన్.విజయశ్రీ, ఎమ్.శిరీషాదేవి, ద్వితీయస్థానంలో తంగిరాల సౌమ్య, టి.జగదీశ్వరి గెలుపొందారు. క్యారమ్స్‌లో సింగిల్స్ విభాగంలో ప్రథమస్థానంలో గద్దె రామ్మోహన్‌రావు, ద్వితీయ స్థానంలో వంకా రవీంద్రనాథ్ విజేతలుగా నిలిచారు.

### బ్యాడ్మింటన్‌లో..

బ్యాడ్మింటన్ సింగిల్స్ విభాగంలో ప్రథమస్థానంలో మంత్రి టీజీ భరత్, ద్వితీయస్థానంలో బి.వి.జయనాగేశ్వరరెడ్డి గెలుపొందారు. డబుల్స్ విభాగంలో ప్రథమస్థానంలో మంత్రి సత్యకుమార్ యాదవ్, బి.వి.జయనాగేశ్వరరెడ్డి, ద్వితీయస్థానంలో టీజీ భరత్, పీవీ.పార్థసారథి విజేతలుగా నిలిచారు.

### మహిళల బ్యాడ్మింటన్‌లో..

మహిళల సింగిల్స్ విభాగంలో ప్రథమస్థానంలో పి.సింధూరెడ్డి, ద్వితీయస్థానంలో భూమా అఖిలప్రియ విజేతలుగా నిలిచారు. మహిళల డబుల్స్ విభాగంలో భూమా అఖిలప్రియ, సింధూరెడ్డి విజేతలుగా నిలిచారు. రన్నర్లుగా బి.శ్రావణి, ఎస్.సవిత నిలిచారు. మిక్సడ్ డబుల్స్‌లో మంత్రులు ఎస్.సవిత, టీజీ భరత్‌లు విజయఢంకా మోగించారు. ద్వితీయస్థానంలో భూమా అఖిలప్రియ, బీ.వీ.జయనాగేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

### టెన్నిస్‌లో..

పురుషుల సింగిల్స్ విభాగంలో మంత్రి నాదెండ్ల మనోహర్, పీవీ పార్థసారథి విజేతలుగా నిలిచారు.





# గ్లోబల్ మారిటైమ్ పవర్‌హౌస్‌గా భారత్

- తీర ప్రాంత రాష్ట్రాల ఐక్యత అనివార్యం
- కేంద్ర ప్రభుత్వ చొరవతోనే అభివృద్ధి సాధ్యం
- సాగరమాల అపెక్స్ కమిటీ సమావేశంలో బీసీ జనార్ధన్
- మోదీ నాయకత్వంలో మౌలిక సదుపాయాల కల్పన
- స్వర్ణ ఆంధ్ర ఏ 2047తో భారత్ మారిటైమ్ హబ్‌గా ఆంధ్రప్రదేశ్
- సీఎం చంద్రబాబు సారథ్యంలో ఏపీ మారిటైమ్ అభివృద్ధికి కీలకమైన చర్యలు
- రూ. 17 వేల కోట్లతో రామాయపట్నం, మచిలీపట్నం, కాకినాడ గేట్‌వే, మూలపేట వద్ద 4 గ్రీన్‌ఫీల్డ్ పోర్టుల అభివృద్ధి
- మారిటైమ్ రంగంలో నైపుణ్యాభివృద్ధి కార్మికులు కీలకం
- రామయపట్నంలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు



అమరావతి, (చైతన్యరథం): కేంద్ర ప్రభుత్వ వికసిత్ భారత్ - 2047కు అనుగుణంగా ఏపీముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దిశానిర్దేశంలో.. "స్వర్ణఆంధ్రను 2047 ద్వారా 1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థకు పెంచడంతో పాటు, భారత్ మారిటైమ్ హబ్‌గా ఆంధ్రప్రదేశ్‌ను తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని రాష్ట్ర రోడ్లు భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి వెల్లడించారు. బుధవారం ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో కేంద్ర పోర్టులు, షిప్పింగ్, జలమార్గాల శాఖ మంత్రి సర్బానంద సోనోవాల్ అధ్యక్షతన జరిగిన 4వ జాతీయ సాగరమాల అపెక్స్ కమిటీ సమావేశంలో కేంద్ర రోడ్లు, రవాణా, హైవేల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ, కేంద్ర సహాయ శాఖ మంత్రి శంతన్ ఠాకూర్, తీర ప్రాంతాల రాష్ట్రాలకు చెందిన ముఖ్యమంత్రులు, మంత్రులు, ఇతర ఉన్నతాధికారులతో కలిసి మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి పాల్గొన్నారు. సుధీర్ఘ తీర ప్రాంతం కలిగి ఉన్న భారత్‌లో మారిటైమ్ రంగ అభివృద్ధి, పోర్టుల అనుసంధానం, ఆధునికీకరణ, బ్లూ ఎకానమీకి ప్రోత్సాహం వంటి కీలక అంశాలపై అపెక్స్ కమిటీ చర్చించింది. మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డికి కేంద్ర పోర్టులు, షిప్పింగ్, జలమార్గాల శాఖ కార్యదర్శి టీ. కె. రామచంద్రన్ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి మాట్లాడుతూ.. జాతీయ సాగర్ మాల అపెక్స్ కమిటీ సమావేశంలో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. ఈ వేదికను ఏర్పాటు చేసిన కేంద్ర మంత్రి సర్వానంద సోనోవాల్‌కు ధన్యవాదాలు తెలిపారు. భారత మారిటైం రంగ పురోగతి కోసం తీర ప్రాంత రాష్ట్రాలను ఏకం చేయడంలో ఆయన చూపిన చొరవకు అభినందనలు తెలిపారు ప్రధానమంత్రి నరేంద్రమోడీ నాయకత్వంలో బలమైన మౌలిక సదుపాయాల అభివృద్ధి, మారిటైమ్ రంగంలో చూపిన వృద్ధి కారణంగా భారత్ గ్లోబల్ మారిటైమ్ పవర్ హౌస్‌గా రూపాంతరం చెందిందన్నారు..

కేంద్ర ప్రభుత్వ వికసిత్ భారత్ - 2047కు అనుగుణంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దిశానిర్దేశంలో.. "స్వర్ణ ఆంధ్ర ఏ 2047 ఆవిష్కరణ ద్వారా 1 ట్రిలియన్ డాలర్ల ఆర్ధిక వ్యవస్థ గా మారడంతో పాటు, భారత్ మారిటైమ్ హబ్ గా ఆంధ్రప్రదేశ్ ను తీర్చిదిద్దడమే లక్ష్యంగా తాము పనిచేస్తున్నామన్నారు. అదే సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నాయకత్వంలో ఏపీ మారిటైమ్ రంగం అభివృద్ధికి అనేక కీలకమైన చర్యలు చేపట్టామని తెలిపారు.. రాష్ట్రంలోని రామయపట్నం, మచిలీపట్నం, కాకినాడ గేట్ వే, మూలపేట వద్ద 4 గ్రీన్‌ఫీల్డ్ పోర్టులను రూ. 17 వేల కోట్లతో అభివృద్ధి చేస్తున్నామన్నారు.. దీంతో పాటు రూ. 3,520 కోట్లతో 10 ఫిషింగ్ హార్బర్లను అభివృద్ధి చేస్తున్నామని వెల్లడించారు. మారిటైమ్ రంగంలో నైపుణ్యాభివృద్ధి కార్మికుల అవసరం అత్యంత కీలకమని తెలిపారు.. రామయపట్నం పోర్టులో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేయడానికి పోర్టుల, షిప్పింగ్ వాటర్‌వే మంత్రిత్వ శాఖ నుండి సాంకేతిక అనుమతిని పొందామన్నారు.. ఆఫరేషనల్ పోర్టులకు అనుసంధానంగా స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లను ఏర్పాటు చేయాలని ఇప్పటికే నిర్ణయించామని దీనికి కేంద్ర ప్రభుత్వం సహకారం అందించాలని కోరుతున్నామన్నారు.. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, రాష్ట్ర మారిటైమ్ జల మార్గాల మాస్టర్ ప్లాన్ తయారు చేస్తోందని, ఈ కార్యక్రమంలో భాగంగా ఏపీ మారిటైమ్ బోర్డు అనేక ప్రాజెక్టులను గుర్తించి సాగర్ మాల ప్రోగ్రామ్, 5 ప్రధాన పిల్లర్లను అమలు చేయడానికి నిర్ణయించిందన్నారు.. సాగర్ మాల ప్రణాళిక కింద ఆర్థిక సాయం కోసం ఈ ప్రాజెక్టులకు సంబంధించిన వినతులను పరిశీలించి కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని కోరుతున్నామన్నారు. బాపట్ల జిల్లాలో గ్రీన్ ఫీల్డ్ పోర్టు, నౌకా తయారీ కేంద్రం స్థాపనకు కేంద్ర మంత్రికి మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి వినతిపత్రం అందించారు.

4వ జాతీయ సాగరమాల అపెక్స్ కమిటీ సమావేశంలో ఆంధ్రప్రదేశ్‌లోని బాపట్ల జిల్లా పర్చూరు నియోజకవర్గం చినగంజాం మండలంలోని మోటుపల్లి, పెద గంజాం గ్రామాల మధ్య తీర ప్రాంతంలో గ్రీన్ ఫీల్డ్ పోర్టు, నౌకా తయారీ కేంద్రం స్థాపించాలని కోరుతూ కేంద్ర పోర్టులు, షిప్పింగ్, జలమార్గాల శాఖ మంత్రి సర్వానంద సోనోవాల్‌కు ఈ సందర్భంగా మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి వినతిపత్రం అందజేశారు. గ్రీన్ ఫీల్డ్ పోర్టు, నౌకా తయారీ కేంద్రం స్థాపనతో ఈ ప్రాంత అభివృద్ధితో పాటు, స్థానికంగా యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని కేంద్ర మంత్రి దృష్టికి మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి తీసుకు వెళ్లారు.

## గోవా సీఎంతో మంత్రి బీసీ భేటీ



సాగరమాల సమావేశానికి ముందు పలువురు జాతీయ స్థాయి నేతలను మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి కలిశారు. ముఖ్యంగా గోవా రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్, కర్నాటక పోర్టుల శాఖ మంత్రి ఎంఎస్ వైద్యతో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్, గోవా, కర్ణాటక రాష్ట్రాల్లో పోర్టుల అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలపై పరస్పరం చర్చించారు. సమావేశంలో రాష్ట్ర పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ కార్యదర్శి యువరాజ్, ఏపీ మారిటైమ్ బోర్డు ఛైర్మన్ దామచర్ల సత్య, మారిటైం బోర్డ్ సీఈవో ప్రవీణ్ ఆదిత్యలు పాల్గొన్నారు.

# శరవేగంగా అమరావతి నిర్మాణం



- సీఎం చంద్రబాబు సాధిస్తారు
- టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు వేమూరి ఆనంద సూర్య
- జగన్ రెడ్డి సర్వనాశనం చేశాడు
- ప్రజారాజధానిపై విషం కక్కాడు
- పరిశ్రమలను తరిమేశాడు
- నిరుద్యోగుల నోట్‌లో మట్టికొట్టాడు

అమరావతి, (చైతన్యరథం): అమరావతి రాజధాని నిర్మాణం అంతర్జాతీయ ప్రమాణాలతో శరవేగంగా ముందుకు సాగుతోందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు వేమూరి ఆనంద సూర్య వెల్లడించారు. మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆనందసూర్య మాట్లాడుతూ... రాజధాని అమరావతి 175 నియోజకవర్గాల్లో యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించే కల్పతరువు అన్నారు. అటువంటి అమరావతి నగరాన్ని జగన్మోహన్‌రెడ్డి విధ్వంసానికి గురయిందన్నారు. చంద్రబాబు తిరిగి పట్టాలెక్కిస్తున్నారని వెల్లడించారు. కూటమి ప్రభుత్వం శరవేగంతో పారదర్శకంగా కార్యక్రమాల్ని నిర్వహిస్తోందన్నారు. రాష్ట్ర ప్రజానీకమే కాకుండా యావత్ ప్రపంచ దేశాలలోని తెలుగువారందరూ అమరావతి నిర్మాణం శరవేగంగా జరగాలని కోరుకుంటున్నారన్నారు. రైతులు ఇచ్చిన మిగులు భూమి ద్వారా ప్రభుత్వానికి రెండు లక్షల కోట్ల రూపాయలు త్వరలో ప్రభుత్వానికి ఆదాయం రానున్నదన్నారు. సొంతంగా నిధులు సమకూర్చుకునే పద్ధతిలో రైతుల మిగులు భూముల ద్వారా ప్రభుత్వానికి 2 లక్షల కోట్లు లభ్యమయ్యే అవకాశముందన్నారు. ప్రజా రాజధాని నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వ నిధులు అవసరం లేదన్నారు. రాజధానిపై దుష్ప్రచారం చేయడమంటే రాష్ట్ర అభివృద్ధిపై వేటు వేయడమేనన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో విధ్వంసానికి గురైన అమరావతి రాజధాని అభివృద్ధిని తిరిగి పట్టాలు ఎక్కించేందుకు కూటమి ప్రభుత్వం అమరావతి 2.0 కు శ్రీకారం చుట్టిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాజధాని పనులు ఒక్కసారిగా పరుగులు పెడుతున్నాయన్నారు. రాజధానిలో పునర్నిర్మాణ పనులకు రూ.48,012.67 కోట్ల వ్యయంతో ప్రభుత్వం పరిపాలనా అనుమతులు మంజూరు చేసిందన్నారు. ప్రపంచబ్యాంకు, ఏడీబీల నుంచి 15 వేల కోట్ల రుణం మంజూరైయిందన్నారు. జర్మనీకి చెందిన డెవలప్మెంట్ బ్యాంకు కేఎఫ్‌డబ్ల్యూ నుంచి రూ.5 వేల కోట్లు రుణం పొందేందుకు కూటమి ప్రభుత్వం ప్రయత్నాలు చేపట్టారు. గతంలో టీడీపీ ప్రభుత్వంలో నిర్మించిన టిడ్కో గృహాలు పూర్తి చేసి, మౌలిక సదుపాయాలు కల్పించేందుకు మరో 4,400 కోట్లు నిధులు మంజూరు చేసింది. మొత్తం 15,400 కోట్లు అమరావతి నిర్మాణానికి హడ్కో రుణ సదుపాయం కల్పించడం హర్షణీయం. ప్రజా రాజధాని అమరావతి పూర్తయితే 175 నియోజకవర్గాల యువతకు ఉద్యోగాలు, ఉపాధి దొరుకుతుంది. అమరావతి నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం నుండి ఒక్క రూపాయి కూడా ఖర్చు పెట్టాల్సినవసరం లేదు. ప్రభుత్వ ఆధీనంలో ఉన్న భూమిని దశలవారీగా రాజధాని నిర్మాణానికి చేసిన అప్పులను వడ్డీలతో సహా చెల్లించవచ్చు. మిగిలిన డబ్బుని 175 నియోజకవర్గాల అభివృద్ధికి వినియోగించుకోవచ్చన్నారు. రాజధానిలో నిర్మాణాలకు పోగా మిగిలిన రూ.2లక్షల కోట్ల పైబడి విలువైన మిగులు భూములు అమరావతిలో ఉన్నాయన్నారు. పదేళ్ల తరవాత సైబరాబాద్ వద్ద పెరిగినట్లు ఇక్కడ కూడా భూములు విలువ ఎకరం 50 కోట్లకు పైగా పెరగవచ్చని ధీమా వ్యక్తం చేశారు. జగన్ రెడ్డి తీసుకున్న మూడు రాజధానుల ప్రతిపాదన కారణంగా పెట్టుబడులు గణనీయంగా పడిపోయాయన్నారు. రాష్ట్రవ్యాప్తంగా భూముల విలువ పడిపోయిందన్నారు. అమరావతి మునిగిపోయే రాజధాని అని, అమరావతికి నిర్మాణం కోసం సమకూర్చుకున్న నిధులను ప్రజల నుండే వివిధ రూపాల్లో వసూలు చేస్తారని అబద్ధపు ప్రచారం చేస్తున్నారన్నారు. జగన్ రెడ్డి నిర్వాకం వల్ల 2 లక్షల కోట్ల రూపాయల విలువైన 130 పరిశ్రమలు, ప్రఖ్యాత వ్యాపార, విద్యాసంస్థలు పొరుగు రాష్ట్రాలకు తరలి పోవడంతో లక్షలాది మంది ఉద్యోగాలు కోల్పోయారన్నారు. ప్రతిపక్ష హోదాలో ఉన్నప్పుడు అమరావతిలో రాజధాని నిర్మించడానికి జగన్ మద్దతు తెలిపాడన్నారు. అధికారంలోకి వచ్చాక 3 రాజధానుల పేరుతో కుల చిచ్చు, ప్రాంతీయ చిచ్చు పెట్టి తన కుంభకోణాల నుండి ప్రజల దృష్టి మళ్లించే కుట్ర చేశాడన్నారు. ఏపీలో 3 రాజధానులు పెడతామంటూ ప్రచారం చేసిన జగన్ రెడ్డి, అసెంబ్లీలో అడ్డగోలు తీర్మానాలతో హడావుడి చేశాడన్నారు. శాసనమండలిలో 3 రాజధానుల బిల్లులు పాస్ చేయలేదనే నెపంతో అప్పటి చైర్మన్ షరీఫ్‌పై దాడి చేశారన్నారు. అమరావతిని పూర్తిగా చంపేయాలనే దుష్ట ఆలోచనలతో జగన్ రెడ్డి అండ్ కో రాజధాని రైతులను చిత్ర హింసలకు గురి చేశారన్నారు. జగన్మోహన్ రెడ్డి తన ఐదేళ్ల పాలనలో ఏపీ రాజధాని అమరావతిని కుప్పకూల్చాడన్నారు. ఎక్కడి పనులు అక్కడే ఆపేశాడన్నారు. రోడ్లను తవ్వేసి వైసీపీ నేతలు, కార్యకర్తలకు దోచిపెట్టాడన్నారు. రాజధాని నిర్మాణం కోసం కాంట్రాక్టర్లు తెచ్చిన మెటీరియల్‌ను కూడా వైసీపీ ఎంపీ, ఎమ్మెల్యేలు తమ అనుచరులతో దోపిడీ చేయించారని ఆరోపించారు. కాంట్రాక్టర్లను తన్ని తరిమేశాడన్నారు. అమరావతిని శ్మశానం అని, ఎడారి ప్రాంతం అని, ఒక సామాజిక వర్గానికి చెందిన ప్రాంతం అని, అమరావతిపై కమ్మరావతి అని విద్వేష వ్యాఖ్యలు చేశాడన్నారు. వాస్తవానికి అమరావతి ప్రాంతంలో దళితులు, బీసీలు ఎక్కువగా ఉన్నారని వివరించారు. కాపు, ముస్లిం, బ్రాహ్మణ, వైశ్య వర్గాలు అన్నీ కుడి ఎడమగా ఉన్నాయన్నారు. దళిత రైతులపై అక్రమ కేసులు పెట్టడమే కాకుండా దళితులపైనే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు బనాయించి వారి చేతులకు బేడీలు వేసి జైళ్లకు తరలించి హింసించాడన్నారు. ఇన్ని నిర్బంధాల్లో సైతం 1,631 రోజుల పాటు నిర్విరామంగా రాజధాని రైతులు పోరాటాలు చేశారన్నారు. ఈ సుదీర్ఘ పోరాటంలో 230కి పైగా రైతులు వేధింపులు తాళలేక ప్రాణాలొదిలారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల ప్రాణత్యాగాలు ఓవైపు... పోరాటాలు మరోవైపు... న్యాయస్థానాల జోక్యంతో రాజధాని అమరావతి చెక్కు చెదరకుండా అలా నిలబడిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు తన పరిపాలనా దక్షతతో ప్రపంచబ్యాంకు, ఏషియన్ డెవలప్మెంట్ బ్యాంకులను ఒప్పించి తెచ్చిన నిధులతో అమరావతి పనులు రానున్న కాలంలో పరుగులు పెట్టనున్నాయన్నారు. 175 నియోజకవర్గాల్లో యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించే కల్పతరువు అమరావతి అన్నారు. విధ్వంసమైన రాజధాని అమరావతిని చంద్రబాబు మళ్లి పట్టాలెక్కిస్తున్నారన్నారు. జగన్ రెడ్డి నిర్వాకం వల్ల 2 లక్షల కోట్ల రూపాయల విలువైన 130 పరిశ్రమలు తరలిపోయాయన్నారు. వ్యాపార, విద్యాసంస్థలు పొరుగు రాష్ట్రాలకు తరలి పోవడంతో లక్షలాది మంది ఉద్యోగాలు కోల్పోయిన విషయం అందరికీ తెలిసిందేన్నారు. ఈ రాష్ట్రాన్ని చంద్రబాబు తప్పక స్వర్ణాంధ్రప్రదేశ్ చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

# స్పీకర్ అయ్యన్నపాత్రుడుకు తానా అధికారిక ఆహ్వానం



అమరావతి, (చైతన్యరథం): తెలుగు అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా (తానా) ఆధ్వర్యంలో వచ్చే జూలై 3 నుండి 5వ తేదీ వరకు అమెరికా మిషిగాన్ రాష్ట్రం, నోవీ నగరంలోని సబర్బన్ కలెక్షన్ షోప్లేస్ వేదికగా 24వ తానా మహాసభలు నిర్వహించనున్నారు.

ఈ మహాసభలకు స్పీకర్ అయ్యన్నపాత్రుడును ముఖ్య అతిథిగా ఆహ్వానించేందుకు తానా ప్రతినిధులు ఆయనను బుధవారం అసెంబ్లీలో స్పీకర్ చాంబర్‌లో కలుసుకున్నారు. ఈ సందర్భంగా తానా కాన్ఫరెన్స్ చైర్మన్ నాదెళ్ళ గంగాధర్, మాజీ అధ్యక్షుడు జయరామ్ కోమటి, కాన్ఫరెన్స్ డైరెక్టర్ సునీల్ పాంత్ర, చందు గొర్రెపాటి, శ్రీనివాస్ నాదెళ్ళ, తదితరులు స్పీకర్ అయ్యన్నపాత్రుడుకు సభ వివరాలను తెలియజేసి, ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. తానా సంస్థ ఉత్తర అమెరికాలో అతి పెద్ద తెలుగు సంఘంగా గుర్తింపు పొందింది. ఈ సంస్థ నార్త్ అమెరికా తెలుగు సమాజానికి సామాజిక, సాంస్కృతిక, విద్యా రంగాల్లో విశేష సేవలందిస్తోంది. ప్రతి రెండేళ్లకోసారి నిర్వహించే తానా మహాసభలు భారతీయ వర్గాలలో అతిపెద్ద సదస్సులలో ఒకటిగా నిలుస్తాయి అని ఈ సందర్భంగా తానా మహాసభల చైర్మన్ గంగాధర్ నాదేళ్ళ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సాంస్కృతిక, వ్యాపార, ఆధ్యాత్మిక, రాజకీయ, వైద్య, ఇంజనీరింగ్, శాస్త్ర రంగాల్లో పేరుపొందిన ప్రముఖులు, కళాకారులు, రచయితలు, సినీ ప్రముఖులు, పారిశ్రామికవేత్తలు, ఆధ్యాత్మిక నాయకులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొంటారు. ప్రతిసారీ దాదాపు 10,000 మందికిపైగా తెలుగు ప్రజలు ఈ మహాసభలకు హాజరవుతారని నిర్వాహకులు తెలిపారు. స్పీకర్ అయ్యన్నపాత్రుడు పాల్గొనడం వల్ల మహాసభలకు మరింత మన్నన లభిస్తుందని, ఈ సందర్భంగా ఆయన్ను ఆహ్వానించడాన్ని తాము గౌరవంగా భావిస్తున్నామని తానా ప్రతినిధులు తెలిపారు.

# సమన్వయంతోనే సమగ్రాభివృద్ధి సాధ్యం



**- ప్రకాశం జిల్లా అభివృద్ధిపై సమన్వయ సమావేశం**

**- మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అధ్యక్షతన సమీక్ష**

ఒంగోలు, (చైతన్యరథం): ప్రకాశం జిల్లా సమగ్ర అభివృద్ధికి సంబంధించి బుధవారం జిల్లా ఇంచార్జి మంత్రి, దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి అధ్యక్షతన సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో జిల్లాకు చెందిన మంత్రి, శాసనసభ్యులు పాల్గొని వివిధ అభివృద్ధి కార్యక్రమాలపై సమగ్రంగా చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి మాట్లాడుతూ ప్రకాశం జిల్లా అభివృద్ధికి సమన్వయమే కీలకమని, అన్ని శాఖలు పరస్పర సహకారంతో పనిచేస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. జిల్లా అభివృద్ధికి అవసరమైన నిధుల సమీకరణ, అలాగే రానున్న వేసవిలో నీటి ఎద్దడిని నివారించేందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించనున్నట్లు తెలిపారు. ముఖ్యంగా నియోజకవర్గాలలో దేవాలయాల అభివృద్ధికి సంబంధించి సమావేశంలో జిల్లాకు చెందిన శాసనసభ్యులు తమ నియోజకవర్గాల్లోని దేవాలయాల అభివృద్ధికి సంబంధించి నిధుల విడుదల చేయాలనీ మంత్రిని కోరారు. ప్రత్యేక చొరవ తీసుకొని దేవాలయాల అభివృద్ధికి పెద్దపీట వేస్తానని మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి హామీ ఇచ్చారు. రానున్న రోజుల్లో నియోజకవర్గాల వారీగా సమావేశం నిర్వహిస్తామని మంత్రి ప్రకటించారు.

**జిల్లా అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి**

ఈ సమావేశంలో మంత్రులు, శాసనసభ్యులు, అధికారులు తమ అభిప్రాయాలను వెల్లడించారు. ప్రధానంగా సమగ్ర ప్రణాళిక ఆధారంగా ప్రాజెక్టుల అమలు, అభివృద్ధి పనుల వేగవంతం, ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడం వంటి అంశాలపై చర్చించామని మంత్రి తెలిపారు. ఈ సమావేశంలో పాల్గొన్న మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి మాట్లాడుతూ మార్కాపురం పట్టణంలోని శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి దేవస్థాన భూములు అన్యాక్రాంతం అయ్యాయని దీనిపై తక్షణమే ఎంక్వైరీ చేసి దేవాదాయ శాఖ స్వాధీనం చేసుకోవాలని దేవాదాయ శాఖ మంత్రిని కోరారు. ఈ సమావేశానికి జిల్లా మంత్రి డాక్టర్ డోలా బాల వీరాంజనేయ స్వామి, ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్దన్, కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి , దేవాదాయ శాఖ సెక్రటరీ వినయ్ చంద్, దేవాదాయ శాఖ కమిషనర్ రామచంద్ర మోహన్ హాజరయ్యారు. జిల్లాలో ప్రగతి తీరును సమీక్షిస్తూ, అభివృద్ధి కార్యక్రమాల అమలు విధానంపై సూచనలు అందించారు.

# అమరావతి నిర్మాణానికి రూ.15వేల కోట్ల రుణం

**మండలిలో మంత్రి నారాయణ వెల్లడి**



అమరావతి, (చైతన్యరథం): అమరావతికి ప్రపంచ బ్యాంకు,ఏషియన్ డెవలప్ మెంట్ బ్యాంక్ 15వేల కోట్ల రూపాయల రుణం ఇస్తున్నారని, ఈ రుణంపై కేంద్ర ఆర్థిక మంత్రి కూడా స్పష్టత ఇచ్చారని మంత్రి డాక్టర్ నారాయణ వెల్లడించారు. బుధవారం ఆయన అసెంబ్లీలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇచ్చారు. అయితే ఈ నిధుల్లో గ్రాంట్ ఎంత...?రుణం ఎంత అనేది చర్చించి చెబుతామని పేర్కొన్నారు. హడ్కో ద్వారా 11 వేల కోట్లు రుణం తీసుకుంటున్నా మన్నారు. కేఎఫ్‌డబ్ల్యు అనే జర్మన్ బ్యాంక్ రూ. 5వేల కోట్ల రుణం ఇస్తోందన్నారు. మొత్తం 31వేల కోట్లు అమరావతికి వివిధ రూపాల్లో నిధులు సమకూరుతున్నాయన్నారు. అమరావతికి రైల్వే ప్రాజెక్ట్ ఖర్చు కేంద్రమే భరిస్తుందని స్పష్టం చేశారు. అమరావతి రైల్వే ప్రాజెక్ట్‌కు అవసరమైన భూమిని ఎలా సేకరించాలనే దానిపై చర్చిస్తున్నామన్నారు. అమరావతి డిజైన్ చేసినప్పుడే సెల్ఫ్ సస్టైనబుల్‌గా డిజైన్ చేశామన్నారు. ప్రస్తుతం పనులు ప్రారంభించడానికి బడ్జెట్‌లో 6000 కోట్లు కేటాయించామని తెలిపారు. ప్రజలు పన్నుల రూపంలో చెల్లించిన డబ్బులు అమరావతికి వాడకూడదని సీఎం చాలా స్పష్టంగా చెప్పారన్నారు. రాజధాని కోసం తీసుకున్న రుణాలను అమరావతి పూర్తయిన తర్వాత అక్కడి భూములతో రీ పేమెంట్ చేస్తామన్నారు. బ్యాంకుల ద్వారా డబ్బులు రావడానికి ఆలస్యం అవుతుందన్నారు. ఈ బడ్జెట్లో కేటాయించిన రూ. 6వేల కోట్లతో పనులు ప్రారంభిస్తామన్నారు. రుణాల ద్వారా డబ్బులు వచ్చిన తర్వాత బడ్జెట్ నిధులకు జమ చేస్తామని వివరించారు.

# స్టీల్ ప్లాంట్ నిర్వాసితులకు సత్వర న్యాయం

**ఎమ్మెల్యే పల్లా మంత్రి అనగాని సమాధానం**





అమరావతి, (చైతన్యరథం): విశాఖ స్టీల్ ప్లాంట్ భూసేకరణపై ఆర్అండ్ ఆర్‌ప్యాకేజీ అమలుతీరుపై టీడీపీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అడిగిన ప్రశ్నకు రాష్ట్ర రెవెన్యూ, రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ శాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్ సమాధానం ఇచ్చారు.

విశాఖ స్టీల్ ప్లాంట్‌కు భూ సేకరణకు సంబంధించి ఇచ్చిన ఆర్అండ్ఆర్ ప్యాకేజీలో మిగిలి పోయిన వారికి త్వరలోనే న్యాయం చేస్తామన్నారు. 20 మంది రైతులకు భూసేకరణకు సంబంధించిన నష్ట పరిహారం ఇవ్వాల్సి ఉందన్నారు. వీరికి సంబంధించి కోర్టుల్లో కేసులు ఉన్నాయి. వాటిని త్వరగా పరిష్కరించి రైతులకు న్యాయం చేస్తాం. 624 నిర్వాసితులకు ఇంకా ఇళ్ల స్థలాలు మంజూరు చేయాల్సి ఉంది. త్వరలోనే ఇచ్చేస్తాం. 7,897 మంది నిర్వాసిత కుటుంబాలకు ఉద్యోగ అవకాశాలు కల్పించాల్సి ఉంది. దీనిపై తగు చర్యలు తీసుకుంటాం.

# త్వరలో జిల్లాల వారీగా అసైన్‌మెంట్ కమిటీలు

**- మంత్రివర్గ ఉపసంఘం నిర్ణయం**

**- రెవిన్యూ మంత్రి అనగాని వెల్లడి**

అమరావతి, (చైతన్యరథం): అమరావతిలోని సచివాలయంలో రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ అధ్యక్షతన భూ పరిపాలన సంస్కరణలపై ఏర్పాటైన మంత్రి వర్గ ఉపసంఘం భేటీ జరిగింది. మంత్రులు పయ్యావుల కేశవ్, నారాయణ, టీజీ భరత్, ఆనం రామనారాయణ రెడ్డి, ఎన్ఎండీ ఫరూక్ హాజరయ్యారు. సమావేశం అనంతరం మంత్రి అనగాని సత్యప్రసాద్ మీడియాతో మాట్లాడారు. ప్రధానంగా ఐదు అంశాలైన ఫ్రీ హోల్డ్, 22ఎ భూములు, అందరికీ ఇళ్లు, నాలా, అసైన్మెంట్ కమిటీల ఏర్పాటుపై లోతుగా చర్చించామన్నారు. వెనువెంటనే అసైన్ మెంట్ కమిటీలను జిల్లాల వారీగా ఏర్పాటు చేయాలని నిర్ణయించామన్నారు.

మిగిలిన అంశాలపై వచ్చే నెల 16వ తేదీన రెండోసారి జరిగే భేటీలో కీలక నిర్ణయాలు తీసుకుంటామన్నారు. ఫ్రీ హోల్డ్ చేసిన భూముల్లో ఐదు లక్షల ఎకరాల మేరకు అక్రమాలు చోటు చేసుకున్నట్లు గుర్తించామన్నారు. వీటిని ఏం చేయాలనే దానిపై లోతుగా చర్చించామన్నారు. మరో సమావేశం నాటికి నిర్ణయం తీసుకుంటామన్నారు. అందరికీ ఇళ్ల పథకం కింద గత ప్రభుత్వంలో చోటు చేసుకున్న అవకతవకలపై నిగ్గు తేలుస్తామన్నారు.ప్రస్తుతం పేదలకు ఇళ్ల పట్టాలు, అక్రమంగా కట్టుకున్న ఇళ్ల క్రమబద్ధీకరణపై ఒక విధానాన్ని రూపొందించాలని నిర్ణయించామన్నారు.స్పీడ్ ఆఫ్ డూయింగ్ గవర్నెన్స్‌లో భాగంగా నాలా అనుమతుల్లో వేగాన్ని పెంచేలా చట్టంలో మార్పులపై చర్చించామన్నారు. ప్రతి పేదవాడికీ న్యాయం చేయడంతోపాటు పారిశ్రామికవేత్తలకు అనువైన వాతావరణం కల్పించేలా భూ పరిపాలనలో సంస్కరణలను ప్రతిపాదిస్తామన్నారు.

# తరలివచ్చిన బాధితులు, వెల్లువెత్తిన సమస్యలు

**టీడీపీ కేంద్ర కార్యాలయంలో అర్జీలు స్వీకరించిన ఏపీ కో-ఆపరేటివ్ ఆయిల్ సీడ్స్ గ్రోవర్స్ చైర్మన్ గండి బాబ్జీ, ఏపీ హ్యాండ్లూమ్ కోపరేటివ్ సొసైటీ చైర్మన్ సజ్జా హేమలత**

మంగళగిరి, (చైతన్యరథం): తిరుపతి జిల్లా సత్యవేడు మండలం అల్లపగుంట గ్రామానికి చెందిన వేముల సరిత, వేముల ఆదిలక్ష్మి అల్లపాకు కన్నెమ్మలు విజ్ఞప్తి చేస్తూ తమ ఊరిలో గుర్రం వెంకటేశ్వర్లు, గండం మనోహర్, గండం సుబ్రహ్మణ్యం అనే వ్యక్తులకు దాదాపు 42 లక్షలకు పైగా డబ్బులు ఇచ్చి పొలాన్ని కొనుగోలు చేశామని, వారు తమను పొలంలోకి వెళ్లనియ్యకుండా దౌర్జన్యం చేస్తున్నారని.. వారిపై చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని బుధవారం టీడీపీ కేంద్రకార్యాలయంలో నిర్వహించిన ప్రజా వినతుల స్వీకరణ కార్యక్రమంలో ఏపీ కో–ఆపరేటివ్ ఆయిల్ సీడ్స్ గ్రోవర్స్ చైర్మన్ గండి బాబ్జీ, ఏపీ హ్యాండ్లూమ్ కోపరేటివ్ సొసైటీ చైర్మన్ సజ్జా హేమలతకు అర్జీ ఇచ్చి వేడుకున్నారు. గాదె చిన్నప్పరెడ్డి అనే వ్యక్తికి సంబంధించిన కమర్షియల్ ఫ్లాట్స్ కోసం.. గత 30 సంవత్సరాలుగా ఉంటున్న తమ ఇంటిని కూలుస్తామని అధికారులు వచ్చి బెదిరిస్తున్నారని ఎన్టీఆర్ జిల్లా కంచికచర్ల కు చెందిన బొందల రవిబాబు గ్రీవెన్స్ లో నేతలకు అర్జీ ఇచ్చి ఆవేదన వ్యక్తం చేశాడు.

వాపోయారు. గడువు కోరినా ఇవ్వకుండా ఎటువంటి ప్రత్యామ్నాయం చూపకుండా తమకు నోటీసులు ఇస్తూ ఇబ్బంది పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశాడు.

అల్లూరి జిల్లా కొయ్యూరు మండలం మర్రివాడ గ్రామ పంచాయతీ దొడ్డవరం గ్రామానికి చెందిన వీఆర్వీ జుర్ర సత్యనారాయణ ఉపాధి హామీ పథకం పనుల్లో అవినీతి అక్రమాలకు పాల్పడుతున్నాడని.. అతనిపై చర్యలు తీసుకొని తొలగించాలని గ్రామానికి చెందిన పలువురు వ్యక్తులు గ్రీవెన్స్‌లో ఇచ్చిన అర్జీలో ఫిర్యాదు చేశారు.

నెల్లూరు జిల్లా వింజమూరు మండలం కాటేపల్లి గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తూ మూగజీవాల మేతకు ఆధారంగా ఉన్న భూములను అధికారులు, అక్రమార్కులతో కుమ్మక్కై వారికి కట్టబెట్టారని, దీనిపై విచారించి వాటిని రద్దు చేసి భూములను రైతుల పశు మేతకోసం వదలాలని విజ్ఞప్తి చేశారు.

కోర్టులో ఉన్న ఆస్తిని తన తమ్ముడే ఆక్రమించుకొని అద్దెకు ఇచ్చుకున్నాడని.. దీనిపై ప్రశ్నిస్తే.. తమపై దౌర్జన్యానికి వస్తున్నాడని.. కుమార్ దేవదాస్‌పై చర్యలు తీసుకొని తమ ఇంటిని కబ్జా నుండి విడిపించాలని ఎన్టీఆర్ జిల్లా విజయవాడకు చెందిన నాలాది జాకబ్ రాజు గ్రీవెన్స్‌లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేశాడు.

జోన్ - 1
(శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, అరకు)
చైతన్యరథం

# ఆంధ్రప్రదేశ్‌కు శుభవార్త చెప్పింది కేంద్ర ప్రభుత్వం

**● విశాఖ, విజయవాడ మెట్రో రైలు ప్రాజెక్టులకు నిధులు మంజూరు**



విశాఖపట్నం, విజయవాడ మెట్రో రైలు ప్రాజెక్టుల సీఎంపీ కోసం నిధులు మంజూరు చేసింది కేంద్రం.. రెండు మెట్రో ప్రాజెక్టులకు ఇచ్చిన మొబిలిటీ ప్లాన్ గడువు ఐదేళ్లు దాటిపోవడంతో.. తిరిగి మరోసారి ప్లాన్ రూపొందించాలని కోరింది సెంట్రల్ అర్బన్ ట్రాన్స్పోర్ట్ విభాగం.. అయితే, కేంద్రం సూచనలతో సీఎంపీ కోసం కన్సల్టెన్సీ సంస్థను టెండర్ల ద్వారా ఎంపిక చేసింది ఏపీ మెట్రో రైల్ కార్పొరేషన్.. రెండు నగరాల్లో సమగ్ర మొబిలిటీ ప్లాన్ రూపకల్పన కోసం సిస్ట ఎంవీఏ సంస్థ ఎంపిక చేశారు.. విశాఖలో 84.47 లక్షలు, విజయవాడలో 81.68 లక్షలతో ప్లాన్ రూపొందించనుంది సంస్థ.. ఆయా పనుల కోసం ఏపీ మెట్రో రైల్ కార్పొరేషన్కు నిధులు మంజూరు చేసింది సెంట్రల్ అర్బన్ ట్రాన్స్పోర్ట్ విభాగం.. కాగా, విశాఖ, విజయవాడ మెట్రో రైల్ ప్రాజెక్టుకు ఏపీ ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన విషయం విదితమే.. విశాఖలో మొత్తంగా మూడు కారిడార్లలో ఈ మెట్రో రైల్ ప్రాజెక్టుకు ఆమోదం లభించింది.. వైజాగ్ స్టీల్ ప్లాంట్ నుంచి కొమ్మాదికి 34.4 కిలోమీటర్లు.. గురుద్వారా నుంచి ఓల్డ్ పోస్ట్ ఆఫీసుకు 5.08 కిలో మీటర్లు.. తాడిచెట్ల పాలెం నుంచి చినవాల్తేర్ 6.75 కిలోమీటర్లు.. ఈ మూడు లైన్లు ఫేజ్ 1గాను కొమ్మాది నుంచి భోగాపురం వరకు 30.67 కిలోమీటర్లు రెండవ ఫేజ్ లోనూ పూర్తి చేయడానికి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.. మొత్తం 76.9కిలోమీటర్లు మెట్రోరైల్ ప్రాజెక్టుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం.. ఇక, విజయవాడలో 66.15 కిలోమీట్ల నిడివితో మెట్రో రైల్ ప్రాజెక్టు రాబోతోంది.. మొదటి ఫేజ్ లో 38.4 కిలోమీటర్లు, రెండవ ఫేజ్ లో 27.75 కిలోమీటర్లు మెట్రో రైలు నిర్మాణం చేపట్టనున్నారు. ఇక, మొదటి ఫేజ్లో 1,152 కోట్ల రూపాయలతో భూసేకరణ చేయనుండగా.. రూ.11,009 కోట్లతో మెట్రో రైలు నిర్మాణం చేపట్టనున్నారు. గన్నవరం నుంచి పండిట్ నెహ్రూ బస్టాండ్.. పండిట్ నెహ్రూ బస్టాండ్ నుంచ పెనమలూరు, పండిట్ నెహ్రూ బస్టాండ్ నుంచి అమరావతికి ఇలా మూడు కారిడార్లలో విజయవాడ మెట్రో రైల్ నిర్మాణం చేపట్టేందుకు ఏపీ ప్రభుత్వం నిర్ణయించిన విషయం విదితమే.

# దీర్ఘకాలిక సమస్యగా ఉన్న టీజీటీ, పీజీటీ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారించాలి : కూన రవికుమార్



అమరావతి (చైతన్యరథం): రాష్ట్రంలో 14 సంవత్సరాలుగా దీర్ఘకాలిక సమస్యగా ఉన్న టీజీటీ, పీజీటీ ఉపాధ్యాయుల పదోన్నతుల సమస్యలపై ప్రభుత్వం తక్షణమే దృష్టి సారించాలని ఆమదాల వలస ఎమ్మెల్యే కూన రవికుమార్ కోరారు. శాసనసభలో మాట్లాడుతూ రాష్ట్రంలో 126 సైన్స్ కళాశాలల్లో 86 మంది ఉపాధ్యాయులు ఈ సమస్యను ఎదుర్కొంటున్నారని, ఈ సమస్యపై 2010లో కమిటీ విచారణ కూడా చేపట్టినట్లు తెలిపారు. మళ్లీ 2023లో కూడా ఇదేసమస్యపై మరో కమిటీ రాష్ట్రంలో విచారణ పూర్తి చేసిందని చెప్పారు. అధికారులు స్పందించి ఆ ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని కోరారు. 8, 9, 10 తరగతుల్లో బోధిస్తున్న టీజీటీ, పీజీటీ ఉపాధ్యాయులు పదోన్నతులకోసం నిరీక్షించడానికి అధికారులు నిర్లక్ష్యమేకారణమని తెలిపారు.

అసంపూర్తిగా ఉన్న గృహ నిర్మాణాలను మరింత వేగవంతం చేసి పూర్తి చేసుకోవాలని, ఇందుకు ప్రభుత్వం ఆర్థికసాయం చేస్తుందని ఎమ్మెల్యే కూన రవికుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్వర్ణాంధ్ర-2047 విజన్‌లో భాగంగా 2029 నాటికి అందరికీ సొంత ఇళ్లు ఉండాలన్న లక్ష్యంతో ప్రభుత్వం చర్యలు చేపట్టిందని తెలిపారు. పీఎంఏవై 1.0లో ఇళ్లు, పీఎంఏవై, పీఎంజనమన్ పథకంలో మంజూరై వివిధదశల్లో నిర్మాణంలో ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీలకు చెందిన గృహాల నిర్మాణాలకు యూనిట్ విలువకు అదనంగా ఆర్థికసాయం అందించాలని ప్రభుత్వం సంకల్పించిందని పేర్కొన్నారు. ఎస్సీ, బీసీలకు రూ.ఐదు వేలు, ఎస్టీలకు రూ.75 వేలు, పీవీ జీటీలకు రూ.లక్ష ఆర్థికసాయం చేయనున్నట్టు తెలిపారు.

# బయ్యవరం ఘటనపై సీఎం సీరియస్




అనకాపల్లి జిల్లా బయ్యవరం వద్ద మహిళను ముక్కలుగా నరికిన ఘటనపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సీరియస్ అయ్యారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా ఇన్‌ఛార్జ్ ఎస్పీ వకుల్ జిందాల్‌ను ఆదేశించారు. హత్య ఘటనపై మంగళవారమే స్పందించిన సీఎం చంద్రబాబు... ఎస్పీ వకుల్ జిందాల్ నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కాగా, బుధవారం ఢిల్లీ పర్యటనలో ఆయన ఎస్పీకి మరోసారి ఫోన్ చేసి కేసు గురించిన వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నిందితులను గుర్తించి, అదుపులోకి తీసుకున్నట్లు ముఖ్యమంత్రికి వకుల్ జిందాల్ తెలిపారు. అయితే ఈ దారుణానికి పాల్పడిన వారికి చట్టప్రకారం కఠిన శిక్ష పడేలా చూడాలని ఎస్పీని సీఎం చంద్రబాబు ఆదేశించారు. ఏపీలో చిన్నారులు, మహిళలపై అరాచకాలకు పాల్పడితే ఊరుకునే ప్రసక్తే లేదని ముఖ్యమంత్రి హెచ్చరించారు. ఆడబిడ్డల జోలికి వస్తే రాష్ట్ర ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుందని చెప్పారు. హత్యలు, అత్యాచారాలు, హత్యాచారాలు వంటి వాటికి రాష్ట్రంలో చోటు లేదన్నారు. ఎవరైనా దాడులకు తెగబడితే ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలిపెట్టే ప్రసక్తే లేదని హెచ్చరించారు.

అసలేం జరిగిందంటే..

సుమారు 40 ఏళ్ల వయసున్న గుర్తుతెలియని మహిళను హత్య చేసిన దుండగులు ఆమె శరీర భాగాలను అనకాపల్లి జిల్లా కశింకోట మండలం బయ్యవరం వద్ద పడేశారు. జాతీయ రహదారి పక్కన కల్వర్టు కింద ఓ మూటను గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. హుటాహుటిన అక్కిడికి చేరుకున్న వారు దాన్ని పరిశీలించగా.. అందులో మహిళ కుడి చేయి, కాళ్లు, నడుము కింద భాగం గుర్తించి షాక్ అయ్యారు. అనంతరం ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతురాలికి సుమారు 40 సంవత్సరాలు ఉంటాయని, చేతికి బంగారు రంగు గాజులు, పచ్చబొట్లు ఉన్నట్లు తెలిపారు. సీఎం చంద్రబాబు ఆదేశాలతో దర్యాప్తు వేగవంతం చేసి ఎట్టకేలకు నిందితులను అదుపులోకి తీసుకున్నారు.

# సీఎంను కలిసిన ఎంపీ కలిశెట్టి



విజయనగరం (చైతన్యరథం): రహదారల అభివృద్ధికి సహకరించాలని ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు బుధవారం సీఎం చంద్రబాబును కలిసి వినతి పత్రం అందజేశారు. రామభద్రపురం నుంచి రాయగడ వరకు వయా బొబ్బిలి, పార్వతీపురం మీదుగా నాలుగు లైన్ల రోడ్ అప్గ్రేడేషన్ చేయాలని కోరారు. అదేవిధంగా నెల్లిమర్ల జంక్షన్ నుంచి వయా రామతీర్థాలు మీదుగా రణస్థలం రోడ్డు, విజయనగరం, వయా చీపురుపల్లి, పాలకొండ సీతంపేట, కొత్తూరు, మీదుగా అర్థబంగి రోడ్డు అప్గ్రేడేషన్ చేయాలని కోరారు. ఇటీవల కాలంలో ఇదే సమస్యలపై కేంద్ర మంత్రి నితిన్ గడ్కారీనీ కలిసి వినతిపత్రం సమర్పించామని ఎంపీ చంద్రబాబుకు వివరించారు.

# ఆహారకల్తీ అంశంపై అసెంబ్లీలో కీలక చర్చ



అమరావతి (చైతన్యరథం): గుంటూరు మిర్చి యార్డు అక్రమాలపై చర్యలకు ఎమ్మెల్యేలు డిమాండ్ చేసారు. వైసీపీ ప్రభుత్వంలో టీడీపీ కార్యాలయంపై దాడి ఘటనకు గుంటూరు మిర్చియార్డు కూడా వేదిక అయిందని ధూళిపాళ్ల ఆరోపించారు. మిర్చి యార్డును ప్రక్షాళన చేసి లైసెన్సులు రివ్యూ చేయాలని కోరారు. మిర్చి యార్డులో కోట్ల రూపాయలు సరుకు తీసుకొని ఐపీ పెడుతున్నారని మండిపడ్డారు. మార్కెట్ సెస్‌లో రూ.250 కోట్లకు రూ.100కోట్లు కూడా రావడం లేదని రామాంజనేయులు అన్నారు. ఐదేళ్లలో గుంటూరు మిర్చి యార్డును నాశనం చేసారని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. వైసీపీ వాళ్లు లారీ యూనియన్ పెట్టి ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన లారీలు ఇక్కడికి రానీయకుండా అడ్డుకున్నారని ధ్వజమెత్తారు. విజిలెన్స్ నివేదికలో మిర్చిమార్డు గత చైర్మన్లు ఇద్దరు, సెక్రటరీలు కలిసి నడిపినట్టు తేలిందని అక్రమాలపై కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి అచ్చెన్న వెల్లడించారు.

ఆహార కల్తీలో ఏపీ మొదటి స్థానం: అసెంబ్లీ ప్రశ్నోత్తరాల్లో ఆహారకల్తీ అంశంపై కీలక చర్చ జరిగింది. తిరుపతి లడ్డును కూడా కల్తీ చేసారని జనసేన ఎమ్మెల్యే పంతం నానాజీ తెలిపారు. ఆహర కల్తీలో మొదటి స్థానంలో మన రాష్ట్రం ఉందని చెప్పడానికి సిగ్గుపడుతున్నానని అన్నారు. హెూటళ్లపై సరైన నియంత్రణ ఉండడం లేదని వ్యాఖ్యానించారు. రాజమండ్రిలో టీ పోడిలో 12 మంది డీలర్లు టైరుపోడిని కలుపుతున్నారని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి ఆరోపించారు. వారాలు తరబడి మాంసాన్ని నిలువ ఉంచి వాడేస్తున్నారని అన్నారు. సిబ్బందిని, ల్యాబ్‌లను బలోపేతం చేయాలని బాధ్యులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. వంటల్లో కలర్స్, టేస్టింగ్ సాల్ట్ వాడుతున్నారని జనసేన ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ పేర్కొన్నారు. పాలను కల్తీ చేస్తున్నారు, చేపల పెంపకంలోనూ కల్తీ జరుగుతోందని తెలిపారు.

ఆహార భద్రతకు ల్యాబ్‌ల నిర్మాణం: గత ప్రభుత్వం హయాంలో ప్రతి విభాగంలో కల్తీ చేస్తూ వచ్చారని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ అన్నారు. 270 మంది హెడ్ క్వార్టర్స్‌లో స్టాఫ్ ఉండాల్సి వస్తే ఆరుగురు మాత్రమే ఉన్నారని వారు ఎన్నని తనిఖీ చేయగలుగుతారని తెలిపారు. జిల్లా ఫుడ్ సేఫ్టీ పోస్టుల్లో 160 ఉండాల్సి ఉండగా 106 మంది ఉన్నారని తెలిపారు. ల్యాబరేటరీలలో 138 మంది ఉండాల్సి ఉండగా కేవలం 43 మందే ఉన్నారని తనిఖీలకు, పరీక్షలకు సిబ్బంది లేరని వెల్లడించారు. ఆరోగ్య సంరక్షణలో ఆహరం అనేది ప్రధాన పాత్ర పోషిస్తుందని గత పాలకులు గుర్తించలేదని దుయ్యబట్టారు. విశాఖపట్నం, గుంటూరు, తిరుపతిలలో మూడు ల్యాబ్‌లు నిర్మిస్తున్నామని మంత్రి సత్యకుమార్ వెల్లడించారు.

# బాలికల పట్ల అనుచితంగా ప్రవర్తిస్తే కఠినమైన శిక్షలు

విజయనగరం (చైతన్యరథం): ఎవరైనా మీ పట్ల అనుచితంగా ప్రవర్తిస్తే వెంటనే తల్లిదండ్రులు ఉపాధ్యాయులకు చెప్పాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి. సాయి కల్యాణ్ చక్రవర్తి సూచించారు. బుధవారం జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో విజయనగరం పూల్ బాగ్ ఏపీ మోడల్ స్కూల్లో పోక్సో చట్టంపై జరిగిన న్యాయ అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. బాల బాలికలను తల్లిదండ్రులు తప్పనిసరిగా చదివించాలని ఆయన కోరారు. బాలికల పట్ల అనుచితంగా ప్రవర్తిస్తే కఠినమైన శిక్షలు ఎదుర్కోవాల్సి ఉంటుందని ఆయన హెచ్చరించారు. విద్యార్థులు తల్లిదండ్రులు ఉపాధ్యాయులు పట్ల గౌరవంతో మెలగాలని నైతిక విలువలు నేర్చుకోవాలని ఆయన కోరారు. జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి, న్యాయమూర్తి టీ.వి రాజేష్, ఎస్సీ ఎస్టీ కోర్టు న్యాయమూర్తి పాల్గొన్నారు.

# 72 కొత్త జంటలకు జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్ పెళ్ళికానుక




● రూ.14 లక్షల 40,000 అందజేసిన జ్యోతుల నవీన్

జగ్గంపేట (చైతన్యరథం): జగ్గంపేట నియోజకవర్గం నిరుపేద ఆడబిడ్డ పెళ్లి చేసుకుంటే 20,000 రూపాయలు పెళ్ళికానుక జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్ ద్వారా అందిస్తానని కాకినాడ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు జ్యోతుల నవీన్ గత ఎన్నికల సందర్భంగా హామీ ఇచ్చారు. జగ్గంపేట నియోజకవర్గంలో 209 ఆడబిడ్డ పెళ్లిళ్లకు రూ.41,80,000 ఇప్పటివరకు అందించారు. గత నెల రోజులుగా 72 వివాహాలు జరిపించగా వారందరికీ బుధవారం స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నూతన వధూవరులందరికీ 20 వేల రూపాయలు చొప్పున 14 లక్షల 40,000 అందించారు. ఈ సందర్భంగా నవీన్ మాట్లాడుతూ... నియోజవర్గంలో ప్రతి ఆడబిడ్డ నా కుటుంబ సభ్యురాలుగా భావించి జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్ ద్వారా 20,000 పెళ్ళికాను అందిస్తున్నామని ఈ పెళ్లి కానుక అందుకోవడానికి ఒక్కటే అర్హతని మా నియోజకవర్గంలో ఆధార్ కార్డు కలిగి ఉండి 18 సంవత్సరాలు, అబ్బాయికి 21 సంవత్సరాలు పూర్తియి ఉండాలని పెళ్లికి పది రోజుల ముందు జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని నవీన్ అన్నారు. ఎస్వీఎస్ అప్పలరాజు, రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ కొత్త కొండ బాబు, మండల టీడీపీ అధ్యక్షులు పోతుల మోహనరావు, చదరం చంటిబాబు, జీను మణిబాబు, దేవరపల్లి మూర్తి, అడబాల వెంకటేశ్వరరావు, పాఠం శెట్టిరవి, బొల్లంరెడ్డి రామకృష్ణ, పాఠం శెట్టి మురళీకృష్ణ, పోత బత్తుల శ్రీను, బోదిరెడ్ల సుబ్బారావు, శిలామంతుల వీరబాబు, పి.వెంకటేశ్వరరావు, కొంగ్రు అప్పలరాజు, మండపాక వెంకటేశ్వరరావు, సుంకర సీతారామయ్య, వెన్న వీరబాబు, కాకిలేటి రాయుడు, పొనగంటి బాబ్జి గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

# ఆ విద్యార్థుల 'పరీక్ష' ప్రయాణం



కోనసీమ (చైతన్యరథం): నిత్యం రేవులు దాటి పాఠశాలలు, కళాశాలలకు వెళ్లి చదివే విద్యార్థులకు పరీక్షల సమయంలోనూ అవస్థలు తప్పడం లేదు. విద్యార్థులు ఇళ్ల నుంచి రేవుల వరకు వచ్చి అక్కడ పడవలు ఎక్కి మళ్లీ ఆటోలు, ఇతర వాహనాలు పట్టుకొని పరీక్షా కేంద్రాలకు హాజరు కావడం పెద్ద ప్రహసనంలా మారింది. అంబేద్కర్ కోనసీమ జిల్లాలో ఐపోలవరం మండలం గూగుల్ లంక, కాట్రేనికోన మండలం రామాలయంపేట, మాగసానితిప్ప, పి. గన్నవరం మండలాన్ని ఆనుకుని ఉన్న అయోధ్యలంక, మర్రిమూల ప్రాంతాల నుంచి 10వ తరగతి విద్యార్థులు ప్రస్తుతం రేవులు దాటి పరీక్షా కేంద్రాలకు వస్తున్నారు. ఇలా పరీక్షా కేంద్రాలకు చేరుకోవడమే వారికి పెద్ద పరీక్షలా ఉంది. ఆయా రేవుల వద్ద వంతెనలు నిర్మిస్తే విద్యార్థులకే కాకుండా వరదల సమయంలో లంక గ్రామాల ప్రజలకు ఎంతగానో మేలు కలుగుతుంది. రాష్ట్రవ్యాప్తంగా 17వ తేదీ నుంచి పదో తరగతి పరీక్షలు జరుగుతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ఆంగ్లమాధ్యమంలో 5,64,064 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. తొలిసారి ఏడు పేపర్ల విధానంలో ఎగ్జామ్స్ నిర్వహిస్తున్నారు. సామాన్యశాస్త్రంలో భౌతిక, రసాయనశాస్త్రాలు కలిపి ఒక పేపర్‌గా జీవశాస్త్రం మరో పేపర్‌గా ఎగ్జామ్ నిర్వహించనున్నారు. ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం 12:45 గంటల వరకు ఇవి జరుగుతున్నాయి. ఈ నెల 31వ తేదీ వరకు 3,450 కేంద్రాల్లో విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు చేరుకునేందుకు ఆర్టీసీ పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, సిటీ ఆర్డినరీ సర్వీసుల్లో ఉచితంగా ప్రయాణించేందుకు అధికారులు వీలు కల్పించారు.

# ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు రెండోరోజు ఆటలపోటీలు ప్రారంభం

విజయవాడ (చైతన్యరథం): విజయవాడ మున్సిపల్ స్టేడియంలో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ సభ్యులకు రెండవ రోజు జరుగుతున్న ఆటల పోటీలల్లో ఏపీ ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ సభ్యులకు బ్యాడ్మింటన్, త్రోబాల్, క్యారమ్స్, టెన్నికాయిట్, షాట్‌పుట్, క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, టెన్నిస్, టగ్ ఆఫ్ వార్, పరుగుపందెం పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. నిత్యం ప్రజాక్షేత్రంలో పాలనదక్షతను నిర్వహిస్తూ అభివృద్ధి సంక్షేమం రెండు కళ్ళుగా అనునిత్యం కూటమి ప్రభుత్వం పని చేస్తున్నదని ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ సభ్యులకు ఈ క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదం చేస్తున్నయని మంచి ఆహ్లాదకర వాతావరణంలో రాష్ట్ర నలుమూలల నుంచి అందరూ ఒకే చోట మున్సిపల్ స్టేడియం వేదికగా ఈ క్రీడలలో పాల్గొనడం సంతోషాన్ని కలుగజేస్తుందని తెలియజేశారు.



# ఏపీ కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల్లో 22 నుంచి అడ్మిషన్లకు దరఖాస్తులు స్వీకరణ



ఏపీలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల్లో ప్రవేశాలకు మార్చి 22 నుంచి ఆన్లైన్లో దరఖాస్తులు స్వీకరించనున్నట్టు సమగ్ర శిక్షా ఎస్పీడీ బి.శ్రీనివాసరావు తెలిపారు. రాష్ట్రంలోని 352 కేజీబీవీల్లో 2025-26 విద్యా సంవత్సరానికి గాను 6,11 తరగతుల్లో ప్రవేశాల కోసం, 7,8,9,10,12 తరగతుల్లో మిగిలిన సీట్ల భర్తీ కోసం బాలికల నుంచి ఆన్లైన్ దరఖాస్తులు స్వీకరించనున్నట్టు చెప్పారు. ఆన్లైన్ దరఖాస్తులు మార్చి 22 నుంచి ఏప్రిల్ 11 వరకు అందుబాటులో ఉంటాయన్నారు. అనాథలు, బడి బయట పిల్లలు, డ్రాపౌట్స్ (బడి మానేసిన వారు) పేద ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, బీపీఎల్ పరిధిలోని బాలికలు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆన్లైన్ ద్వారా వచ్చిన దరఖాస్తులు మాత్రమే అడ్మిషన్ కోసం పరిగణనలోకి తీసుకుంటామన్నారు. దరఖాస్తులు https://apkgbv. apcfss.in ద్వారా పొందవచ్చని సూచించారు. ఎంపికైన విద్యార్థులకు ఫోన్ ద్వారా మెసేజ్ వస్తుందన్నారు. పూర్తి వివరాలు సంబంధిత పాఠశాల నోటిఫికేషన్ బోర్డులో నేరుగా చూడవచ్చని, సందేహాలకు 70751-59996, 70750-39990 నంబర్లకు సంప్రదించాలని సూచించారు.

# రాయలసీమ అభివృద్ధి వైసీపీకి ఇష్టం లేదు

●అభివృద్ధి జరిగితే అవినీతిని ప్రశ్నిస్తారని వారికి భయం

●ప్రాజెక్టులకు అడ్డు తగిలేది అందుకే.. హంద్రీనీవాపై మాకు చిత్తశుద్ధి ఉంది

●శాసన మండలిలో మంత్రి నిమ్మల రామానాయుడు



అమరావతి (చైతన్యరథం): హంద్రీనీవా ఎత్తిపోతలకు సంబంధించి బుధవారం శాసనమండలిలో వాడివేడి చర్చ జరిగింది. హంద్రీనీవా కాలువ లైనింగ్ పనులకు సంబంధించి వైసీపీ సభ్యుడు అసలు లైనింగే వద్దు అనగానే జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తీవ్రంగా స్పందించారు. మీకు లైనింగే కాదు రాయలసీమ అభివృద్ధి కూడా అవసరం లేదు. రాయలసీమ ప్రాంత ప్రజలు అభివృద్ధి చెంది, బాగుపడితే మీ అవినీతి వైసీపీ పాలనను ఎక్కడ ప్రశ్నిస్తారోనని, భయపడుతున్నారని విమర్శించారు. అందుకే మేము చేసే అభివృద్ధి పనులకు అడుగడుగునా అడ్డు తగులుతూ, అసంబద్ధ ప్రశ్నలు వేస్తున్నారు. ప్రజలకు అబద్ధాలు నూరిపోస్తున్నారు అంటూ మండిపడ్డారు. ఐదేళ్లపాటు హంద్రీనీవా వైపు కన్నెత్తి చూడని తాడేపల్లి రాజప్రసాదం, పరదాలకు పరిమితమైన వైయస్ జగన్మోహన్ రెడ్డిని అడగాల్సిన ప్రశ్నలు, పనులు చేస్తున్న మమ్మల్ని అడగటం విడ్డూరంగా ఉందని నిమ్మల ఎద్దేవా చేశారు. హంద్రీనీవా కాలువ లైనింగ్ పనులు చేసి 6,200 క్యూసెక్కుల నీరు వదలాలని ఉత్తుత్తి జీవో ఇచ్చి పైసా పని కూడా చేయకుండా వదిలేసిన అప్పటి మీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిని ఎందుకు ప్రశ్నించలేదని దుయ్యబట్టారు. లైనింగ్ తప్పు అంటున్న మీరు జగన్మోహన్ రెడ్డి ప్రతిపాదిస్తే అది ఎలా ఒప్పుఅవుతుంది. అధికారంలో ఉంటే ఒకలా, అధికారం కోల్పోతే మరోలా, మాట్లాడటం వైసీపీ మేధావులకు సబబు కాదు అని నిమ్మల చురకలంటించారు. 2019 నాటికే చంద్రబాబు ఏర్పాటు చేసిన 3850 క్యూసెక్కుల సామర్థ్య పంపులను కూడా ఉపయోగించి, నీరు తీసుకురాలేని వైసీపీకి, హంద్రీనీవాపై మాట్లాడే అర్హత లేదన్నారు. జగన్ పాలనలో గాలేరు-నగరి కెనాల్‌కు లైనింగ్ చేశారు. ఆనాడు దాన్ని వ్యతిరేఖించని వైసీపీ అనుకూల మేధావులు, నేడెందుకు హంద్రీనీవాపై మాట్లాడుతున్నారు. రాజకీయ లబ్ధికోసం కాదా? అంటూ ప్రశ్నించారు. జగన్ పాలనలో ఓ పెద్ద మంత్రి గండికోట నుంచి పైపుల ద్వారా ఏకంగా చిత్తూరు జిల్లాకు గాలేరు-నగరి నీరు తరలించాలని పని చేశారు. దీని వల్ల భూగర్భ జలాల సమస్య వస్తుందని వైసీపీ మేధావులకు ఎందుకు తెలియ రాలేదు. ఎందుకు ప్రశ్నించలేదని నిమ్మల ధ్వజమెత్తారు. నేడు రాయలసీమలో ఉన్న ప్రధాన ప్రాజెక్టులన్నీ ఎన్టీఆర్, చంద్రబాబు పూర్తి చేసినవేనని నిమ్మల పునరుద్ఘాటించారు. 798 అడుగుల నుంచి నీరు తీసుకునే మచ్చుమర్రి లిఫ్ట్‌ను చంద్రబాబు ప్రారంభిస్తే, దాన్ని జగన్ నిర్లక్ష్యం చేశాడు. రాయలసీమ లిఫ్ట్ పేరుతో జల జగడం పెట్టారు. దానివల్ల కృష్ణా, తుంగభద్ర గోదావరి జలాలపై ఏపికి ఉన్న ప్రత్యేక హక్కులు కేంద్రం చేతుల్లోకి వెళ్ళాయని ఈ పాపం మీది కదా అంటూ నిమ్మల ఆవేదన చెందారు. ప్రాంతాల మధ్య చిచ్చు పెట్టడం, అభివృద్ధి పనులపై లేనిపోని అపోహలు కల్పించి ఆ పనులు ఆగిపోయేటట్టు చేయటం వైసీపీ రాజకీయ దుర్నీతికి, దిగజారుడుతనానికి నిదర్శనమని నిమ్మల మండిపడ్డారు. రాయలసీమకు జీవనాడి అయిన హంద్రీనీవా పట్ల మా ప్రభుత్వానికి చిత్తశ్ణద్ధి ఉంది. అందువల్లనే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాష్ట్ర బడ్జెట్లో కనీవిని ఎరుగని రీతిలో 3240 కోట్లు కేటాయించారు. పనులు చురుగ్గా సాగుతున్నాయి. కర్నూలు, అనంతపూరం, చిత్తూరు జిల్లాల్లోని హంద్రీనీవా పరివాహక నియోజకవర్గాలన్నిటికి నీరు ఇచ్చి తీరుతామన్నారు.

# బ్రెయిన్ ట్యూమర్ బాధితునికి గోరంట్ల రవిరామ్ సాయం



రాజమహేంద్రవరం (చైతన్యరథం) : బ్రెయిన్ ట్యూమర్ బాధితునికి రాష్ట్ర ఆరోగ్య విభాగం ప్రధాన కార్యదర్శి తెలుగుదేశం పార్టీ రూరల్ నియోజకవర్గ యువ నాయకులు రవిరామ్ కిరణ్ గోరంట్ల ఆర్థిక సాయం అందించారు. రూరల్ నియోజకవర్గం కడియం మండలం జెగురుపాడు గ్రామానికి చెందిన నాగిరెడ్డి సత్తిబాబు అనే వ్యక్తికి అనారోగ్యరీత్యా సంబందించిన ప్రచురించిన పత్రిక మధ్యమాల్లో ద్వారా విషయం తెలుసుకున్న స్థానిక టీడీపీ మరియు కూటమి నాయకులు రాజమండ్రి రూరల్ శాసనసభ్యులు గోరంట్ల బుచ్చయ్య చౌదరి దృష్టికి తీసుకురాగా ఎమ్మెల్యే అదేశానుసారం టీడీపీ ఆరోగ్య విభాగ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవిరామ్ కిరణ్ గోరంట్ల కడియం మండల ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్, కడియం మండల అధ్యక్షులు వెలుగుబంటి రఘురామ్, పాతురి రాజేష్, మరెడ్డి రమేష్, నాగిరెడ్డి రామకృష్ణ నేడు జెగురుపాడులోని బాధితుడు పరామర్శించడం జరిగింది. వృత్తి పరంగా న్యూరో ఫిజిషియన్ కావడంతో బాధితుడి మెడికల్ రిపోర్ట్స్ పరిశీలించి సమస్యను వివరించి మెడికల్‌కు సంబందించిన ముఖ్యమైన టాబ్లెట్స్ స్వయంగా సమాకురుస్తానని తెలిపారు. అనంతరం బాధితుల కుటుంబ సభ్యులకు పది వేల రూపాయలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. చికిత్స నిమిత్తం కడియం మండల ప్రభుత్వ ఆసుపత్రి వైద్య అధికారులతో మాట్లాడి ఉత్తమ వైద్యం అందించాలని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# దళారులను నమ్మి మోసపోవద్దు

- ప్రభుత్వానికి ధాన్యాన్ని అమ్మి మద్దతు ధర పొందండి
- అందుబాటులో 5 లక్షల గన్ని బ్యాగ్స్
- పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్



అమరావతి (చైతన్యరథం): రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలలో అమ్మి మద్దతు ధర పొందాలని రాష్ట్ర పౌర సరఫరాలు, ఆహారం, వినియోగదారుల వ్యవహారాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ రైతులకు సూచించారు. బుధవారం నెల్లూరు జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులతో మంత్రి నాదెండ్ల మనోహర్ అధ్యక్షతన ఏపీ అసెంబ్లీలోని మంత్రి ఛాంబర్ నందు సమావేశం జరిగింది. ఈ సమావేశంలో నెల్లూరు జిల్లాలో ధాన్యం కొనుగోలు విషయంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. నెల్లూరు జిల్లాలో గత రెండు సంవత్సరాలుగా ధాన్యం కొనుగోలు విషయంలో గత ప్రభుత్వం శ్రద్ధ చూపలేదని దీంతో రైతులు దళారులకు ధాన్యం అమ్మి మోసపోతున్న విషయం ప్రజా ప్రతినిధులు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ... రైతులు దళారులను నమ్మి తక్కువ రేటుకు ధాన్యాన్ని అమ్మి మోసపోవద్ద అన్నారు. ఇప్పటికే జిల్లాలో 46% వరి కోతలు పూర్తయ్యాయన్నారు. పండించిన ధాన్యాన్ని రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలలో అమ్మి 24 గంటలలోనే డబ్బు పొందవచ్చున్నారు. రైతులకు అండగా కూటమి ప్రభుత్వం ఉంటుందని భరోసానిచ్చారు. ధాన్యం కొనుగోలు విషయంలో జిల్లాలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం జరిగిందని, ఐదు లక్షల గన్ని బ్యాగులను అందుబాటులో ఉంచడం జరిగిందన్నారు. క్షేత్రస్థాయిలో ప్రజా ప్రతినిధులు పర్యటించి, ఏమైనా ఇబ్బందులు ఉంటే పరిష్కరించుకునేందుకు చొరవ చూపాలన్నారు. రవాణా విషయంలో ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని అధికారులు సూచించారు. అదేవిధంగా ప్రతి మిల్లు వద్ద రెవెన్యూ సిబ్బంది ఉండే విధంగా ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలో సంఘం, కొవ్వూరు ప్రాంతాల్లో ధాన్యం కొనుగోలు ముమ్మరంగా జరుగుతుందన్నారు. ధాన్యం కొనుగోలు జరిగిన 24 గంటల్లోనే రైతు ఖాతాలో నగదు జమ అవుతుందన్నారు. రైస్ మిల్లర్ అసోసియేషన్‌తో మాట్లాడి దళారుల ప్రమేయం తగ్గించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. అవసరమైతే రైతుకు ఇబ్బంది లేకుండా ప్రకాశం, బాపట్ల కందుకూరు తదితర ప్రాంతాలకు తరలించేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ సమావేశంలో దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, నెల్లూరు జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి మహమ్మద్ ఫరూక్, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, కొవ్వూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి, కావలి ఎమ్మెల్యే కృష్ణారెడ్డి, ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌లతో పాటు నెల్లూరు జిల్లా కలెక్టర్ ఆనంద్, సివిల్ సప్లై అధికారులు ఉన్నారు.

# క్షేత్రస్థాయిలో రోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వం దృష్టి పెట్టాలి : ప్రత్తిపాటి



చిలకలూరిపేట (చైతన్యరథం): ప్రజల ఆరోగ్య రక్షణ కోసం ప్రభుత్వం ఎన్టీఆర్ వైద్యసేవలో భాగంగా వీలైనన్ని వ్యాధులకు చికిత్సతో కూడిన మెరుగైన వైద్యసేవల్ని రాష్ట్రవ్యాప్తంగా అందుబాటులోకి తీసుకొచ్చిందని, అయినప్పటికీ అనారోగ్య సమస్యలతో బాధపడేవారు సీఎంఆర్ఎఫ్ సాయం కోరడంపై వైద్యారోగ్యశాఖ ఆలోచన చేయాలని మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు సూచించారు. బుధవారం అసెంబ్లీలో రాష్ట్ర వైద్యరంగంపై జరిగిన స్వల్పకాలిక చర్చలో మాజీమంత్రి మాట్లాడారు. ఎన్టీఆర్ వైద్యసేవ కింద వీలైనన్ని ఎక్కువ వ్యాధుల్ని చేర్చినప్పటికీ, క్షేత్రస్థాయిలో చికిత్సవిధానంలో తలెత్తే సమస్యలవల్లగానీ, కొన్ని వ్యాధుల్ని జాబితాలో చేర్చకపోవడం వల్లగానీ, ఆసుపత్రుల్లో అదనంగా డబ్బులు అడగడం వల్లగానీ, ఇప్పటికీ ప్రజలు ఎక్కువగా సీ.ఎం.ఆర్.ఎఫ్ సాయం కావాలని అడుగుతున్నారని ప్రత్తిపాటి తెలిపారు. ఎన్టీఆర్ వైద్యసేవ కింద చికిత్స చేయించుకోవడానికి వెళ్లే రోగులకు, ఎలాంటి ఆరోగ్యసమస్యకైనా పూర్తిస్థాయిలో రూపాయి ఖర్చులేకుండా నాణ్యమైన వైద్యసేవలు అందేలా ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. ఆసుపత్రుల్లో తమకు ఎదురయ్యే సమస్యలపై రోగుల్ని సంప్రదించి, వాటి పరిష్కారంపై దృష్టి పెట్టాలన్నారు. అలానే గుండె, కిడ్నీ ఇతర ప్రధాన అవయవాల శస్త్రచికిత్సలు, క్యాన్సర్ చికిత్సలకు అందించే సేవలకు కొన్ని ఆసుపత్రులు అదనంగా డబ్బి వసూలు చేస్తున్నారనే ఫిర్యాదులు వచ్చాయని, ఈ సమస్యపై కూడా ప్రభుత్వం దృష్టి పెట్టాలన్నారు. చిలకలూరిపేటలో 2014-19 మధ్య నాబార్డ్ నిధులతో 100పడకల ఆసుపత్రి నిర్మాణం చేపట్టడం జరిగిందని ప్రభుత్వం తక్షణమే నిర్మాణంపై దృష్టి పెట్టాలని ప్రత్తిపాటి పుల్లారావు కోరారు.

# నేతన్నలకు పూర్వ వైభవం : వీరంకి గురుమూర్తి



విజయవాడ (చైతన్యరథం): చేనేత కార్మికులకు ఉచిత విద్యుత్తు అందించనున్నామని, ఈ మేరకు ఏపీ కేబినెట్ ఆమోదం తెలిపిందని రాష్ట్ర గౌడ కార్పొరేషన్ వీరంకి వెంకట గురుమూర్తి పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. నేత కార్మికుల గృహాలకు 200 యూనిట్ల వరకు, పవర్ లూవమ్ 500యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు అందిస్తామని, దీంతో రాష్ట్ర వ్యాప్తంగా 93వేల చేనేత కుటుంబాలకు.. 10వేల పవర్లూమ్ యూనిట్‌కు లబ్ది చేకూరనుందన్నారు. గత పాలకుల అసంబద్ధ విధానాలతో నైరాశ్యంతో కొట్టుమిట్టాడుతున్న చేనేతకారుల (నేతన్నలు)కు ఎన్డీయే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటే పూర్వవైభవం తెచ్చిందని, నేతన్నలకు అండగా నిలుస్తూ చేనేతకు చేయూతనందిస్తున్నామని నేతన్నలకు పూర్వవైభవం తెచ్చామని, నైరాశ్యంలో ఉన్న నేతన్నలకు చేయూతనందిస్తున్నామని, చేనేతరంగాన్ని నిర్వీర్యం చేసిన ఘనత జగన్ ప్రభుత్వానిదేనని తీవ్రస్థాయిలో దుమ్మెత్తిపోశారు. గత ప్రభుత్వంలో రాయితీలు.. ఆర్థిక ప్రోత్సాహకాలు.. కేంద్రం నిధులు సైతం పక్కదారి పట్టించారని, చేనేత రంగాన్ని నిర్వీర్యం చేసిన ఘనుడు వైఎస్ జగన్ అంటూ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. పట్టువస్త్రాల తయారీలో దేశంలోనే ప్రతిభకలిగిన చేనేతకారులు ఏపీ సొంతమని, రాష్ట్రంలో వ్యవసాయం తరువాత అత్యధిక మంది ప్రజలు చేనేతరంగంపై ఆధారపడ్డారని, అటువంటి వారిని గత ప్రభుత్వాధినేత జగన్ నిలువునా ముంచేశారని, నేతన్నలకు ప్రోత్సాహం అందించటంలో తీవ్ర నిర్లక్ష్యం చేశారని, దీంతో ఎంతోమంది చేనేతకారులు కనీసం తిండికి కూడా నోచుకోలేని దయనీయ స్థితికి చేరిపోయారన్నారు. కుటుంబమంతా కలిసి కష్టపడి తయారు చేసిన వస్త్రాలకు సైతం మార్కెటింగ్ కల్పించటంలోనూ జగన్ ఘోరంగా విఫలమయ్యారన్నారు. గత ప్రభుత్వ తీరుతో చేనేత రంగం నిర్వీర్యం కావటంతోపాటు నేతన్నల ప్రతిభ, జిల్లా ఖ్యాతి మసకబారిందని మండిపడ్డారు. 2014-19 వరకు టీడీపీ ప్రభుత్వం అమలు చేసిన చేనేత పథకాలు, ఆర్థిక ప్రోత్సాహకాలు, రాయితీలను ఎత్తివేసిందని, కేంద్ర ప్రభుత్వ నిధులను సైతం పక్కదారి పట్టించిందని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఏడాదికి రూ.24 వేలు చెల్లించే నేతన్న పథకం అమలులో సైతం జగన్ ప్రభుత్వం అన్యాయం చేసి వైసీపీ కార్యకర్తలు, నాయకులకు ప్రయోజనం కల్పించిందంటూ తూర్పారపట్టారు. వైకాపా ప్రభుత్వ పాలనా కాలంలో కార్మికుల జీవితాలు దయనీయంగా మారాయని గురుమూర్తి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. అన్నంపెట్టే రైతన్నలను, ప్రపంచ ప్రసిద్దిగాంచిన వస్త్రాలను తయారు చేసిన, అగ్గిపెట్టెలో పట్టేలా నైపున్యంతో కూడిన చీరలను తయారు చేసిన నేతన్నల ఉసురుతీసిన ఘనత గతపాలకుడికే దక్కుతుందన్నారు.

# ఎంటీఎంసీలో మూడవ రోజు స్వచ్ఛ-మంగళగిరి కార్యక్రమం

- మంగళగిరి 4వవార్డు, తాడేపల్లి 2వ వార్డులో స్వచ్ఛ-మంగళగిరి నిర్వహించిన అధికారులు, నాయకులు



మంగళగిరి (చైతన్యరథం): స్వచ్ఛ-మంగళగిరి కార్యక్రమంలో భాగంగా బుధవారం మంగళగిరి పట్టణం 4వ వార్డులోని ఆంజనేయ స్వామిగుడి, గవర్నమెంట్ స్కూలు, ఎస్టీ కాలనీ, ద్వారకా నగర్, జెండా చెట్టు సెంటర్, తాడేపల్లి పట్టణం 2వ వార్డులోని డీమార్ట్ ఏరియాలో అధికారులు, కూటమి నాయకులు ప్రత్యేక పారిశుద్ధ్య పనులు చేపట్టారు. స్వచ్ఛ మంగళగిరి ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రజల చేత స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయించారు. వార్డులలో చెత్త తొలగించడంతో పాటు డ్రైనేజీలలో పూడిక తీశారు. రోడ్ల వెంబడి ఉన్న పిచ్చి మొక్కలను తొలగించారు. చెత్త సేకరణపై స్థానిక ప్రజలతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంటీఎంసీ కమిషనర్ యస్. అలీం బాషా మాట్లాడుతూ స్వచ్ఛ మంగళగిరి కార్యక్రమంలో భాగంగా నగర పరిధిలో పరిశుభ్రతకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. నగర ప్రజలు చెత్తను ఎక్కడపడితే అక్కడ ఖాళీ స్థలాల్లో వేయవద్దని సూచించారు. మున్సిపల్ వాహనాల్లోనే చెత్తను వేయాలన్నారు. నగర ప్రజలు వ్యక్తిగత శుభ్రత పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమీషనర్ శ్రీకాంత్, అదనపు కమిషనర్ కె శకుంతల, సెక్రటరీ యం దివ్యకుమారి, అసిస్టెంట్ ఇంజనీరు కుమారి, అసిస్టెంట్ ఇంజినీర్ అనూష, టౌన్ ప్లానింగ్ సూపర్వైజర్ సుస్మిత, శానిటరి ఇన్స్పెక్టర్ ఆర్ ఇందు, ప్రత్యేక పర్యావరణ కార్యదర్శి ఉదయ్ సింగ్, నియోజకవర్గ పరిశీలకులు ముమ్మిడి సత్యనారాయణ, తాడేపల్లి టౌన్ పార్టీ అధ్యక్షులు వల్లభనేని వెంకట్రావు, మునగాల నాగేశ్వరరావు, గోవాడ దుర్గారావు, షేక్ రియాజ్, దారా దాసు, తిరుమలశెట్టి మురళీకృష్ణ, ఓలేటిరాము, వాకా మాధవరావు, భోగి కోటేశ్వరరావు, నల్లగొర్ల శివరామకృష్ణ, బాపనపల్లి వాసు, గోసాల రాఘవ, పేరం ఏడుకొండలు, పిల్లెల్ల నాగరాజు, సారమేకల గంగాధరరావు, పిల్లెల్ల గంగాధర్ రావు, తుళ్లూరు శివశంకర్, తాడిబొయిన భాస్కర్, కొయ్యగూర మల్లేశ్వరరావు, కాటాబత్తుల నిర్మల, ఆడపా నరేష్, అన్నెం కుసుమ, గాజుల కృష్ణ, పత్రిపల్లి కృష్ణవేణి, క్రిష్ణ వందన, తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాల్లో మంచి నీటి ఎద్దడి సమస్యను పరిష్కరించాలి

- ఎ.మ్.డి.వోకి వినతి ప్రతం అందజేసిన పంచాయతీ ఛాంపియన్స్



వీరులపాడు (చైతన్యరథం): విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ (చిన్ని) సారథ్యంలో నిర్వహిస్తున్న కేశినేని ఫౌండేషన్ ద్వారా హైదరాబాద్‌లోని జాతీయ గ్రామీణ అభివృద్ధి పంచాయతీ రాజ్ సంస్థలో (ఎన్.ఐ.ఆర్.డి.పి.ఆర్ )లో శిక్షణ పొందిన పంచాయతీ ఛాంపియన్స్, ఎన్టీఆర్ జిల్లా ఎన్.ఐ.ఆర్.డి.పి.ఆర్. ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్ జి.వి.నరసింహారావు ఆధ్వర్యంలో మండల నీటి సంఘం అధ్యక్షుడు కాపా రాంబాబులతో కలిసి గ్రామాల్లో నెలకొన్న తాగునీటి ఎద్దడి సమస్యను తక్షణం పరిష్కారించాలని కోరుతూ బుధవారం జుజ్జూరు గ్రామంలో మండల అభివృద్ధి అధికారికి వినతి పత్రం అందజేశారు. వీరులపాడు మండలంలోని క్లస్టర్ గ్రామాలైన బోడవాడ, జమ్మవరం, వెల్లంకి, నందలూరు, దాచవరం, తాటిగుమ్మి గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న నీటి ఎద్దడి సమస్యతో పాటు గ్రామంలో నెలకొన్న ఇతర ఇబ్బందులను మండల అభివృద్ధి అధికారి అరుందతి దేవికి వివరించారు. ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని) ఆశయమైన వికసిత్ పంచాయత్ కార్యక్రమంలో భాగంగా పరిపూర్ణ గ్రామ వికాసం కోసం ఈ గ్రామాల్లో నిర్వహించిన పలు కార్యక్రమాలు ద్వారా ఈ సమస్యలు తమ దృష్టికి వచ్చినట్లు తెలిపారు. వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రజలను నీటి ఎద్దడి సమస్యను తక్షణం పరిష్కరించాలన్నారు. అవసరమైన గ్రామాలకు వాటర్ ట్యాంకర్స్ ద్వారా మంచినీటి సరఫరా చేసి ప్రజలకు తాగునీరు అందించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే గ్రామాల్లో పంచాయతీ ఛాంపియన్స్ తెలుసుకున్న సమస్యలపై తయారు చేసిన నివేదికను కూడా వినతి పత్రంతో పాటు ఎమ్.డి.వో అరుంధతి దేవికి అందజేశారు.

# తెలంగాణ వక్ఫ్ బోర్డ్ చైర్మన్‌తో అబ్దుల్ అజీజ్ భేటీ



- ఆంధ్రకు రావాల్సిన 55 కోట్లను త్వరితగతిన బదిలీ చేయండి
- పాత రికార్డులు ఏపీకి అప్పగించండి
- త్వరలో ఉమ్మడి సమావేశంతో సమస్యకు పరిష్కారం
- షేక్. అబ్దుల్ అజీజ్, ఏపీ వక్ఫ్ బోర్డ్ చైర్మన్

నెల్లూరు, (చైతన్యరథం): హైదరాబాద్‌లోని నాంపల్లి తెలంగాణ రాష్ట్ర వక్ఫ్ బోర్డ్ కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర వక్ఫ్ బోర్డ్ చైర్మన్ సయ్యద్ అజ్మతుల్లా హుస్సేనీతో ఏపీ వక్ఫ్ బోర్డ్ చైర్మన్ అబ్దుల్ అజీజ్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ, రాష్ట్ర విభజన లో భాగంగా భారత ప్రభుత్వ మైనారిటీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ 2015లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు వేర్వేరు వక్ఫ్ బోర్డులు ఏర్పాటు చేయాలని కీలక నిర్ణయం తీసుకుందని అన్నారు. ఈ మేరకు గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసిందని, తెలంగాణ రాష్ట్ర వక్ఫ్ బోర్డులో ఉన్న డిపాజిట్లు, పెట్టుబడులు, నగదు నిల్వలను ఆంధ్రప్రదేశ్ వక్ఫ్ బోర్డుకు బదిలీ చేయాలని గెజిట్ లో స్పష్టంగా పేర్కొందని తెలిపారు. ఆంధ్ర రాష్ట్రానికి రావాల్సిన కోట్ల రూపాయల నిధులు, రాష్ట్రానికి సంబంధించిన పాత రికార్డులు ఇప్పటి వరకు అప్పగించలేదని తెలిపారు. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర వక్ఫ్ బోర్డు ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగానే ఉందని ఆంధ్ర రాష్ట్ర వక్ఫ్ బోర్డుకు రావాల్సిన రూ. 55,49,44,123/- త్వరితగతిన బదిలీ చేయాలని కోరారు. అలాగే ఫైళ్లు, సర్వే పత్రాలూ, జిల్లాల వారీగా గెజెట్లూ, బోర్డు తీర్మానాల ప్రతులూ, పాత రికార్డులన్నీ తమకు అందచేయాలని కోరారు. దీని పై తక్షణమే స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. రంజాన్ పండుగ తర్వాత ఇరు రాష్ట్రాల వక్ఫ్ బోర్డ్ చైర్మన్ లు, బోర్డ్ సభ్యులు, అధికారులు కలిసి సమీక్షించి ప్రణాళిక రూపొందించి ఇరు రాష్ట్రాల ప్రభుత్వాలకు పంపి సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని ఇరువురు చైర్మన్‌లు నిర్ణయించారు.

# ఘనంగా రంగనాథుని తెప్పోత్సవ ఏర్పాట్లు

**- పరిశీలించిన నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి**



నెల్లూరు, (చైతన్యరథం): భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా రంగనాథుని తెప్పోత్సవానికి అన్ని ఏర్పాట్లు చేసినట్లు నెల్లూరు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి తెలిపారు. పెన్నా నది తీరాన తెప్పోత్సవ ఏర్పాట్లను అన్ని శాఖల అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. తెప్పోత్సవాన్ని చూసేందుకు వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తీసుకోవలసిన చర్యలపై అధికారులతో సమీక్షించారు. డీఎస్పీ సింధు ప్రియా, ఈవో ఆళ్ల శ్రీనివాస్ రెడ్డితో కలిసి తెప్పను ట్రయిల్ వేశారు. అనంతరం కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ వచ్చే తెప్పోత్సవానికి ఆలయానికి సొంత తెప్ప ఉండేలా కృషి చేస్తామని అయన స్పష్టం చేశారు. సింహపురి గ్రామ దేవత ఇరుకళల పరమేశ్వరి అమ్మవారికి ఘాట్ కట్టించిన అదృష్టం తనకు దక్కిందన్నారు. ఎన్టీఆర్ నెక్లెస్ రోడ్డు నిర్మించి తెప్పోత్సవాన్ని వైభవంగా నిర్వహించామన్నారు. తల్పగిరి రంగనాథుని ఆలయానికి సొంత తెప్ప తయారు చేయిస్తామని ఈవో చెప్పారని,, అందుకోసం నుడా నుంచి అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ఈ విషయాన్ని మంత్రి పొంగూరు నారాయణ, ఆనం రామనారాయణ రెడ్డి దృష్టికి తీసుకెళ్తామన్నారు. తెప్పోత్సవానికి భక్తులు తరలి రావాలని ఆయన పిలుపునిచ్చారు. శ్రీ తల్పగిరి రంగనాథుని ఆశీస్సులు సీఎం చంద్రబాబుతో పాటు రాష్ట్ర ప్రజలకు ఉండాలన్నారు. నగర డీఎస్పీ సింధు ప్రియా మాట్లాడుతూ.. తెప్పోత్సవాన్ని వీక్షించేందుకు వచ్చిన భక్తులు పోలీస్ శాఖకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో

ఈవో ఆళ్ల శ్రీనివాసరెడ్డి, చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్ జే శ్రీనివాసరావు, చైర్మన్ మంచికంటి శ్రీనివాసులు, ముప్పసాని శ్రీనివాసులు, సుబ్బారెడ్డి, వెంకయ్య యాదవ్, రియాఖత్, పిగలం సుధీర్ కుమార్ ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే కోటంరెడ్డి



నెల్లూరు, (చైతన్యరథం): రూరల్ నియోజకవర్గ పరిధిలోని 33వ డివిజన్, కుబా మసీదు నందు జరిగిన ఇఫ్తార్ విందులో రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి ముస్లిం సోదరులతో కలసి పాల్గొన్నారు. పవిత్ర రంజాన్ మాస దీక్షలను నిష్ఠగా ఆచరిస్తోన్న ముస్లిం సోదరులందరికీ రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి శుభాకాంక్షలు తెలియజేశారు. పై కార్యక్రమంలో క్లస్టర్ ఇంచార్జి సాబీర్ ఖాన్, 33వ డివిజన్ టీడీపీ ఇన్చార్జి కరణం హజరత్ నాయుడు, మైనారిటీ నాయకులు అస్లాం బాషా, నిజాముద్దీన్, అబ్దుల్ రహీమ్, వాజిద్, మౌలానా అబ్దుల్లా, షేక్ బాబు, బాషా, ఖాదర్ వల్లి, మజీద్, ముజ్జుమిళ్ళ, సాదిక్, బాబు, షఫి బాబు, జనసేన నాయకులు లాల్ మస్తాన్, కరీమ్ తదితరులు పాల్గొన్నారు.

# మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నాగమణి

**అభినందించిన డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి**



దర్శి, (చైతన్యరథం): దర్శి మార్కెట్ కమిటీ చైర్మన్‌గా తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు దారం సుబ్బారావు సతీమణి నాగవేణి నియమితులైనట్లు దర్శి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి ప్రకటించారు. బుధవారం దర్శిలోని డాక్టర్ లక్ష్మి నివాసంలో నియోజకవర్గంలోని అన్ని మండల పార్టీల అధ్యక్షులు, ముఖ్య నేతలతో జరిగిన పార్టీ సమావేశంలో దారం నాగవేణి ఏకగ్రీవంగా మాజీ శాసనసభ్యులు నారపుశెట్టి పాపారావు సహకారంతో నియామకం జరిగినట్లు ప్రకటించారు. ఎన్నికను నాయకులందరూ ఆమోదించారు. ఈ సందర్భంగా డాక్టర్ లక్ష్మి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో మహిళలకు సముచిత స్థానం ఇవ్వాలన్న సంకల్పంతోనే కీలకమైన మార్కెట్ యార్డ్ చైర్మన్ పదవిని మహిళా నాయకురాలు నాగవేణి నియామకం జరిగినట్లు ఆమె తెలిపారు. నియోజకవర్గంలోని పార్టీ నాయకులు, జనసేన, బీజేపీ నాయకుల సంపూర్ణ సహకారంతో నాగవేణి నియామకం జరిగిందని ఆమె తెలిపారు. కాపు సామాజిక వర్గానికి చెందిన నాగవేణి నియామకం పార్టీ బలోపేతానికి దోహదపడుతుందని అభిప్రాయపడ్డారు. ఈ మేరకు పార్టీ నాయకుల అభిప్రాయాలను సీఎం నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్, రాష్ట్ర పార్టీ అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు ద్వారా జిల్లా అధ్యక్షుడు నూకసాని బాలాజీ ద్వారా చైర్మన్‌తో పాటు పార్టీలో కీలక నేతలను నెంబర్లుగా ప్రభుత్వానికి పంపుతామని డాక్టర్ లక్ష్మి వివరించారు ఈ సందర్భంగా దారం సుబ్బారావు నాగవేణి దంపతులు మాట్లాడుతూ ఈ అవకాశం ఇచ్చిన పార్టీ ఇంచార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మికి, నారపుశెట్టి పాపారావు, యువ నాయకులు డాక్టర్ కడియాల లలిత్ సాగర్, కడియాల రమేష్, నారపుశెట్టి పిచ్చయ్య, నియోజకవర్గంలోని పార్టీ ముఖ్య నాయకులకు, జనసేన, బీజేపీ నాయకులకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా చంద్రబాబు, పవన్ కళ్యాణ్ కి కూడా ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు. తమకు ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని ప్రభుత్వ పథకాల ద్వారా రైతులకు సేవ చేస్తామని వారు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు నాగులపాటి శివకోటేశ్వర రావు, పిడతల నేమిలయ్య, కూరపాటి శ్రీను, బొమ్మిరెడ్డి ఓబుల్ రెడ్డి, యాదగిరి వాసు మరియు సీనియర్ నాయకులు శేఖర్ పంతులు, మాజీ MPP మందలపు వెంకట్రామయ్య, కాట్రాజు నాగరాజు, మాజీ జడ్పీటీసీ నాగరాజు, చెంచయ్య, రమణారెడ్డి టిడిపి, జనసేన, బిజెపి, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# అన్నదాతకు అన్యాయం జరిగితే ఊరుకోం

**- ధర తగ్గించి ధాన్యం కొనుగోలు చేసే వారిపై చర్యలు**

**- మంత్రుల హెచ్చరిక**

**- కొనుగోళ్ళు సులభతరం చేస్తామని కలెక్టర్ హామీ**



నెల్లూరు, (చైతన్యరథం): ధాన్యం కొనుగోళ్లపై బుధవారం అమరావతిలో నెల్లూరు ప్రజాప్రతినిధులు అధికారులు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధుల మాట్లాడుతూ నెమ్ము, తరుగుల పేరుతో వేధించినా ఊరుకోమని స్పష్టం చేశారు.

ధాన్యం కొనుగోలు ప్రక్రియను మరింత సులభతరం చేస్తామని కలెక్టర్ ఆనంద్ రైతు కుటుంబసభ్యుల ఫొటో లేకుండానే కొనుగోలు ప్రక్రియ సాగిస్తామన్నారు. తక్కువ ధర చెల్లించినా, తరుగు, నెమ్ము పేరుతో ఎక్కువ ధాన్యం తీసుకున్నా పోలీసులకు ఫిర్యాదు చేయాలని రైతులకు సూచించారు. దళారులతో పాటు సంబంధిత రైసుమిల్లర్లపైనా కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ స్పష్టం చేశారు. రైతులకు ఎక్కడ సమస్య వచ్చినా వెంటనే అధికారుల దృష్టికి తేవాలని పిలుపునిచ్చారు. సమావేశంలో రాష్ట్ర మంత్రులు ఎన్ఎండీ ఫరూక్, నాదెండ్ల మనోహర్, ఆనం రామనారాయణ రెడ్డి, కలెక్టర్ ఆనంద్, ఎమ్మెల్యేలు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, కావ్యా కృష్ణారెడ్డి, కాకర్ల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# మహిళలతో ఎమ్మెల్యే సతీమణి ముఖాముఖి

**వైసీపీ హయాంలో అభివృద్ధి శూన్యం: పులివర్తి సుధారెడ్డి విమర్శ**



తిరుపతి రూరల్, (చైతన్యరథం): తిరుపతి రూరల్ మండలం పద్మావతీపురం పంచాయతీలో మహిళలతో ముఖా ముఖి చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నానీ సతీమణి ముఖాముఖీ నిర్వహించారు. మహిళలతో ముఖాముఖి కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పులివర్తి సుధా రెడ్డి హాజరయ్యారు. పద్మావతీపురం పంచాయతీకి విచ్చేసిన ఎమ్మెల్యే సతీమణి పులివర్తి సుధా రెడ్డికి మహిళలు హారతులు పట్టి తిలకం దిద్ది గజమాలతో ఘన స్వాగతం పలికారు. కూటమి నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఆరు నెలల్లో చేసిన అభివృద్ధి సంక్షేమ పథకాలు గురించి ప్రజలకు వివరించారు. గడిచిన 5 సంవత్సరాలలో పద్మావతీపురం పంచాయతీలో అభివృద్ధి శూన్యమన్నారు. స్థానిక ఎమ్మెల్యే పులివర్తి నాని అధికారంలోకి వచ్చిన వెంటనే పద్మావతీపురం పంచాయతీలో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలకు ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపడం జరిగిందన్నారు. ప్రతిపాదనలు మంజూరు అయినవెంటనే పనులు ప్రారంభిస్తారని తెలిపారు. అనంతరం పద్మావతీపురం పంచాయతీలోని సమస్యలను మహిళలను అడిగి తెలుసుకుని...ప్రజల నుండి అర్జీలను స్వీకరించి త్వరగతిన పరిష్కారమయ్యే పనులను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తామని మహిళలకు హామీ ఇచ్చారు.

**ఆప్యాయంగా పలకరింపు**

# అడిగిన వారికి సాయం

**- టీడీపీ నేత మాలేపాటి పర్యటన**



దగదర్తి, (చైతన్యరథం): దగదర్తి మండలం, పెదపుత్తేడు పంచాయతీ ప్యాడిసన్ పేటలో బుధవారం మాజీ ఇరిగేషన్ బోర్డు డైరెక్టర్ మాలేపాటి రవీంద్ర నాయుడు తెలుగుదేశం పార్టీ శ్రేణులతో కలిసి ఇంటి ఇంటికీ తిరిగి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలందరూ రవీంద్ర నాయుడును ఆప్యాయంగా పలకరించారు. ముఖ్యంగా అక్కడి వారికి గృహ నిర్మాణానికి అవసరమైన రేకులు, సిమెంట్ రవీంద్ర నాయుడు తన సొంత నిధులతో అందించారు. ఈ సందర్భంగా వీరితోపాటు తెలుగుదేశం పార్టీ క్లస్టర్ ఇంచార్జ్ కంచర్ల కృష్ణ, పార్టీ శ్రేణులు కోనంకి శివయ్య, సారథి, మనుబోతుల హరీష్ తదితరులు ఉన్నారు.



# హెచ్చెల్సీ ద్వారా పాములాయి చెరువుకు నీరివ్వండి

- పరిటాల సునీత, శ్రీరామ్‌తో కలసి మంత్రి వద్దకు వెళ్లిన గ్రామస్తులు
- సానుకూలంగా స్పందించిన మంత్రి నిమ్మల
- ఎమ్మెల్సీ బీటీ నాయుడుకి అభినందనలు

రాప్తాడు, (చైతన్యరథం): హెచ్చెల్సీ కాలువ ద్వారా తమ గ్రామానికి నీరు ఇవ్వాలని అనంతపురం రూరల్ మండలంలోని పాములాయి గ్రామస్తులు జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుకు విజ్ఞప్తి చేశారు. రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్చార్జి పరిటాల శ్రీరామ్ తో కలిసి శాసనసభ ప్రాంగణంలో మంత్రి వద్దకు వెళ్లారు. తమ గ్రామంలో నీటి సమస్య గురించి



వివరించారు. హెచ్చెల్సీ కాలువ ద్వారా ఇప్పటి వరకు అనధికారికంగా నీరు తీసుకుంటున్నామని.. ఒక్కోసారి నీరు రాక ఇబ్బందులు పడుతున్నామని అన్నారు. అసలే భూగర్భ జలాలు తక్కువగా ఉన్న తమ ప్రాంతంలోని చెరువుకి నీరు రాకపోతే చాలా ఇబ్బందులు ఎదుర్కొంటామని ఆందోళన వ్యక్తం చేశారు. అందుకే తుంగభద్ర హై లెవెల్ కెనాల్ నుంచి తూము ఏర్పాటుచేసి.. తమకు శాశ్వతంగా కేటాయింపులు చేయాలని విజ్ఞప్తి చేశారు. గ్రామంలో పరిస్థితుల గురించి పరిటాల సునీత, శ్రీరామ్ మంత్రికి వివరించారు. దీనిపై మంత్రి నిమ్మల రామానాయుడు సానుకూలంగా స్పందించారు. అధికారులతో మాట్లాడి తగిన నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు.

# ఎమ్మెల్సీ బీటీ నాయుడుకు శుభాకాంక్షలు

**మర్యాదపూర్వకంగా కలిసిన మంత్రి సవిత, సునీత శ్రీరామ్**

రాప్తాడు, (చైతన్యరథం): ఇటీవల ఎమ్మెల్సీగా ఎన్నికైన బీటీ నాయుడును మంత్రి సవిత, రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, ధర్మవరం నియోజకవర్గ ఇన్చార్జ్ పరిటాల శ్రీరామ్ కలిశారు. ఆయనకి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బీటీ నాయుడు సునీత, శ్రీరామ్‌ని ఎంతో ఆప్యాయంగా పలకరించారు.

గతంలో అనంతపురం జిల్లా అబ్జర్వర్‌గా పనిచేసిన విషయాన్ని గుర్తు చేసుకున్నారు. బీటీ నాయుడు పార్టీకి ఎన్నో విధాలుగా సేవలు అందించారని పరిటాల సునీత, శ్రీరామ్ అన్నారు. ఆయనకు అధిష్టానం తగిన న్యాయం చేసిందని అభిప్రాయపడ్డారు. అనంతరం బీటీ నాయుడును పరిటాల శ్రీరామ్ ఘనంగా సత్కరించారు

# క్రికెటర్‌గా ఎమ్మెల్యే దగ్గుపాటి

**రన్నింగ్ రేస్‌లోనూ ఉత్సాహంగా ఉరుకులు**

**ఆసక్తికరంగా సాగిన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల క్రీడా పోటీలు**



అనంతపురం, చైతన్యరథం): అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ క్రికెటర్‌గా మారిపోయారు. విజయవాడ ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు జరుగుతున్న క్రీడా పోటీల్లో ఆయన రెండవ రోజు కూడా పాల్గొన్నారు. మొదటి రోజు క్రికెట్ ఆడిన దగ్గుపాటి రెండవ రోజు కూడా పలు పోటీల్లో పాల్గొన్నారు. బుధవారం సాయంత్రం జరిగిన క్రికెట్ పోటీల్లో దగ్గుపాటి ఉత్సాహంగా కనిపించారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు జరిగిన రన్నింగ్ రేస్ పోటీల్లో కూడా ఆయన పాల్గొన్నారు. వేగంగా పరుగు తీస్తూ అందర్నీ ఆకట్టుకున్నారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అంతా స్నేహితుల్లా కలిసిమెలిసి క్రీడా పోటీల్లో పాల్గొనడం చాలా సంతోషంగా ఉందని ఈ సందర్భంగా దగ్గుపాటి ప్రసాద్ వ్యాఖ్యానించారు.

# ప్రకాశం జిల్లా అభివృద్ధికి సాయం

**- ఎమ్మెల్యే దామచర్లకు ఎంపీ పెమ్మసాని హామీ**



అమరావతి, (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్ మారిటైమ్ బోర్డు ఛైర్మన్ దామచర్ల సత్యనారాయణ, విజయనగరం పార్లమెంట్ సభ్యులు కలిశెట్టి అప్పలనాయుడు కలిసి, బుధవారం ఢిల్లీలో గ్రామీణ అభివృద్ధికమ్యూనికేషన్స్ శాఖ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కేంద్ర భూమి వనరుల శాఖ 2021 ఆర్థిక సంవత్సరంలో ఎనిమిది ప్రాజెక్టులను అనుమతించిందని, ఈ ప్రాజెక్టుల అమలు 2025-2026 ఆర్థిక సంవత్సరంలో ముగుస్తుందని ఆయన తెలిపారు.

ఈ నేపథ్యంలో, దామచర్ల సత్యనారాయణ ప్రకాశం జిల్లాలో 1,50,000 హెక్టార్ల కన్నా ఎక్కువ భూమిని 2.0 ప్రోగ్రామ్ కింద పునరుత్పత్తి చేయడానికి 41 కొత్త వాటర్‌షెడ్ ప్రాజెక్టులను ఆమోదించవలసిందిగా మంత్రిని అభ్యర్థించారు. ఈ ప్రాజెక్టుల అమలు ఆధారంగా వ్యవసాయ ఉత్పత్తి గ్రామీణ ప్రాంతాల సామాజిక-ఆర్థిక స్థితిని మెరుగుపరచడంలో సహాయపడనుంది అని మంత్రికి వివరించారు. మంత్రి ప్రకాశం జిల్లా అభివృద్ధికి అన్ని విధాలుగా సహాయం చేస్తానని తెలిపారు.

# కాశినాయన జ్యోతి క్షేత్రం అభివృద్ధికి చర్యలు

**టీడీపీ కడప అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి వెల్లడి**

కడప, (చైతన్యరథం): జిల్లా అవధూత కాశినాయన మండలం జ్యోతి క్షేత్రంలో ఇటీవల ఫారెస్ట్ అధికారులు పలు కట్టడాలను కూల్చి వేయడం దానిని ప్రతిపక్ష పాలక నాయకుల పర్యటనలో కాశిరెడ్డి నాయన అంశం దేశవ్యాప్తంగా సంచలనంగా మారింది. బుధవారం తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు రెడ్డి జ్యోతి క్షేత్రంలోని కాశిరెడ్డి నాయన ఆలయాలను సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వం చేసిన తప్పిదాలతో జ్యోతి క్షేత్రంలోని కాశీనాయన ఆలయాలలో టైగర్ జోన్ ఫారెస్ట్ ప్రాంతం కనుక అధికారులు కూల్చివేశారని దీనిని కూటమి ప్రభుత్వం పరిశీలించి భక్తుల మనోభావాలు దెబ్బ తినకుండా ఆలయాలని పరిరక్షించుకునేందుకు చర్యలు చేపట్టిందన్నారు. అందులో భాగంగా విద్యాశాఖ మంత్రి లోకేష్ కేంద్ర ప్రభుత్వము అటవీ శాఖ అధికారులతో చర్చించి సొంత నిధులతో కట్టడాలను పునర్నిర్మించి ఇస్తానని మాట ఇవ్వడమే కాకుండా ఫారెస్ట్ ప్రాంతంలోని టైగర్



జోనుకు సంబంధించిన ఈ ప్రాంతంలో కాశిరెడ్డి నాయన ఆలయానికి సంబంధించి 13 ఎకరాలను జ్యోతి క్షేత్రానికి కేటాయించే విధంగా జీవో తొందర్లో వెలువడిన ఉందని భక్తులకు శుభవార్త తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ యువ నాయకులు చెరుకూరి రవికుమార్ నాయుడు, బీజేపీ కడప పార్లమెంట్ సభ్యులు బొమ్మన సుబ్బరాయుడు, బీజేపీ జిల్లా అధ్యక్షులు వెంకట సుబ్బారెడ్డి, బీజేపీ మాజీ అధ్యక్షులు వంగల శశిభూషణ్ రెడ్డి, పాములి బాలిరెడ్డి కల్లూరి దుగ్గిరెడ్డి, ప్రహల్లాద రెడ్డి, రోశి రెడ్డి, ఏనుమల సుధాకర్, రాంబాబు కప్పాల, శ్రీనాథ్ రెడ్డి, బొమ్మన విజయ్, తదితరులు పాల్గొన్నారు.

## 2వ రోజు క్రీడా పోటీల్లో

# ఎమ్మెల్యే సునీత ఉత్సాహం

**తోటి ఎమ్మెల్యేలతో కలిసి ఆటలాడిన సునీత**

విజయవాడ, (చైతన్యరథం): విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు జరుగుతున్న క్రీడా పోటీల్లో రెండవ రోజు బుధవారం కూడా ఎమ్మెల్యే పరిటాల సునీత పాల్గొన్నారు. బడ్జెట్ సమావేశాలు అనంతరం సాయంత్రం ఆమె పోటీలకు హాజరయ్యారు. మ్యూజికల్ చైర్స్, టెన్నికాయిట్, బ్యాండ్మింటన్, క్యారమ్స్ పోటీల్లో పాల్గొన్నారు. తోటి శాసనసభ్యులతో కలిసి ఈ పోటీల్లో ఉత్సాహంగా కనిపించారు. ఒక ఆహ్లాదకరమైన వాతావరణంలో ఈ పోటీలు సాగాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీత మాట్లాడుతూ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు స్నేహితుల్లా కలిసిపోయి క్రీడా పోటీల్లో పాల్గొంటుండటం చాలా సంతోషంగా ఉందన్నారు. ఇక్కడ ఎవరు విజయాల వైపు చూడటం లేదని.. అందరూ కలిసిమెలిసి ఆడాలన్నదే కనిపించిందన్నారు.





# దివి నుండి భువికి

- సునీత రాక.. పుడమికి వేడుక
- సొంతగడ్డ భారత్‌లో సంబరాలు



కొన్ని నెలల పాటు అంతరిక్ష కేంద్రంలో చిక్కుకుపోయిన సునీతా విలియమ్స్ సురక్షితంగా భూమి మీదకు వచ్చారు. ఆమె రాక గురించి ప్రధాని మోదీ తరచూ ఆరా తీసేవారని ఇస్రో మాజీ ఛైర్మన్ సోమనాథ్ తాజాగా వెల్లడించారు. భారత సంతతి ముద్దుబిడ్డ రాకపై ప్రధాని ఆందోళన వ్యక్తం చేసేవారని పేర్కొన్నారు. ప్రధాని మోదీ రాసిన లేఖను షేర్ చేసిన సోమనాథ్ ఎక్స్ వేదికగా స్పందించారు. "సునీతా విలియమ్స్‌కు ప్రధాని మోదీ లేఖ రాశారు. ఆమె సురక్షితంగా తిరిగి రావడం గురించి, ప్రధాని మోదీ తరచూ ఆరా తీసేవారు. అది ప్రధాని ఆందోళనను తెలియజేసింది. సునీతా.. మేం మీ అనుభవాలను తెలుసుకోవాలని అనుకుంటున్నాం" అని సోమనాథ్ పోస్టు పెట్టారు.

సునీత రాకపై ఇస్రో ఛైర్మన్ వి. నారాయణన్ స్పందించారు. ఆమె సురక్షితంగా తిరిగి రావడం ఒక అద్భుతమైన విజయమని కొనియాడారు. నాసా, స్పేస్‌ఎక్స్. యూఎస్‌ఏ నిబద్ధతకు నిదర్శనమని ప్రశంసించారు. ఆమె దృఢ సంకల్పం అంతరిక్ష ఔత్సాహికుల్లో నిత్యం స్ఫూర్తినిస్తుందన్నారు. ప్రధాని మోదీ నాయకత్వంలో భారత్ అభివృద్ధి చెందిన దేశంగా అడుగులు వేస్తోన్న తరుణంలో ఆమె సేవలు ఉపయోగించుకోవాలని కోరుకుంటున్నట్లు చెప్పారు. కేవలం 8 రోజుల యాత్ర కోసం గత సంవత్సరం జూన్ 5వ తేదీన అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి వెళ్లిన సునీత, బుచ్ విల్మోర్.. అనివార్య సాంకేతిక కారణాలతో ఏకంగా 286 రోజులు అక్కడే ఉండిపోవాల్సి వచ్చిన సంగతి తెలిసిందే. తొమ్మిది నెలల తర్వాత వారిని సురక్షితంగా తీసుకువచ్చారు. భారత కాలమానం ప్రకారం బుధవారం తెల్లవారుజామున 3:27 గంటలకు అమెరికాలోని ఫ్లోరిడా తీరంలో సాగర జలాల్లో దిగారు. ఈ నేపథ్యంలో సునీతకు ఈ నెల ఒకటవ తేదీన మోదీ రాసిన లేఖను కేంద్రమంత్రి జితేంద్ర సింగ్ ఎక్స్ వేదికగా పోస్టు చేసిన సంగతి తెలిసిందే. "యూఎస్ పర్యటనకు వెళ్లినప్పుడు.. మీ గురించి అడిగితెలుసుకున్నాను. మీరు వేలాది కిలోమీటర్ల దూరంలో ఉన్నప్పటికీ మా హృదయాలకు దగ్గరగా ఉన్నారు. మీ అంతరిక్షయాత్ర విజయం సాధించాలని మేమంతా కోరుకుంటున్నాం. మీరు తిరిగి వచ్చిన తర్వాత మిమ్మల్ని భారత్‌లో చూసేందుకు ఎదురుచూస్తున్నాం" అని ప్రధాని ఆకాంక్షించారు. ఇదిలావుండగా త్వరలోనే సునీత స్వస్థలం భారత్‌కు రానున్నట్లు ఆమె బంధువులు వెల్లడించారు. ఆమె రాక సందర్భంగా వేడుకలు జరుపుకోవాలని భారతీయులంతా భావించడం విశేషం.

***రాష్ట్రపతి, ప్రధాని హర్షం***

భారత సంతతి వ్యోమగామి సునీతా విలియమ్స్ సురక్షితంగా పుడమికి చేరుకోవడంపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని మోదీ హర్షం వ్యక్తం చేశారు. మిషన్ విజయం కోసం చూపిన దృఢ సంకల్పం, సమష్టి కృషిని రాష్ట్రపతి కొనియాడారు. వారి సంకల్పానికి సెల్యూట్ చేశారు. మోదీ కూడా వెల్‌కమ్ బ్యాక్ సునీత అంటూ పోస్టు పెట్టారు. "మీ అపరిమిత ధైర్యం, స్ఫూర్తికి ఇన్నాళ్లూ పరీక్ష ఎదురైంది. అయినా మీ పట్టుదల ఏంటో



అందరికీ చూపించారు. క్లిష్టమైన, అనిశ్చిత పరిస్థితుల్లో అచంచలమైన సంకల్పంతో ఎంతోమందికి ఆదర్శంగా నిలిచారు" అని ఆయన కొనియాడారు. "అంతరిక్ష అన్వేషణ అంటే మానవ శక్తి పరిమితులను దాటి ముందుకెళ్లడం, కలలు కనే ధైర్యం కలిగి ఉండటం. ఈ విషయంలో సునీత తన కెరీర్ అంతటా గొప్ప స్ఫూర్తిని ప్రదర్శించారు. ఆమె ఓ ఐకాన్.. మార్గదర్శకురాలు. సునీతతో పాటు మిగిలిన వ్యోమగాములను సురక్షితంగా భూమిపైకి తీసుకువచ్చేందుకు అవిశ్రాంతంగా కృషి చేసిన వారిపట్ల గర్వపడుతున్నాం. అభిరుచి, సాంకేతికత కలగలిస్తే ఎలాంటి అద్భుతాలు జరుగుతాయో వారు చూపించారు" అని మోదీ అని ప్రశంసించారు. ఈ సందర్భంగా గతంలో ప్రధాని మోదీ యూఎస్ పర్యటనకు వెళ్లినప్పుడు సునీత కుటుంబంతో ముచ్చటించిన ఫొటోను పంచుకున్నారు. భారత కాలమానం ప్రకారం బుధవారం తెల్లవారుజామున 3.27 గంటలకు అమెరికాలోని ఫ్లోరిడా తీరంలోని సాగర జలాల్లో సునీత, బుచ్ విల్మోర్ దిగారు. స్పేస్‌ఎక్స్‌కు చెందిన క్రూ డ్రాగన్ 'ఫ్రీడమ్'.. వారిని సురక్షితంగా పుడమికి తీసుకొచ్చింది. వీరితోపాటు నాసాకు చెందిన కమాండర్ నిక్ హేగ్, రష్యా వ్యోమగామి అలెగ్జాండర్ గోర్బునోవ్ కూడా ఐఎస్ఎస్ నుంచి ఇదే వ్యోమనౌకలో భూమ్మీదకు వచ్చారు. కేవలం 8 రోజుల యాత్ర కోసం నిరుడు జూన్ 5న ఐఎస్ఎస్‌కు వెళ్లిన సునీత, విల్మోర్.. చివరకు ఏకంగా 286 రోజులు అక్కడే ఉండాల్సి వచ్చిన సంగతి తెలిసిందే. దీనివల్లే ఈ అంతరిక్షయానం అందరిదృష్టినీ ఆకర్షించింది.

పాక్‌కు భారత రహస్యాల చేరవేత అభియోగంపై

## కాన్పూరు ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ ఉద్యోగి అరెస్టు



పాకిస్థాన్ గూఢచర్య సంస్థ ఐఎస్ఐకు దేశ రక్షణ రంగానికి సంబంధించిన రహస్య సమాచారాన్ని చేరవేస్తున్నాడన్న ఆరోపణలపై కాన్పూర్ ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ ఉద్యోగిని ఉత్తరప్రదేశ్ ఉగ్రవాద నిరోధక దళం అధికారులు అరెస్ట్ చేశారు. ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలో జూనియర్ వర్క్ మేనేజర్ విధులు నిర్వహిస్తున్న కుమార్ వికాస్ పాకిస్థాన్‌కు చెందిన ఏజెంట్ కలిసి కుట్ర పన్నుతున్నట్లు సమాచారం అందడంతో ఈ చర్యలు తీసుకున్నట్లు తెలుస్తోంది. 2025 జనవరిలో ఓ మహిళా పాకిస్థాన్ ఏజెంట్ అతడికి ఫేస్బుక్ ద్వారా పరిచయం అయ్యిందని.

ఆమె తనను భారత్ హెవీ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్‌లో ఉద్యోగం చేసే నేహాశర్మగా పరిచయం చేసుకుందని అన్నారు. అనంతరం ఫ్యాక్టరీకి సంబంధించిన సున్నితమైన విషయాలను అందించాలని.. దానికి డబ్బులిస్తాని ముందు ఆశ చూపింది. అనంతరం అతడికి వలపు వల విసిరింది. దీంతో అతడు లూడో గేమ్ యాప్‌ను ఉపయోగించి సంస్థకు చెందిన సున్నితమైన పత్రాలు, పరికరాల వివరాలు, మందుగుండు సామగ్రి ఉత్పత్తికి సంబంధించిన డేటా, ఉద్యోగుల సమాచారం వంటివి ఆమెకు చేరవేశాడు. లీక్ అయిన సమాచారం వల్ల భారతదేశ ఐక్యత, సమగ్రత, సార్వభౌమత్వం తీవ్రంగా దెబ్బతీసే ప్రమాదం ఉందని అధికారులు పేర్కొన్నారు. జాతీయ భద్రతకు ముప్పు వాటిల్లే అవకాశం ఉన్నట్లు ఆందోళన వ్యక్తం చేశారు. దేశ రక్షణ రంగానికి సంబంధించిన రహస్య సమాచారాన్ని ఇదే పాక్ ఏజెంట్ నేహా శర్మకు లీక్ చేస్తున్న ఫిరోజాబాద్ లో హజ్రత్పుర్ ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ మెకానిక్ రవీంద్ర కుమార్ను పోలీసులు అరెస్ట్ చేశారు. మొదట స్నేహం పేరుతో అతడికి ఫేస్ బుక్ లో పరిచయమైన ఆమె అనంతరం అతడికి వలపు వల విసిరి..రక్షణ రంగానికి సంబంధించిన రహస్య సమాచారాన్ని, లేఖలను తీసుకున్నట్లు తెలిపారు. ఇందులో గగన్యాన్ ప్రాజెక్టుకు సంబంధించిన వివరాలు కూడా ఉన్నట్లు వెల్లడించారు.

# వాస్తవ ప్రపంచంలో నిర్ణయాలు మారవు

టారిఫ్‌లపై విదేశాంగ మంత్రి జై శంకర్

ఇతర దేశాలపై టారిఫ్‌లు, ఆంక్షల విధింపుపై కేంద్ర విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఎవరికి నచ్చినా, నచ్చకపోయినా ఆ నిర్ణయాలు నిజమేనన్నారు. శక్తిమంతమైన దేశంగా మారే క్రమంలో వాణిజ్య సంబంధాలు కీలకపాత్ర పోషిస్తున్నాయని అభిప్రాయపడ్డారు. ఢిల్లీలో జరుగుతోన్న రైసీనా డైలాగ్ 2025లో మాట్లాడుతూ కేంద్రమంత్రి ఈ వ్యాఖ్యలు చేశారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పలు దేశాలపై సుంకాలతో విరుచుకుపడు తున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే వాణిజ్య పరిమితులు, టారిఫ్‌లు, ఆంక్షలు వంటి వాటికి భారత విదేశాంగ విధానంలో చోటుందా? అని జైశంకర్‌కు ప్రశ్న ఎదురైంది. దీనికి ఆయన బదులిస్తూ.. "మీరు నమ్మినా, నమ్మకపోయినా.. సుంకాలు, ఆంక్షలు అనేవి వాస్తవ అంశాలు. దేశాలు వాటిని అమలుచేస్తున్నాయి. నిజానికి గత దశాబ్దాన్ని మీరు గమనించినట్లయితే.. సామర్థ్యమేదైనా గొప్ప ఆయుధీకర ణను చూశాం.



ఆర్థిక ప్రవాహం, ఇంధన సరఫరా, సాంకేతికత బదిలీ పెరగడం చూశాం. ఇదే ప్రపంచంలో జరుగుతున్న వాస్తవం. ఓ దేశం సమగ్ర జాతీయశక్తిగా ఎదిగే పోరాటానికి వ్యాపార, వాణిజ్య సంబంధాలు ముఖ్యమైన సహకారాన్ని అందిస్తాయి. అందుకే ఆ వ్యాపారం కోసం దేశాలు పోటీపడుతున్నాయి." అని వెల్లడించారు.

ఈ సందర్భంగా అంతర్జాతీయ సంబంధాలను జైశంకర్ ప్రస్తావించారు. "దశాబ్దం క్రితంతో పోలిస్తే నేడు అంతర్జాతీయ సంబంధాల్లో నియంతృత్వ ధోరణి తగ్గిందనే భావిస్తున్నా. నేడు చాలా వరకు విభజన రేఖలు చెరిగిపోయాయి" అని కేంద్రమంత్రి అభిప్రాయపడ్డారు. భారత్‌పై అమెరికా సుంకాలు విధించనున్న సంగతి తెలిసిందే. అందులో ఎలాంటి మార్పు ఉండదని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల స్పష్టంచేశారు. ఈ నేపథ్యంలో జైశంకర్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. భారత్ అత్యధిక స్థాయిలో సుంకాలు విధిస్తోందని ట్రంప్ పదేపదే ఆరోపిస్తున్నారు. ఈ క్రమంలోనే ఇటీవల ఆయన యూఎస్ కాంగ్రెస్‌లో మాట్లాడుతూ.. ఏప్రిల్ 2 నుంచి భారత్ సహా పలు దేశాలపై పరస్పర సుంకాలు అమల్లోకి తీసుకురానున్నట్లు ప్రకటించారు. దీనిపై వెనక్కి తగ్గే అవకాశమే లేదన్నారు.

రైళ్లపై రాళ్ల దాడులు..

# రెండేళ్లలో 7,971 కేసులు, 4,549 మంది అరెస్టు

వందేభారత్ సహా ఇతర రైళ్లపై రాళ్ల దాడులకు సంబంధించి 2023 నుంచి ఫిబ్రవరి 2025 వరకు మొత్తం 7,971 కేసులు నమోదైనట్లు రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడించారు. వీటికి సంబంధించి 4,549 మందిని అరెస్టు చేశామని చెప్పారు.

రాళ్ల దాడుల ఘటనల వెనక ఉన్న కారణాలను తెలుసుకోవడం కోసం నిజనిర్ధరణ కమిటీ నుంచి నివేదిక కోరిందా? అని భాజపా ఎంపీ ధర్మపురి అర్వింద్ అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి ఈ సమాధానం ఇచ్చారు.

"2023, 24, ఫిబ్రవరి 2025 వరకు వందేభారత్ సహా వివిధ రైళ్లపై 7,971 రాళ్ల దాడుల ఘటనలు చోటుచేసుకున్నాయి. నిబంధనల ప్రకారం ప్రతికేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నాం. ఈ ఘటనలకు పాల్పడిన వారిలో ఇప్పటివరకు 4,549 మందిని అరెస్టు చేశాం" అని



రైల్వే మంత్రి వెల్లడించారు. ఈ దాడుల వల్ల దెబ్బతిన్న రైళ్ల మరమ్మతుల కోసం రూ.5.79 కోట్లు ఖర్చు చేశామన్నారు.

ఈ తరహా ఘటనలు నియంత్రించేందుకు జీఆర్పీ, జిల్లా పోలీసులు, స్థానిక అధికారులతో కలిసి ఆర్పీఎఫ్ పని చేస్తోందని రైల్వే మంత్రి పేర్కొన్నారు. రాళ్ల దాడుల వల్ల కలిగే పర్యవసానాలను తెలియజేస్తూ ట్రాకులకు సమీపంలోని నివాస ప్రాంతాల్లో అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. సంఘ వ్యతిరేక శక్తులపై చర్యలు తీసుకునేందుకు వీలుగా ఇప్పటికే మార్గదర్శకాలు జారీ చేశామన్నారు. అన్ని రాష్ట్రాల్లో రాష్ట్రస్థాయి భద్రతా కమిటీలు కూడా ఏర్పాటు చేశామన్నారు.

# సునీత వచ్చేశారు!



- సురక్షితంగా భూమికి చేరిన భారత సంతతి వ్యోమగామి
- బుచ్ విల్మోర్, మరో ఇద్దరు వ్యోమగాములూ భూమికి...
- ఫ్లోరిడా తీరంలో సాఫీగా దిగిన క్రూ డ్రాగన్

సుదీర్ఘ నిరీక్షణ ఫలించింది. మహా ఉత్కంఠకు తెరపడింది. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్)లో 9 నెలలుగా చిక్కుకుపోయిన భారత సంతతి వ్యోమగామి సునీతా విలియమ్స్, బుచ్ విల్మోర్ ప్రపంచమంతా ఊపిరి బిగబట్టి చూస్తున్నవేళ.. భారత కాలమానం ప్రకారం బుధవారం తెల్లవారుజామున 3:27 గంటలకు అమెరికాలోని ఫ్లోరిడా తీరంలో సాగర జలాల్లో దిగారు. స్పేస్ఎక్స్‌కు చెందిన క్రూ డ్రాగన్ 'ఫ్రీడమ్'.. వారిని సురక్షితంగా పుడమికి తీసుకొచ్చింది. సునీత, విల్మోర్లతోపాటు నాసాకు చెందిన కమాండర్ నిక్ హేగ్, రష్యా వ్యోమగామి అలెగ్జాండర్ గోర్బునోవ్ కూడా ఐఎస్ఎస్ నుంచి ఇదే వ్యోమనౌకలో పుడమికి చేరుకున్నారు. అంతకుముందు– ఐఎస్ఎస్ నుంచి భూమికి వీరి ప్రయాణం నిర్దేశిత పరామితులకు అనుగుణంగా సాఫీగా సాగింది. కేవలం 8 రోజుల యాత్ర కోసం నిరుడు జూన్5న ఐఎస్ఎస్‌కు వెళ్లిన సునీత, విల్మోర్.. చివరకు ఏకంగా 286 రోజులు అక్కడే గడపాల్సి వచ్చిన సంగతి గమనార్హం.

దాదాపు 9 నెలలపాటు అంతరిక్షంలోనే ఉండిపోయిన వీరిద్దరూ.. ఇప్పుడు మరో ఇద్దరు ఆస్ట్రోనాట్లతో కలిసి సురక్షితంగా పుడమిని చేరారు. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం నుంచి బయల్దేరిన క్రూ డ్రాగన్ వ్యోమనౌక బుధవారం తెల్లవారుజామున 3.27 గంటలకు ఫ్లోరిడా తీరానికి చేరువలో సముద్ర జలాల్లో దిగింది. గంటకు 17 వేల మైళ్ల వేగంతో భూమివైపు ప్రయాణించిన డ్రాగన్ క్యాప్సుల్ క్రమంగా వేగాన్ని తగ్గించుకుంటూ వచ్చింది. గంటకు వేగం 116 మైళ్లకు చేరుకున్నాక పారాచూట్లు తెరచుకున్నాయి. 4 పారాచూట్ల సాయంతో వేగాన్ని మరింత తగ్గించుకొని క్యాప్సుల్ సురక్షితంగా సముద్ర జలాల్లో దిగింది. నాసా సిబ్బంది అక్కడికి చేరుకొని చిన్నచిన్న బోట్ల సాయంతో దానిని ఓ నౌకపైకి తీసుకొచ్చి.. ఒడ్డుకు చేర్చారు. అనంతరం వ్యోమగాములను హ్యూస్టన్‌లోని జాన్సన్ స్పేస్ సెంటర్కు తరలించారు. అక్కడ వారికి వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. భూ గురుత్వాకర్షణ శక్తికి తిరిగి సర్దుబాటు అయ్యేలా నిపుణులు వారికి తోడ్పాటు అందిస్తారు. గతేడాది జూన్ 5న ప్రయోగించిన బోయింగ్ వ్యోమనౌక 'స్టార్‌లైనర్' సునీత, విల్మోర్లు ఐఎస్ఎస్‌కు వెళ్లారు. ప్రణాళిక ప్రకారం వీరు ఎనిమిది రోజులకే భూమిని చేరుకోవాల్సి ఉంది. అయితే, స్టార్‌లైనర్‌లో సాంకేతిక సమస్యలు తలెత్తడంతో వ్యోమగాములు లేకుండానే అది భూమికి తిరిగొచ్చింది. నాటినుంచి సునీత, విల్మోర్లు ఐఎస్ఎస్‌లోనే ఉండిపోయారు. తొమ్మిది నెలల్లో అనేక ప్రయత్నాల అనంతరం స్పేస్ఎక్స్ క్రూ డ్రాగన్‌లో ఐఎస్ఎస్ నుంచి బయల్దేరారు. భారత కాలమానం ప్రకారం మంగళవారం ఉదయం 10.15 గంటలకు అన్‌లాకింగ్ ప్రక్రియ చేపట్టారు. బుధవారం తెల్లవారుజామున ఇంజిన్లను మండించి క్రూ డ్రాగన్‌ను భూవాతావరణంలోకి పునఃప్రవేశపెట్టారు. దీని ల్యాండింగ్ దృశ్యాలను నాసా ప్రత్యక్ష ప్రసారం చేసింది.



# ఉక్రెయిన్‌తో యుద్ధం ముగింపు

## దాడులు ఆపాలన్న ట్రంప్ ప్రతిపాదనకు పుతిన్ ఓకే

- యుద్ధప్రాతిపదికన శాంతి చర్చలకు అమెరికా నిర్ణయం
- పుతిన్ ఫోన్ కాల్‌కు గంట నిరీక్షించిన అమెరికా అధ్యక్షుడు



మూడేళ్లకుపైగా కొనసాగుతున్న ఉక్రెయిన్ యుద్ధాన్ని విరమింపజేయడంలో భాగంగా ఉక్రెయిన్ ఇంధన, మౌలిక సదుపాయాలపై నెలరోజుల పాటు దాడులు నిలిపివేసేలా చూడాలని అమెరికా, రష్యా నిర్ణయించాయి. ఉక్రెయిన్‌లో శాంతి నెలకొల్పడంపై రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మంగళవారం గంటకుపైగా ఫోన్‌లో చర్చించారు. ముందుగా ఈ రెండురంగాల వరకు దాడులు ఆపాలని ట్రంప్ సూచించారు. దీనికి పుతిన్ అంగీకరించారని, శాంతి దిశగా ఇది తొలిఅడుగు అని అమెరికా అధ్యక్ష కార్యాలయం తెలిపింది. నల్ల సముద్రంలో దాడుల విరమణకు, తర్వాత పూర్తిగా యుద్ధం అంతానికి ఇది దారితీస్తుందని ఆశాభావం వ్యక్తంచేసింది. ఈ దిశగా చర్చలు వెంటనే మొదలవుతాయని తెలిపింది.

ట్రంప్ సైతం సామాజిక మాధ్యమ ఖాతా ద్వారా ఈ విషయాన్ని వెల్లడించారు. పరస్పరం 175మంది యుద్ధ ఖైదీలను బుధవారమే అప్పగించుకోనున్నట్టు ట్రంప్‌నకు పుతిన్ చెప్పారని వెల్లడించింది. తీవ్రంగా గాయపడిన 23మంది ఉక్రెయిన్ సైనికుల్ని కూడా రష్యా అప్పగించ నుందని తెలిపింది. అమెరికా, దాని మిత్రపక్షాలు ఉక్రెయిన్‌కు చేస్తున్న సైనిక సాయాన్ని ఆపేయాలని పుతిన్ పట్టుబట్టినట్లు క్రెమ్లిన్ వెల్లడించింది. చర్చలకు ఉక్రెయిన్ సమ్మతి ఉందా? లేదా అనేది తెలియరాలేదు. యుద్ధంలో స్వాధీనం చేసుకున్న భూమి, విద్యుత్కేంద్రాల గురించి, కొన్ని ఆస్తుల విభజనపైనా చర్చిస్తామని ఈ ఫోన్ సంభాషణకు ముందు ట్రంప్ చెప్పారు. 30 రోజుల కాల్పుల విరమణకు ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కి అంగీకరించారు. పుతిన్ అంగీకారం చెబుతూనే కొన్ని అంశాలపై స్పష్టత రావాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఆయన ప్రతినిధి దిమిత్రి పెస్కోవ్ విలేకరులతో మాట్లాడుతూ– ఉక్రెయిన్‌తో పాటు అమెరికా– రష్యా సంబంధాలను సాధారణీకరించడంపైనా అనేక ప్రశ్నలు ఉన్నాయని తెలిపారు.

***ప్రాదేశిక సమగ్రతపై రాజీపడం: ఉక్రెయిన్***

తమ ప్రాదేశిక సమగ్రత విషయంలో ఎప్పటికీ రాజీ పడేది లేదని ఉక్రెయిన్ విదేశాంగ మంత్రి అంద్రీ సైబిహా స్పష్టం చేశారు. ఢిల్లీలో రైసీనా డైలాగ్‌లో ఆయన ఈమేరకు స్పందించారు. యుద్ధానికి 30 రోజులపాటు విరామం ఇవ్వాలని అమెరికా చేసిన ప్రతిపాదనకు తాము మద్దతు ఇస్తామని చెప్పారు. రష్యా ఆక్రమించుకున్న ప్రాంతాన్ని తాము ఎప్పటికీ గుర్తించబోమన్నారు.

***ఈయూ నేతలతో జెలెన్ స్కీ చర్చలు***

పుతిన్–ట్రంప్ ఒకపక్క మాట్లాడుకుంటుండగా మరోపక్క ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్ స్కీ ఐరోపా సమాఖ్య నేతలతో చర్చలు జరుపుతున్నారు. తాజాగా ఆయన ఫ్రాన్స్ అధినేత మెక్రాన్‌తో ఫోన్లో మాట్లాడారు. 30 రోజుల కాల్పుల విరమణ ప్రతిపాదనకు జెలెన్ స్కీ కట్టుబడి ఉన్నట్టు మెక్రాన్ వెల్లడించారు. దీర్ఘకాలం శాంతి కొనసాగేలా ఉక్రెయిన్ భద్రతకు బలమైన హామీలు లభించేందుకు ఫ్రాన్స్ తన మిత్ర దేశాలతో కలిసి పనిచేస్తుందన్నారు.

***పుతిన్ బిజీ.. ట్రంప్ నిరీక్షణ***

రష్యా– ఉక్రెయిన్ల మధ్య యుద్ధానికి ముగింపు పలకడానికి రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మంగళవారం గంటకు పైగా ఫోన్‌లో చర్చలు జరిపిన విషయం తెలిసిందే. అయితే పుతిన్ అందుబాటులోకి రావడానికి ట్రంప్ ఫోన్ కాల్‌లో గంటకు పైగా నిరీక్షించారని అంతర్జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. అమెరికా అధ్యక్షుడు ఫోన్ చేసిన సమయంలో ఆయన మాస్కోలో పారిశ్రామికవేత్తలతో సమావేశంలో ఉన్నారని పేర్కొన్నాయి.

ఈ విషయంపై రష్యా అధ్యక్షుడి ప్రెస్ సెక్రటరీ దిమిత్రి పెస్కోవ్ మాట్లాడుతూ.. ట్రంప్ ఏ సమయంలో ఫోన్ చేస్తారనే విషయం తమ అధ్యక్షుడికి తెలియనందువల్ల ఈ అసౌకర్యం కలిగిందన్నారు. యుద్ధం విషయంలో డొనాల్డ్ ట్రంప్, వ్లాదిమిర్ పుతిన్ మధ్య మంగళవారం జరిగిన చర్చలు దాదాపు రెండు గంటలు ఆలస్యమయ్యాయని అమెరికా అధ్యక్ష భవనం వైట్‌హౌస్ వెల్లడించింది. మూడేళ్లకు పైగా కొనసాగుతున్న ఉక్రెయిన్ యుద్ధాన్ని విరమింపజేయడంలో భాగంగా ఉక్రెయిన్ ఇంధన, మౌలిక సదుపాయాలపై నెల రోజులపాటు దాడులు నిలిపివేసేలా చూడాలని అమెరికా, రష్యా నిర్ణయించాయని పేర్కొంది.

# అది ఉగ్రవాద చర్యే

## టెస్లా కార్లకు నిప్పుపై మస్క్ వ్యాఖ్య



అమెరికాలో ఎలక్ట్రిక్ కార్ల తయారీ సంస్థ టెస్లా షోరూంలో కార్లకు కొందరు దుండ గులు నిప్పంటించారు. అధ్యక్షుడు ట్రంప్ ఏర్పాటుచేసిన డోజ్ శాఖకు టెస్లా అధినేత మస్క్ సారథిగా వ్యవహరిస్తున్న సంగతి తెలిసిందే. అయితే, ఈ శాఖ సలహాలతో ట్రంప్ తీసుకుంటున్న నిర్ణయాల కారణంగా అగ్రరాజ్యంలో మస్క్‌పై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఈ క్రమంలోనే టెస్లాకు వ్యతిరేకంగా పలు ఘటనలు చోటుచేసు కుంటున్నాయి. లాస్ వెగాస్‌లో టెస్లా షోరూంలోని ఐదు కార్లకు దుండగులు నిప్పంటించారు. అనంతరం ఒక కారుపై అభ్యంతరకర పదజాలంతో స్ప్రే పెయింట్ వేశారు. వెంటనే అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకొని మంటలు అదుపు చేశారు. దీంతో పెద్ద ప్రమాదం తప్పిందని షోరూం అధికారులు తెలిపారు. ఇక, కాన్సాస్ సిటీలో రెండు టెస్లా సైబర్ ట్రక్కులను దుండగులు తగలబెట్టారు. దక్షిణ కరోలినాలో ఒక వ్యక్తి టెస్లా ఛార్జింగ్ స్టేషన్‌కు నిప్పటించే ప్రయత్నం చేశాడు. ఇటీవల సైతం ఇలాంటి ఘటనలే చోటుచేసుకున్నాయి. ఇక, వరుస ఘటనలపై స్పందించిన మస్క్ ఇది ఒక ఉగ్రవాద చర్యగా అభివర్ణించారు. 'ఈ స్థాయి హింస, వెర్రి.. చాలా పెద్ద తప్పు. టెస్లా కేవలం ఎలక్ట్రిక్ కార్లను మాత్రమే తయారు చేస్తుంది. అంతేగానీ.. ఈ దుష్టదాడులు జరిగేలా మేం ఎవరికీ ఎలాంటి హానీ తలపెట్టలేదు కదా' అని ఎక్స్‌లో రాసుకొచ్చారు. ఈ ఘటనలపై స్థానిక పోలీసులు, ఎఫ్బీఐ, ఇతర విభాగాలతో కలిసి దర్యాప్తు చేస్తున్నారు.

# యూఎస్ సైంటిస్టులకూ చెక్

## పరిశోధకులనూ తొలగించే యోచనలో ట్రంప్



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇప్పటికే వేలమంది ఫెడరల్, యూఎస్ ఎయిడ్ ఉద్యోగులపై వేటు వేసిన విషయం తెలిసిందే. తాజాగా ఈ తొలగింపు ఎఫెక్ట్ అక్కడి శాస్త్రవేత్తలు, పరిశోధకులపై పడింది. పర్యావరణ పరిరక్షణ సంస్థకు నిధుల కోతల్లో భాగంగా వందలమంది శాస్త్రవేత్తలు, పరిశోధకులను తొలగించే యోచనలో ట్రంప్ ప్రభుత్వం ఉన్నట్టు తెలుస్తోంది. మిగిలినవారిని ఇతర ఏజెన్సీలకు తరలించే అవకాశం ఉందని సంబంధిత వర్గాలు పేర్కొంటున్నాయి. కాలుష్యం, నీటి శుద్ధి, వాతావరణ మార్పులు తదితర పర్యావరణ అంశాల్లో 1500మంది శాస్త్రవేత్తలు కీలకంగా వ్యవహరిస్తున్నారు.

వారిని విధులనుంచి తొలగిస్తే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటామని డెమొక్రటిక్ చట్టసభ్యులు ఆందోళన వ్యక్తంచేశారు. ఫెడరల్ వ్యవస్థలో శ్రామికశక్తిని తగ్గించడం ద్వారా ప్రభుత్వ వ్యయాన్ని తగ్గించాలనే ఉద్దేశంతో ట్రంప్ ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఫిబ్రవరిలో ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణ సంస్థను పర్యవేక్షించడానికి ఎంపిక చేసిన 17,000 మంది సిబ్బందిలో దాదాపు 65 శాతం మందిని తగ్గించాలని యోచిస్తున్నట్టు తెలిపారు.

ఈ విషయంపై ఈపీఏ ప్రతినిధి మోలీ వాసెలియో మాట్లాడుతూ.. ఏజెన్సీ సంస్థాగత మెరుగుదలను తదుపరి దశలోకి తీసుకువెళ్లేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రజలందరికీ స్వచ్ఛమైన గాలి, నీరు, భూమిని అందించడానికి కృషి చేసే తమ సామర్థ్యాన్ని పెంచడానికి కట్టుబడి ఉన్నామని పేర్కొన్నారు. తొలగింపు విషయంలో ఎటువంటి నిర్ణయాలు తీసుకోనప్పటికీ.. సంస్థ ఎప్పటికీ ప్రభావవంతంగా పని చేయడానికి మార్పులు చేస్తున్నామన్నారు.

ప్రభుత్వం చేసే అనవసరపు ఖర్చులను తగ్గించడానికి పనిచేస్తున్న మస్క్ నేతృత్వంలోని డోజ్ ఇప్పటికే అనేకమంది యూఎస్ ఎయిడ్ ఉద్యోగులపై వేటువేసింది. వృథా ఖర్చులను తగ్గించడానికి ప్రభుత్వ సంస్థల్లో పలువురు ఉద్యోగులను తొలగించడానికి చర్యలు తీసుకుంటోంది. డోజ్ నిర్ణయాలను ట్రంప్ సైతం సమర్థిస్తున్నారు. ఆయన తీసుకొన్న ఈ తొలగింపు నిర్ణయం శాస్త్రవేత్తల్లో భయాందోళన కలిగిస్తోంది.

# ఐపీఎల్ 2025కు సర్వం సిద్ధం

**- ఏకంగా 13 వేదికల్లో నిర్వహించేందుకు బీసీసీఐ ఏర్పాట్లు.. చరిత్రలోనే తొలిసారిగా కొత్త సంప్రదాయం**

**- బాలీవుడ్ స్టార్ల మెరుపులు.. కోల్‌కతా ఈడెన్ గార్డెన్స్ వేదికగా 22న ప్రారంభం**




ఐపీఎల్ 2025 సీజన్ ప్రారంభానికి వేళైంది. మార్చి 22న ఓపెనింగ్ సెర్మనీతో ఈ ఎడిషన్ ప్రారంభం కానుంది. అయితే ఈ సారి మరో కొత్త సంప్రదాయానికి తెర తీయనున్నారు. ఐపీఎల్ క్రికెట్ చరిత్రలోనే తొలిసారిగా సరికొత్త విధంగా ప్రారంభోత్సవ వేడుకలు నిర్వహించేందుకు సిద్ధమ్యయారు. అదేంటో ఇప్పుడు తెలుసుకుందాం..

ఐపీఎల్ 2025 ఓపెనింగ్ మ్యాచ్ కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్ మైదానం వేదికగా జరగనుంది. కోల్‌కతా నైట్ రైడర్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్లు తొలి మ్యాచ్ లో తలపడనున్నారు. అయితే ప్రతీ సీజన్‌లోనూ తొలి మ్యాచ్ రోజు ప్రారంభోత్సవ వేడుకను ఘనంగా జరపడం ఆనవాయితీగా వస్తోందన్న సంగతి తెలిసిందే.

ఈ ఓపెనింగ్ సెర్మనీలో పలువురు బాలీవుడ్ స్టార్స్ ను ఆహ్వానించినట్లు తెలిసింది. వారిలో షారుక్ ఖాన్, సల్మాన్ ఖాన్, విక్కీ కౌశల్, శ్రద్ధా కపూర్ లాంటి వాళ్లు రాబోతున్నారని రెండు మూడు రోజుల నుంచి ప్రచారం సాగుతోంది. అయితే వీరితో పాటే మరికొంతమంది అందమైన భామలు కూడా రాబోతున్నారట. తమ అందాలతో, చిందులతో ప్రేక్షకుల్ని ఫిదా చేయనున్నారట.

ఆ అందమైన భామలు ఎవరంటే?

విక్కీ కౌశల్ భార్య కత్రినా కైఫ్, గ్లోబల్ స్టార్ ప్రియాంకా చోప్రా, యంగ్ సెన్సేషన్ హాట్ బ్యూటీ తృప్తి డిమ్రి, యంగ్ హీరోయిన్ అనన్య పాండే, సీనియర్ అందాల భామ మాధురి దీక్షిత్, హీరోయిన్ జాన్వీ కపూర్, ఐటెమ్ సాంగ్ డ్యాన్సర్ ఊర్వశి రౌతేలా, పొడుగు కాళ్లల సుందరి పూజా హెగ్డే, సీనియర్ భామ కరీనా కపూర్, యంగ్ బ్యూటీ సారా అలీ ఖాన్, దిశా పటానీ సహా పలువురు రాబోతున్నారని సమాచారం అందింది. ఇంకా శ్రేయా ఘోషల్, అర్జిత్ సింగ్, వరుణ్ ధావన్ కూడా వస్తారట. ఈ విషయాన్ని ఐపీఎల్ ఆర్గనైజర్ల సన్నిహిత వర్గాలు తెలిపాయి.

ఈ సారి ఏకంగా..

అయితే ఎప్పుడూ ఈ ప్రారంభోత్సవ వేడుకలను ఓపెనింగ్ మ్యాచ్ గ్రౌండ్ లోనే నిర్వహిస్తారు. కానీ ఈ సారి మాత్రం.. ఏకంగా 13 వేదికల్లో నిర్వహించేందుకు బీసీసీఐ ఏర్పాట్లు చేయనుండటం విశేషం. ఐపీఎల్ చరిత్రలో తొలిసారి ఇలా జరగడం. ఐపీఎల్ 2025 వేదికలైనా కోల్‌కతా, హైదరాబాద్, విశాఖపట్నం, చెన్నై, గౌహతి, అహ్మదాబాద్, లక్నో, ముంబై, చండీగఢ్, బెంగళూరు, ఢిల్లీ, జైపూర్, ధర్మశాల.. ఇలా 13 వేదికల్లో మ్యాచ్‌లు జరగనుండగా.. ఓపెనింగ్ సెర్మనీని అన్ని వేదికల్లో నిర్వహిస్తున్నారు. దీనికి రాష్ట్ర సంఘాలు కూడా సహకరించనున్నట్లు తెలిసింది. అంతకుముందు ఐపీఎల్ 2017లో 8 జట్లు పాల్గొనగా.. ఆ 8 జట్లకు సంబంధించిన హెూం గ్రౌండ్‌లో ఐపీఎల్ ప్రారంభోత్సవ వేడుకలు నిర్వహించారు.




తొలి మ్యాచ్, ఫైనల్.. రెండూ అక్కడే..

ఐపీఎల్ 18వ సీజన్ ఈ నెల 22 నుంచి మే 25 వరకు జరగనుంది. మొత్తంగా 74 మ్యాచ్‌లు 13 వేదికల్లో నిర్వహించనున్నారు. మొదటి మ్యాచ్ కోల్‌కతాలో ని ఈడెన్ గార్డెన్స్ వేదికగా డిఫెండింగ్ ఛాంపియన్ కోల్‌కతా నైట్ రైడర్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు మధ్య జరగనుంది. తొలి మ్యాచ్‌కు ఆతిథ్యమిచ్చే ఈడెన్ గార్డెన్సే ఫైనల్ కు కూడా ఆతిథ్యమివ్వనుంది.

## ఐపీఎల్ ముందు అగ్రస్థానంలోకి హార్దిక్ పాండ్య



వరల్డ్ బిగ్గెస్ట్ టీ20 లీగ్ ఐపీఎల్ మార్చి 22 నుంచి ప్రారంభం కానున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో తాజా టీ20 ర్యాంకింగ్స్ ను విడుదల చేసింది అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ). ఇందులో ఎక్కువ మంది భారత ప్లేయర్లు స్థానం సంపాదించుకున్నారు. టాప్-5 బ్యాటర్లలో ముగ్గురు ఇండియన్ ప్లేయర్స్ కు, టాప్ -10 బౌలర్లలో ముగ్గురు భారత ఆటగాళ్లకు చోటు దక్కడం విశేషం. అలాగే ఆల్ రౌండర్లలో అగ్రస్థానం మనోడిదే కావడం మరో విశేషం.

టాప్-5 బ్యాటర్లలో ముగ్గురు మనోళ్లే..

బ్యాటింగ్ విభాగంలో ఆస్ట్రేలియా ట్రావిస్ హెడ్ 856 రేటింగ్ పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచాడు. అభిషేక్ శర్మ 829 పాయింట్లతో రెండో ర్యాంకులో ఉండగా, తిలక్ వర్మ 804 పాయింట్లతో నాలుగో స్థానంలో నిలిచాడు. సూర్యకుమార్ యాదవ్ 739 పాయింట్లతో 5వ ర్యాంకును దక్కించుకున్నాడు. ఫిల్ సాల్ట్ రెండో స్థానంలో నిలిచాడు.

టాప్-10 బౌలర్లలో ముగ్గురు మనోళ్లే...

బౌలింగ్ విభాగంలో 707 రేటింగ్ పాయింట్లతో వెస్టిండీస్ అకీల్ హెూసెన్ అగ్రస్థానంలో ఉండగా వరుణ్ చక్రవర్తి 706 పాయింట్లో రెండో ర్యాంకును దక్కించుకున్నాడు. 674 పాయింట్లతో ఆరో స్థానంలో రవి బిష్ణోయ్, 653 పాయింట్లతో అర్షదీప్ సింగ్ 9వ ర్యాంకును దక్కించుకున్నారు. ఆల్ రౌండ్ విభాగంలో హార్దిక్ పాండ్య 252 పాయింట్లతో అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. ఇక టాప్ -10లో ఇండియన్ ప్లేయర్స్ ఇంకెవరూ స్థానం సంపాదించుకోలేదు.

## బీసీసీఐ ఫ్యామిలీ పాలసీలో మార్పులు లేవు

**- బీసీసీఐ కార్యదర్శి సైకియా**



బీసీసీఐ ఫ్యామిలీ పాలసీలో మార్పులు లేవని బీసీసీఐ కార్యదర్శి దేవత్ సైకియా అన్నారు. కొన్ని రోజుల క్రితం దీనిపై విరాట్ కోహ్లి తన అసంతృప్తి వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. భారత క్రీడాకారులు మ్యాచుల నిమిత్తం విదేశీ పర్యటనల్లో ఉన్నప్పుడు వారి కుటుంబసభ్యులతో ఉండే సమయంలో బీసీసీఐ కోత విధించింది. బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో భారతజట్టు ఆస్ట్రేలియా మీద 1- 3 తేడాతో సిరీస్ ఓడిపోయిన తర్వాత బీసీసీఐ కొన్ని కఠిన నియమాలను అమల్లోకి తెచ్చింది. సమీప భవిష్యత్తులో వీటిలో ఎటువంటి మార్పులూ లేవని బీసీసీఐ కార్యదర్శి సైకియా తాజాగా మరోసారి స్పష్టం చేశారు. ఐపీఎల్ అనంతరం జూన్, జులైలో టీమిండియా ఇంగ్లాండ్‌లో 5 టెస్టు మ్యాచులు ఆడనుంది.

'అప్పటికప్పుడు తీసుకున్న నిర్ణయం కాదు ఇది'

'ప్రస్తుత పరిస్థితుల్లో ఈ పాలసీ మన దేశానికి, బీసీసీఐకి ఎంతో ముఖ్యం. అప్పటికప్పుడు తీసుకున్న నిర్ణయం కాదు ఇది. ఈ నియమాలు ఎప్పటి నుంచో అమల్లో ఉన్నాయి. బీసీసీఐ అధ్యక్షుడు రోజర్ బిన్నీ క్రికెట్ ఆడే కాలం కంటే ముందు నుంచే ఈ పాలసీ ఉంది. నూతన విధానం మునుపటి దానికి సవరణ మాత్రమే. ఇందులో ప్రాక్టీస్ సెషన్లలో ఆటగాళ్ల హాజరు, మ్యాచ్ షెడ్యూల్ లు, పర్యటనలు, లగేజీ, జట్టు కదలికలు, ఇతర అనుబంధ కార్యకలాపాలకు సంబంధించిన నిబంధనలు ఉన్నాయి. ఇవన్నీ జట్టు సమన్వయం, ఐక్యత కోసం తీసుకున్న నిర్ణయాలు' అని సైకియా వివరించారు.

ముంబయి ఇండియన్స్..

## కొత్త కెప్టెన్‌గా సూర్యకుమార్ యాదవ్



ఈ సీజన్ ఐపీఎల్‌లో ముంబై ఇండియన్స్ తొలి మ్యాచ్‌కు కెప్టెన్ హార్దిక్ పాండ్యా దూరం కానున్న సంగతి తెలిసిందే. దీంతో అందరూ రోహిత్ శర్మ కెప్టెన్సీ వహిస్తాడని అనుకున్నారు. కానీ ఇప్పుడు తొలి మ్యాచ్ కు కొత్త సారథిని ఎంపిక చేశారు. తాజాగా జరిగిన ప్రెస్ కాన్ఫరెన్స్ హార్దిక్ పాండ్య మాట్లాడుతూ.. కొత్త సారథిని ప్రకటించాడు. సీఎస్కేతో జరగబోయే తమ తొలి మ్యాచ్ లో సూర్యకుమార్ యాదవ్ జట్టును ముందుండి నడిపిస్తాడని అనౌన్స్ మెంట్ చేశాడు.

ముగ్గురు కెప్టెన్లతో ఆడుతున్నా..

"నేను అదృష్టవంతుడిని. ముగ్గురు కెప్టెన్లతో ఆడుతున్నాను. రోహిత్, సూర్యకుమార్, బుమ్రా. వారెప్పుడు నాకు మద్దతుగా నిలుస్తారు." అని హార్దిక్ పాండ్య అఫీషియల్ గా చెప్పాడు. దీంతో మొదటి మ్యాచ్ కు కెప్టెన్ గా ఎంపికైన సూర్య కుమార్ యాదవ్ కు ముంబయి ఫ్యాన్స్ కంగ్రాట్స్ చెబుతున్నారు.

హార్దిక్ పై నిషేధం..

సీఎస్కేతో జరగనున్న తొలి మ్యాచ్ కు హార్దిక్ పాండ్యపై నిషేధం పడింది. అయితే ఈ నిషేధం గత సీజన్‌లోనే విధించారు. ఎందుకంటే గత సీజన్ లో ముంబై ఇండియన్స్ మూడుసార్లు స్లో ఓవర్ రేట్ ఆడింది. అందుకే నిబంధనల ప్రకారం ఆ జట్టు కెప్టెన్‌గా ఉన్న హార్దిక్ పాండ్యకు రూ. 30 లక్షల జరిమానా విధించడంతో పాటు ఓ మ్యాచ్‌లో ఆడకుండా బ్యాన్ విధించారు. అదే సమయంలో ముంబయి జట్టు పేలవ ప్రదర్శనతో గ్రూప్ దశలోనే నిష్క్రమించింది. దీంతో హార్దిక్ పై మ్యాచ్ నిషేధం విధించడం కుదరలేదు. ఈ కారణంగా ఇప్పుడు ఈ సీజన్‌లో మార్చి 23న చెన్నైలో ముంబయి ఆడే తొలి మ్యాచ్ లో హార్దిక్ ను బ్యాన్ చేశారు. దీంతో సీఎస్కేతో మ్యాచ్ లో పాండ్యాకు బదులుగా సూర్యకుమార్ యాదవ్ కు కెప్టెన్సీ బాధ్యతలు అప్పగిస్తూ అధికారికంగా ప్రకటించారు.

ఏప్రిల్ 6న ఐపీఎల్ మ్యాచ్..

## రీషెడ్యూల్ చేస్తారా?





మార్చి 22 నుంచి ఇండియన్ ప్రీమియర్ లీగ్ 18వ సీజన్ ప్రారంభం కానుంది. ఇప్పటికే నిర్వాహకులు షెడ్యూల్‌ను ప్రకటించిన సంగతి తెలిసిందే. అయితే, ఈడెన్ గార్డెన్స్ వేదికగా కోల్కతా నైట్‌రైడర్స్ లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ మధ్య ఏప్రిల్ 6న మ్యాచ్ జరగనుంది. అయితే, ఈ మ్యాచ్ నిర్వహణపై సందిగ్ధం నెలకొంది. అదేరోజు శ్రీరామ నవమి ఉంది. భద్రతా కారణాల రీత్యా మ్యాచ్ను రీషెడ్యూల్ చేసే అవకాశాలు ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా పెద్దసంఖ్యలో ఊరేగింపులు జరిగే అవకాశం ఉందని భాజపా నేత సువేందు అధికారి ఇప్పటికే వెల్లడించారు. ఈక్రమంలో అటు ఊరేగింపులకు, ఇటు మ్యాచ్‌కు భద్రత కల్పించడం పోలీసులకు సవాల్‌తో కూడుకున్నదే. సిటీ పోలీస్ క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ బెంగాల్ అధ్యక్షుడు స్నేహాశీశ్ గంగూలీ ఈ అంశంపై రెండుసార్లు చర్చించారు. అయితే, పోలీసుల నుంచి స్పష్టమైన హామీ రాలేదని తెలుస్తోంది.

"విభాగాల వారీగా వారికి ప్రాధాన్యత అంశాలు ఉన్నాయి. అందుకే పూర్తిస్థాయి భద్రతను కేటాయించలేమని చెబుతున్నారు. ఒకవేళ పోలీసుల సెక్యూరిటీ లేకపోతే ఏప్రిల్ 6న మ్యాచ్ కోసం వచ్చే 65 వేల మందికి పైగా వచ్చే ప్రేక్షకులను కంట్రోల్ చేయడం చాలా కష్టమవుతుంది. మార్చి 22న ఓపెనింగ్ సెర్మనీని గ్రాండ్‌గా నిర్వహించేందు కు సిద్ధమయ్యాం. దాదాపు 35 నిమిషాల పాటు కార్యక్ర మాలు జరుగుతాయి. చాన్నాళ్ల తర్వాత ఈడెన్ గార్డెన్స్ వేదికగా ప్రారంభోత్సవం జరుగుతోంది. ఇప్పటికే తొలి పోరును వీక్షించేందుకు ఫ్యాన్స్ ఆసక్తి చూపించారు. టికెట్లకు బాగా డిమాండ్ వచ్చింది" అని స్నేహాశీశ్ వెల్లడించారు. తొలి మ్యాచ్ డిఫెండింగ్ ఛాంపియన్ కోల్‌కతా, బెంగళూరు జట్ల మధ్య జరగనుంది.

బీసీసీఐ దృష్టికి తీసుకెళ్లాం: లఖ్‌నవూ ఓనర్

"భద్రతకు సంబంధించి ఏప్రిల్ 6న మ్యాచ్ నిర్వహణ విషయంలో బీసీసీఐదే తుది నిర్ణయం. ఇప్పటికే ఈ అంశాన్ని బోర్డు దృష్టికి తీసుకెళ్లాం. గతేడాది కూడా ఓ మ్యాచ్ విషయంలో ఇలాంటి పరిస్థితే ఎదురైంది. దానిని రీషెడ్యూల్ చేయడం జరిగింది" అని లఖనవూ సూపర్ జెయింట్స్ యజమాని సంజీవ్ గోయెంకా తెలిపారు. గత ఐపీఎల్ సీజన్‌లో కేకేఆర్ రాజస్థాన్ జట్ల మధ్య మ్యాచూ ఇదే పరిస్థితి. అప్పుడు కూడా శ్రీరామనవమి రావడంతో ఆ మ్యాచ్‌ను ఐపీఎల్ కమిటీ రీషెడ్యూల్ చేసింది.




## పెద్ద సినిమాకు ప్రొడ్యూసర్‌గా..



నటిగా అలరిస్తూనే ప్రొడ్యూసర్‌గా మారారు నిహారిక కొణిదెల. 'పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్' పేరిట బ్యానర్ నెలకొల్పారు. దీనిపై ఇప్పటికే 'కమిటీ కుర్రోళ్ళు' సినిమాను నిర్మించి ఆదరణ సొంతం చేసుకున్నారు. ఇప్పుడు ఫీచర్ ఫిల్మ్‌తో అలరించేందుకు సిద్ధమయ్యారు. మానస శర్మ దర్శకత్వంలో ఈ సినిమా రానున్నట్టు ప్రకటించారు. పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ బ్యానర్‌లో మానస క్రియేటివ్ డైరెక్టర్‌గా రెండు సిరీస్‌లకు దర్శకత్వం వహించారు. జీ5 వేదికగా అలరిస్తోన్న 'ఒక చిన్న ఫ్యామిలీ', సోనిలీవ్‌లో టెలికాస్ట్ అవుతోన్న 'బెంచ్ లైఫ్' సిరీస్‌లకు మానస దర్శకత్వం వహించారు. ఆమె దర్శకత్వంలో మూడో ప్రాజెక్ట్ ఇప్పుడు పీచర్ ఫిల్మ్ రానుంది. త్వరలోనే దీనికి సంబంధించిన పూర్తి వివరాలు ప్రకటించనున్నారు.

## ఆమె నన్ను గెలిచింది

తన తదుపరి సినిమా 'ఎస్ఎస్ఎంబీ 29'కు సంబంధించి ఒడిశా షెడ్యూల్‌ను పూర్తి చేసుకున్నారు నటి ప్రియాంకా చోప్రా. షూటింగ్ అనంతరం ఆమె న్యూయార్కు తిరిగి ప్రయాణమయ్యారు. ఈక్రమం లోనే తనకు ఎదురైన ఓఆసక్తికర సంఘటన గురించి తాజాగా ఆమె ఇన్‌స్టా వేదికగా పోస్ట్ పెట్టారు. జామ పళ్లు అమ్మే ఒక మహిళ ప్రవర్తన తనని ఎంతగానో ఆకట్టుకుందన్నారు. ఆ మహిళ తన సాయాన్ని అంగీ కరించలేదని వెల్లడించారు. "ఒక మహిళ తీరునుంచి ఈరోజు నేనెంతో స్ఫూర్తిపొందా.జామపళ్లు విక్రయిస్తు న్న మహిళ దగ్గర రూ.150పళ్లు కొని రూ.200 ఇచ్చా. చిల్లర ఇవ్వబోతుంటే వద్దని.. మిగిలిన డబ్బు ఉంచుకోమని అన్నా. వెంటనే ఆమె మిగిలిన డబ్బుల కి పళ్లను ఇచ్చింది. ఆమె నిజమైన వర్కింగ్ ఉమెన్. సాయాన్ని ఆమె కోరుకోలేదు. ఆమె ప్రవర్తన నా మన సును గెలిచింది"అని ప్రియాంక పేర్కొన్నారు. మహేశ్ హీరోగా రాజమౌళి దర్శకత్వంలో తెరకెక్కుతోన్న భారీ బడ్జెట్ చిత్రంలో ప్రియాంకాచోప్రా కథానాయిక. సినిమాకు సంబంధించిన కీలక సన్నివేశాలను టీమ్ ఒడిశాలోని సిమిలిగుడ పరిసర ప్రాంతాల్లో చిత్రీకరిం చింది. సుమారు 15 రోజులపాటు జరిగిన షెడ్యూల్ ముగిసింది.బుధవారం ఉదయం మహేశ్, ప్రియాంక, రాజమౌళి అక్కడినుంచి తిరుగు ప్రయాణమయ్యారు. కాశీ పట్టణ నేపథ్యంలో సినిమా ఉంటుందని టాక్.

## కలిసే ఉన్నాం.. విడగొట్టకండి



'మహాత్మ'తో తెలుగు ప్రేక్షకుల ఆదరణ సొంతం చేసుకున్నారు నటి భావన. తాజాగా ఆమె ఓ ఇంటర్వ్యూలో తన కెరీర్, వ్యక్తిగత జీవితం గురించి మాట్లాడారు. ముఖ్యంగా భర్త నుంచి తాను విడాకులు తీసుకోనున్నానంటూ జరుగుతోన్న ప్రచారంపై పెదవి విప్పారు. ఆయా కథనాల్లో నిజం లేదని వెల్లడించారు. కొంతమంది కావాలని ఇలాంటి కథనాలు సృష్టిస్తున్నారని చెప్పారు. "సోషల్మీడియాకు చాలావరకూ దూరంగా ఉంటా. మా వ్యక్తిగత జీవితానికి సంబంధించిన ఏ విషయాన్నీ నేను ఆన్‌లైన్‌లో పోస్ట్ చేయను. నా భర్తతో దిగిన ఫొటోలను ఎప్పుడూ పంచుకోలేదు. అందువల్లే చాలా మంది మేమిద్దరం విడిపోతున్నామని మాట్లాడుకుంటున్నారు. మేము కలిసే ఉన్నాం. సంతోషంగా జీవిస్తున్నాం. వ్యక్తిగత గోప్యత కు విలువ ఇస్తుంటా. అందుకే మా ఫొటోలు బయటపెట్టను. అంత దాకా ఎందుకు నేను ఒక సాధారణ ఫొటో షేర్ చేసినా కూడా.. దాని చుట్టూ ఇష్టం వచ్చిన కథలు అల్లుకునేవాళ్లు ఎంతోమంది ఉన్నారు. కాబట్టి మా బంధం బలంగానే ఉందని నిరూపించు కోవడానికి ఫొటోలు షేర్ చేయాలా?"అని ఆమె ప్రశ్నించారు. కేరళకు చెందిన భావన.. నటిగా మల యాళంలో గుర్తిం పు తెచ్చుకున్నారు. 'ఒంటరి'తో తెలుగులోకి హీరోయి న్‌గా ఎంట్రీ ఇచ్చారు. ఆ తర్వాత ఆమె ఇక్కడ పలు సినిమాల్లో నటించారు. 'మహాత్మ' తెలుగులో ఆమె కు మంచిపేరు తెచ్చిపెట్టింది. 2017లో ఆమెపై దాడి జరిగింది. ఒక సినిమా షూటింగ్ నుంచి తిరిగి వస్తోన్న తరుణంలో కొంతమంది ఆమెను కిడ్నాప్ చేసి దాడికి పాల్పడ్డారు. అనంతరం ఆమె సినిమాలకు ఒకింత దూరంగా ఉన్నారు. 2018లో కన్నడ నిర్మాత నవీన్ రమేశ్‌తో ఆమె వివాహం జరిగింది. సినిమాలకు దూరంగా ఉండటంపై తాజాగా ఆమె మాట్లాడారు. సినిమాలను తాను సీరియస్‌గా తీసుకోలేదని.. అందుకే తనకు అవకాశాలు తగ్గాయని చెప్పారు.

## నన్ను జడ్జిచేసేవాళ్లంతా వాళ్ల అర్హతలు జడ్జిచేసుకోవాలి..

చిత్ర పరిశ్రమకు చెందిన వారిపై నటి, ఎంపీ కంగనా రనౌత్ ఆగ్రహం వ్యక్తంచేశారు. తన స్వీయ దర్శకత్వంలో తెరకెక్కిన 'ఎమర్జెన్సీ' చిత్రాన్ని ఉద్దేశించి దర్శక నిర్మాత సంజయగుప్తా ఇచ్చిన రివ్యూపై ఆమె స్పందించారు. కంగన తన అంచనాలు తప్పని నిరూపించారని ఆయన పేర్కొనడంపై ఆమె మాట్లాడారు. ముందుగానే తనపై ఒక అభిప్రాయానికి రావొద్దని విజ్ఞప్తి చేశారు. "నాపై ముందుగానే ఒక అభిప్రాయానికి వచ్చినట్టు ఆయన తన పోస్టులోనే అంగీకరించారు. నన్ను అర్థం చేసుకోవడంలో మీరు పరాజయం అయినప్పుడు.. మళ్లీ నాపై ఒక అభిప్రాయానికి రావాలని ఎందుకు అనుకుంటున్నారు? తన అభిప్రాయం తప్పిందని ఆయన పేర్కొన్నారు. నేను ఎలాంటి సినిమా చేశానో మీకు ముందే ఎలా తెలుసు? నా గురించి ముందే తెలుసుకునేందుకు మీవద్ద ఏమైనా అద్భుత శక్తులు ఉన్నాయా? ఒక వ్యక్తి గురించి ఏదైనా అభిప్రాయానికి రావాలంటే వాళ్ల గురించి అన్ని విషయాలు తెలుసుకొని ఉండాలి. అయినా నన్ను జడ్జ్ చేసేందుకు మీకున్న అర్హతలు ఏమిటి? మీరు ఎలాంటి సినిమాలు రూపొందించారు? ఇండస్ట్రీలో ఉన్నవాళ్లు కూడా.. తాము ఎలాంటి సినిమాలు తెరకెక్కిస్తున్నారో ఒక్కసారి చెక్ చేసుకోవాలి" అని ఆమె పేర్కొన్నారు.

మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జీవితం ఆధారంగా 'ఎమర్జెన్సీ' చిత్రాన్ని రూపొందించారు. ఈ సినిమాకు దర్శకత్వం వహించి నిర్మాతగానూ వ్యవహరించిన కంగనా ఇందిరాగాంధీ పాత్రలో నటించారు. జయప్రకాష్ నారాయణ్ పాత్రలో అనుపమ్ ఖేర్, మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజపేయి పాత్రలో శ్రేయస్ తల్పడే కనిపించారు. ఎన్నో అడ్డంకులు దాటుకుని ఈ ఏడాది ఇది ప్రేక్షకుల ముందుకువచ్చింది. ప్రస్తుతం ఇది ఓటీటీలో అందుబాటులో ఉంది.



## చౌర్యపాఠం నుండి ఆడ పిశాచం సాంగ్

దర్శకుడు త్రినాథరావు నక్కిన నిర్మించిన క్రైమ్, కామెడీ డ్రామా 'చౌర్య పాఠం'. ఇంద్రా రామ్‌ను హీరోగా పరిచయం చేయడంతోపాటు చందు మొం డేటి అసోసియేట్ నిఖిల్ గొల్లమారిని కూడా డైరెక్టర్ గా ఇంట్రడ్యూస్ చేస్తున్నారు.ఈ సినిమాకు వి.చూడా మణి సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికే సినిమా నుండి ప్రమోషనల్ సాంగ్ వచ్చింది. దానిని నాగచైతన్య విడుదల చేశారు.దానికి మంచి స్పందన వచ్చిందని మేకర్స్ చెబుతున్నారు. తాజాగా 'చౌర్య పాఠం' మూవీ నుండి 'ఆడ పిశాచం' అనే పాటను విడుదల చేశారు.'ఈగిల్' ఫేమ్ దావ్‌జాండ్ సంగీతా న్ని అందించిన ఈపాటను భాస్కరభట్ల రవికుమార్ రాశారు. ఆంథోనీ దాసన్ దీనినిపాడారు. ఈపాటకు విజయ్ బిన్ని కొరియోగ్రఫీ చేశారు. ఈ మూవీకి ప్రముఖ సినిమాటోగ్రాఫర్,డైరెక్టర్ కార్తీక్ ఘట్టమనే ని కథను అందించారు. పాయల్ రాధాకృష్ణ హీరో యిన్‌గా నటిస్తున్న సినిమాలో ఇతరకీలక పాత్రలను రాజీవ్ కనకాల, మస్త అలీ, మాడి మానేపల్లి, అంజి వల్గుమాన్,సుప్రియ ఐసోలాతదితరులు పోషించారు. 'చౌర్యపాఠం'మూవీ ఏప్రిల్ 18న విడుదల కానుంది.

